thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 15 | కరీంనగర్ బుధవారం, 26 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కర్ణాటక హనీట్రాప్‌పై సుప్రీంలో పిల్

బెంగళూరు : కర్ణాటకలో ఇద్దరు మంత్రులు సహా వివిధ పార్టీలకు చెందిన 48 మంది ఎమ్మెల్యేలతో పాటు న్యాయమూర్తులు, కేంద్ర నాయకులపై హనీట్రాప్ జరిగిందంటున్న అంశంపై స్వతంత్రంగా విచారణ జరిపించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. జారండ్‌లోని ధన్‌బాద్ నివాసి వినయ్‌కుమార్ దీన్ని దాఖలు చేశారు. తనపై హనీట్రాప్ జరిగిందని కర్ణాటక మంత్రి రాజణ్ణ శాసనసభలో స్వయంగా ప్రస్తావించడం, మీడియాలో వచ్చిన కథనాలను ఉటంకించారు.

దీనిని అత్యవసరమైనదిగా భావించి, విచారణ జరపాలని కోరారు. స్పందించిన సీజేఐ జస్టిస్ ఖన్నా ధర్మాసనం ఒకట్రెండు రోజుల్లోనే విచారణ చేపడతామని తెలిపింది.




## జీహెచ్ఎంసీ, హైడ్రా కీలక నిర్ణయం.. రెండు కమిటీల ఏర్పాటు

హైదరాబాద్: నగరంలో వరుసగా జరుగుతోన్న అగ్ని ప్రమాదాలు, వర్షాకాలంలో ఎదురయ్యే వరద ముంపు నివారణకు పరిష్కారంపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎం సీ), హైడ్రా ప్రత్యేకంగా దృష్టి సారించాయి. వరద ముంపుతోపాటు అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమైన హైడ్రా, జీహెచ్ఎంసీ కమిషనర్లు రంగనాథ్, ఇలంబర్తి.. వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలు, అగ్నిప్రమాదాల నివారణపై సమీక్షించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖతో పాటు హైడ్రా, జీహెచ్ఎంసీ విభా గాలతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, వర్షాకాలంలో వరద ముంపు నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసేందు కు ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులతో మరో కమిటీ వేయాలని కమిషనర్లు నిర్ణయించారు. ఈ రెండు కమిటీలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారుల సమన్వయంతో సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాయని పేర్కొన్నారు.

# జమిలి ఎన్నికలు.. జేపీసీ గడువు పొడిగింపు



దిల్లీ: జమిలి ఎన్నికల కోసం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ కాల పరిమితిని పెంచేందుకు లోక్‌సభ అంగీకరించింది. భాజపా ఎంపీ పీపీ చౌదరి ప్రతిపాదించిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. వర్షాకాల సమావేశాల చివరివారంలో తొలి రోజు వరకు గడువు పొడిగించింది. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు ను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటైంది. దీనిలో లోక్‌సభ నుంచి 27, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. అయితే.. ఈ కమిటీ కాలపరిమితి వచ్చేనెల 4న ముగియనుంది. ఈ బిల్లుపై చేయాల్సిన పని ఇంకా మిగిలివుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంపై పలువురు న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిగాయి. ఇప్పటికే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రఖ్యాత న్యాయకోవిదుడు హరీశ్ సాల్వే, దిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.పి.షాలు కమిటీ ముందు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేశారు. జేపీసీ గడువు పొడిగించే తీర్మానానికి లోక్‌సభ తాజాగా ఆమోదం తెలిపింది.

# కాంగ్రెస్ హైకమాండ్...

# గ్రీన్ సిగ్నల్!

## కొత్త మంత్రుల ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఫిక్స్




హైదరాబాద్ : తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఉగాది పండుగలోపు మంత్రివర్గ విస్తరణ చేసి.. ఏప్రిల్ మూడో తేదీన కొత్త మంత్రుల చేత ప్రమాణ స్వీకారం చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కొత్తగా మంత్రివర్గంలోకి ఇద్దరు బీసీ, ఒక ఎస్సీ, ఒక రెడ్డికి అవకాశం లభించినట్లు తెలుస్తోంది. బీసీల్లో శ్రీహరి ముదిరాజ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్సీల్లో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఒకవేల మైనార్టీలకు అవకాశం ఇస్తే ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, రెడ్డిల్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం లభించినట్లు తెలుస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు కొత్త ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అభిప్రాయాలు తీసుకొని వీరిని ఏఐసీసీ ఫైనల్ చేసినట్లు సమాచారం. మరోవైపు.. మంత్రివర్గ విస్తరణలో కచ్చితంగా తమకు పదవి దక్కుతుందన్న ఆశతో మరికొంతమంది ముఖ్య నేతలు ఇంకా పావులు కదుపుతున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బలూ నాయక్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. మరి వీరికి హైకమాండ్ ఎలా సర్దిచెబుతుందో చూడాలి. ఉగాదికి ముందు వెనక కచ్చితంగా విస్తరణ ఉండడం ఖాయం అన్న ప్రచారం నేపథ్యంలో పదవి ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ అటు కాంగ్రెస్ వర్గాలతో పాటు ఎమ్మెల్యేల అనుచారుల్లో ఉంది. రాష్ట్రంలో 6 మంత్రి పోస్టులు ఖాళీగా ఉండగా.. ఎవరెవరికి ఇవ్వాలన్న విషయంపై కూడా అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అందుకే సీఎం రేవంత్ రెడ్డి, భట్టి, ఉత్తమ్ హుటాహుటిన ఢిల్లీకి పయనమైనట్టు సమాచారం అందుతోంది. అయితే.. ఈ ఆరు పోస్టుల కోసం రాష్ట్రంలోని పలువురు నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో మంతనాలు కూడా చేస్తున్నారు. అయితే.. ఈ ఆరు మంత్రి పదవులను గిరిజన, దళిత, వెనుకబడిన వర్గాలతో పాటు ఆయా జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించే ప్రతిపదికన ఇవ్వాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో.. బీసీ, ఎస్సీ, రెడ్డి, మైనారిటీ లేదా ఎస్టీకి ఒకటి చొప్పున ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. బీసీల్లో మున్నూరు కాపు, పద్మశాలి, గౌడ, ముదిరాజ్ వర్గాలకు చెందిన నేతలకు అవకాశం కల్పించనున్నట్టు సమాచారం.పరిశీలనలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, సుదర్శన్ రెడ్డిల పేర్లు ఉన్నాయి. మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావులను తొలగించి విజయశాంతికి, ప్రేమ్ సాగర్ రావులకు అవకాశం ఇస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతుంది.




# సంక్షోభంలో తెలుగు రాష్ట్రాలు!

## పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రా - తెలంగాణ అప్పులు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ : గత ప్రభుత్వంలో కంటే ఈ ప్రభుత్వంలో అప్పులు మరింత అధికమయ్యాయంటూ ప్రతిపక్షాలతోపాటు వామపక్ష పార్టీల నేతలు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలపై వరుస విమర్శలు గుప్పిస్తోంటారు. అలాంటి వేళ.. కేంద్రంతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలు చేసిన అప్పులు.. వాటి వివరాలతోపాటు దేశంలో అత్యధికంగా అప్పులు చేసిన రాష్ట్రాల జాబితాను కేంద్రం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించింది. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. 2025, మార్చి 30 నాటికి ఆంధ్రప్రదేశ్ అప్పు రూ. 5, 62, 557 కోట్లు కాగా.. తెలంగాణ రాష్ట్రంపై రూ.4, 42, 298 కోట్ల భారం ఉందని స్పష్టం చేశారు. ఏపీ అప్పులో స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) 34.7 శాతంగా ఉండగా.. తెలంగాణ అప్పులో జీఎస్‌డీపీ 26. 2శాతంగా నమోదు అయిందని చెప్పారు. అన్ని రాష్ట్రాల కంటే అత్యధికంగా తమిళనాడు అప్పు రూ.9,55,691 కోట్లుతో అగ్రస్థానంలో ఉందని కేంద్ర మంత్రి పంజక్ చౌదరి వెల్లడించారు. ఆ తర్వాత వరుస స్థానాల్లో రూ. 8, 57, 844 కోట్లతో ఉత్తరప్రదేశ్, రూ.8,12, 068 కోట్లతో మహారాష్ట్ర, రూ.7, 25, 456 కోట్లతో కర్ణాటక, రూ.7,14,196 కోట్లతో పశ్చిమబెంగాల్ ఉన్నాయని పేర్కొన్నారు. అయితే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా ప్రకారం.. 2025, మార్చి 31వ తేదీ నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి అప్పు రూ. 2, 67, 35, 462 కోట్లు ఉంటుందని కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి సోదాహరణతో వి వరించారు. ఏపీ ప్రభుత్వఅప్పుల వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ మ రోసారి బయటపెట్టింది. ఏడాదికి ఏడాది అప్పులు పెరుగుతున్నట్లు అర్థమవుతోంది. అయితే ఏడాదికి ఏడాది ఈ అప్పులు పెరుగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీగా అప్పులు పెరిగాయని కూటమి ఆరోపించింది. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామని కూడా చెప్పుకొచ్చింది. కూటమి పాలనలో కూడా అప్పులకు చెక్ పడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**స్పష్టమైన ప్రకటన...** ప్రస్తుతం ఏపీ అప్పు అక్షరాల రూ.5.62 లక్షల కోట్లు అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తిలో అప్పులు 34.70% ఉంటాయని వెల్లడించారు. సోమవారం లోక్ సభలో ఎంపీ మనీష్ తివారి అడిగిన ప్రశ్నకు దేశంలోని రాష్ట్రాల అప్పుల వివరాలను పంకజ చౌదరి వెల్లడించారు. రాష్ట్రాల నికర రుణ పరిమితిని ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని తెలిపారు.

అన్ని రాష్ట్రాలు ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టాన్ని అమలు చేస్తున్నాయని కూడా చెప్పారు.

**ఏటా పెరుగుతున్న అప్పులు...** అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీగా అప్పులు పెరిగాయని ఆరోపణలు ఉన్నాయి. 2019లో రాష్ట్ర అప్పులు రూ. 2,64,451 కోట్లు ఉండగా..2020లో రూ. 3,07,671 కోట్లు, 2021లో రూ. 3,53,021 కోట్లు, 2022లో సవరించిన అంచనాల తరువాత రూ. 3,93,718 కోట్లు, 2023లో బడ్జెట్ అంచనాల ప్రకారం ఏపీ ప్రభుత్వ అప్పు రూ. 442442 కోట్లు. 2024 నాటికి ఏపీ అప్పులు 5 లక్షల కోట్లకు దాటాయి. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఓ 50 వేల కోట్ల అప్పులు పెరిగాయి. అయితే ఉన్న అప్పులు తీర్చుకునేందుకు కొత్త అప్పులు తప్పడం లేదని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓ 20 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని.. కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని కూటమి ప్రభుత్వం చెబుతోంది.

**వథకాలు అమలు కాకముందే..** ఏపీలో ఇంకా సంక్షేమ పథకాలుఅమలు ప్రారంభం కాలేదు. తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. అందులో కీలకమైనవి అన్నదాత సుఖీభవ తో పాటు తల్లికి వందనం. ఈ రెండు పథకాలు అమలు చేసేందుకు 25 వేల నుంచి 30 వేల కోట్ల రూపాయల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది.

ఏపీ ఆదాయం చూస్తే అంతంతమాత్రంగా ఉంది. ఈ పథకాలకు వేలకోట్లు అప్పు అనివార్యం. అందుకే ముమ్ముందు ఈ అప్పులు మరింత పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.



# మిర్చి రేటు ఢమాల్..
## రోజు రోజుకు పడిపోతున్న 'తేజ'రకం ధర

ఖమ్మం: తేజ రకం మిర్చి ధర రోజురోజుకూ పతనమవుతోంది. ఖమ్మం మార్కెట్‌లో ఈ సీజన్‌లో అత్యంత తక్కువగా జెండా పాట రూ.13,350గా నమోదైంది. సీజన్ ప్రారంభంలో కొత్త మిర్చి వచ్చిన టైంలో క్వింటాల్‌కు రూ.19 వేలు పలుకగా.. తర్వాత రేటు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఒక్క నెలలోనే క్వింటాల్‌కు రూ.2500 వరకు రేటు పడిపోయింది. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి, కూలీలు, రవాణా ఖర్చులు భరించి మార్కెట్‌కు పంటను తీసుకొస్తే కనీస ధర కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఇస్తున్న రేటుకు కూలీల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ. 6 వేల నుంచి రూ. 11,500 మధ్యే...** ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్‌కు సోమవారం సుమారు 60 వేల బస్తాల మిర్చి రాగా.. ఇందులో 55 వేలకు పైగా బస్తాలను రూ.12 వేల లోపు ధరకే వ్యాపారులు కొనుగోలు చేశారు. ఎక్కువ లాట్లను రూ.6 వేల నుంచి రూ.11,500 వరకే కొన్నారు. మిర్చి క్వాలిటీ ఆధారంగా రేటు తగ్గుతుందని ట్రేడర్లు, వ్యాపారులు చెబుతుండగా.. రైతులు మాత్రం తమకు గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. అయితే విదేశాలకు ఎగుమతులు జరగకపోవడం వల్ల మిర్చికి డిమాండ్ లేదని వ్యాపారులు చెబుతున్నారు. చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతులు జరిగిన సమయంలో క్వింటాల్‌కు రూ.25 వేల వరకు పలికిందని, ప్రస్తుతం ఎగుమతులు తగ్గిపోవడంతో రేటు తగ్గిందని అంటున్నారు.

**కోల్డ్ స్టోరేజీలకు తరలింపు...** మిర్చి రేటు రోజురోజుకు పడిపోవడమే తప్ప పెరగకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. డబ్బులు అత్యవసరం ఉన్న వారు మాత్రం వచ్చిన రేటుకు పంటను అమ్ముకుంటుండగా, భవిష్యత్‌లోనైనా మంచి రేటు రాకపోతుందా అని ఆలోచిస్తున్న వారు మాత్రం తమ పంటను కోల్డ్ స్టోరేజీల్లో భద్రపరుచుకుంటున్నారు. పంట సీజన్?పూర్తైన తర్వాత డిమాండ్ వస్తుందన్న ఆశతో ఉంటున్నారు. ఖమ్మం జిల్లాలో 2.20 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం గల 48 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. మూడేండ్ల కింద ఖమ్మం మార్కెట్‌లో మిర్చి పాతిక వేలను తాకింది. ఆ తర్వాత క్రమంగా ధర తగ్గుతూ వచ్చింది. గతేడాది కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉండడంతో ఎక్కువ మంది వ్యాపారులు రైతుల నుంచి తక్కువ రేటుకు మిర్చిని కొని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు. మళ్లీ రూ.25 వేలకు పెరగకపోతుందా అన్న ఆశతో క్వింటాల్ మిర్చిని రూ.16 వేల నుంచి రూ.18 వేలకు కొని ఏసీలో పెట్టారు. కానీ ఈ సీజన్ ప్రారంభంలో మళ్లీ రూ.19 వేల నుంచే రేటు మొదలై క్రమంగా తగ్గుతూ వస్తోంది. దీంతో ఎక్కువ మంది వ్యాపారులు, రైతులు నష్టపోయారు. అయినా ఇప్పుడు కూడా అన్‌సీజన్‌లో రేటు పెరుగుతుందన్న ఆలోచనతో కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. అక్కడ దాచుకున్న పంటను గ్యారంటీగా పెట్టి 'రైతు బంధు' కింద బ్యాంకుల నుంచి లోన్ తీసుకుంటున్నారు. మరోవైపు మార్కెటింగ్ శాఖ ఆఫీసర్లు కూడా రైతులకు ఇదే విషయాన్ని చెబుతున్నారు. తక్కువ రేటుకు అమ్ముకోకుండా, అవసరమైతే పంటను దాచుకోవాలని సూచిస్తున్నారు.

**వ్యవసాయ కూలీగానే బాగుంది...** మిర్చి రేటు ఈ రకంగా తగ్గితే వ్యవసాయం కంటే కూలీగా పని చేయడమే మంచిది అనిపిస్తోంది. ఎకరానికి రూ. 16 వేలు కౌలు చెల్లించి రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. 13 క్వింటాళ్ల దిగుబడి రావడంతో మార్కెట్‌కు తీసుకొస్తే కాయ పచ్చిగుందని చెప్పిన్రు. నన్ను కనీసం మాట్లాడనీయకుండా నా పంటకు క్వింటాల్‌కు రూ. 8 వేలు ఇస్తామన్నారు. 170 మంది కూలీలకు రూ. 350 చొప్పున ఇచ్చి పని చేయించిన. మిర్చిని మార్కెట్‌కు తీసుకొచ్చేందుకురూ. 7 వేల కిరాయి అయింది. క్వింటాల్‌కు కనీసం రూ. 20 వేలు ఇచ్చినా ఖర్చులకే సరిపోతాయి. – గన్నెబోయిన శంకర్, మైలాపురం, నల్గొండ జిల్లా

**పెట్టుబడి అయినా వస్తే చాలు...** నేను రెండు ఎకరాల్లో మిరప సాగు చేశాను. 19 బస్తాల దిగుబడి వచ్చింది. దానిని తీసుకొని మార్కెట్‌కు వస్తే క్వింటాల్‌కు రూ. 12 వేలు మాత్రమే ఇస్తాంటున్నారు. 42 మంది కూలీలతో పని చేయించి ఒక్కో కూలీకి రూ.350 చొప్పున ఇచ్చాను. రెండు ఎకరాలకు మొత్తం రూ. 1.80 లక్షల ఖర్చు అయింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. మా పెట్టుబడి, కష్టాన్ని చూసి ప్రభుత్వమే రేటు నిర్ణయించాలి. – లకావత్ శుక్లా, మానాపురం, తుంగతుర్తి మండలం, సూర్యాపేట జిల్లా



# ట్రంప్ సోషల్ ప్రతిపాదన..
## గ్రీన్‌కార్డుదారుల్లో గుబులు..!

అమెరికాలో అక్రమ వలసదారుల ఏరివేత లక్ష్యంగా డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా సోషల్ మీడియా ఖాతాలపై దృష్టిపెట్టిన ట్రంప్ ప్రభుత్వం.. ఆ పరిధిని మరింత విస్తరించాలని ప్రతిపాదించింది. దానికింద అమెరికాలో నివసిస్తోన్న గ్రీన్‌కార్డ్‌దారులంతా తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను అప్పగించాల్సి రావొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే వీసా దరఖాస్తుదారులు యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌కు తమ ఖాతాల వివరాలను వెల్లడించాల్సి ఉంది. కొత్త ప్రతిపాదన అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తోన్న, శాశ్వత నివాసం, ఆశ్రయం కోరుతున్న వారికీ వర్తిస్తుంది. ఈ ప్రక్రియ మెరుగైన గుర్తింపు ధ్రువీకరణను సాధ్యం చేస్తుందని, దేశ భద్రతకు సంబంధించిన ముప్పును నివారించేందుకు దోహదం చేస్తుందని అమెరికా ప్రభుత్వం గత నోటీసుల్లో పేర్కొంది. గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు అంటూ అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు లక్షల మంది వలసదారుల్లో, ముఖ్యంగా భారత సంతతి వారిలో గుబులు రేపుతోంది. దీనికి అనుగుణంగానే గత కొన్ని వారాలుగా అమెరికా తమ వలస చట్టాలను కఠినతరం చేయడం వలసదారుల్లో ఆందోళనను పెంచుతోంది. ఇక తాజా ప్రతిపాదన కింద.. అమెరికా విధానాలు విమర్శించేవారు ఆ దేశాన్ని తమ నివాసంగా మార్చుకోకుండా నిరోధించే వీలు కలుగుతుంది. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తూ, యూఎస్–భారత్ సంబంధాల్లో చురుకైన పాత్ర పోషిస్తోన్న పలువురు భారత సంతతి వ్యక్తులపై ఈ ప్రతిపాదనలు ప్రభావం చూపేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రాజకీయ అంశాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేసే పరిస్థితి లేకుండా పోతుందనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఇటీవల యూఎస్ ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేశారు. హెచ్–1బీ, ఎఫ్–1, గ్రీన్‌కార్డు కలిగిన భారతీయులు ప్రయాణాల్లో అప్రమత్తత పాటించాలని సూచించారు. వీరు అమెరికాలో ప్రవేశించే, నిష్క్రమించే సమయంలో తనిఖీలు మరింత ఎక్కువగా ఉంటాయని, సహనంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 43 దేశాలకు చెందిన పౌరులు అమెరికాలోకి రాకుండా నిషేధం విధించాలని ట్రంప్ సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ ఈ ఆంక్షల జాబితాలో లేనప్పటికీ.. అమెరికా వెలుపల ప్రయాణాలు చేయాలనుకునే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. జనవరి 20న ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయగానే.. అమెరికా ప్రజల రక్షణకు సంబంధించిన పలు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. "గత నాలుగేళ్లలో అమెరికాలో అక్రమ వలసదారులు పోటెత్తారు. లక్షల మంది సరైన పత్రాలు లేకుండానే మన సరిహద్దులు దాటి దేశంలోకి వచ్చారు. ఆ తర్వాత ఇక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ దేశ భద్రత, ప్రజల రక్షణకు ముప్పుగా మారుతున్నారు. అందుకే అక్రమ వలసదారుల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం" అని ట్రంప్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# ప్రసాదాలపై జీఎస్టీ మినహాయింపు
## లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన

దిల్లీ: వస్తు, సేవల పన్ను నుంచి ప్రసాదాన్ని మినహాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం లోక్‌సభలో జరిగిన ఆర్థిక బిల్లు 2025పై చర్చలో ఆమె మాట్లాడారు.

ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు చేశారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు ఎలాంటి జీఎస్టీ వర్తించబోదని స్పష్టం చేశారు.

**డిజిటల్ పన్ను రద్దు..** ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ లేదా డిజిటల్ పన్నును కూడా రద్దు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అస్థిర పరిస్థితులను తొలగించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025 (%ఖీఱఅఖఅఎవ దీఅశ్రీశ్రీ% 2025)కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇదీ ఉంది.

**దయచేసి లైన్‌లో ఉండండి.. 15 బిలియన్ గంటలట!...** ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తామని అమెరికా బెదిరిస్తున్న నేపథ్యంలో.. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సంస్థలకు అనుకూలంగా ఉండేలా ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ తొలగించాలనే ప్రతిపాదన తీసుకొచ్చినట్లు నిపుణులు భావిస్తున్నారు. 2016 జూన్ 1 నుంచి ఆన్‌లైన్ ప్రకటన సేవలపై 6శాతం ఈక్వలైజేషన్ లెవీ విధిస్తున్నారు. ఇప్పుడా పన్నును రద్దు చేస్తున్నట్లు నిర్మలమ్మ వెల్లడించారు.

**ఆదాయపు పన్ను బిల్లు వర్షాకాల సమావేశాల్లోనే..** ఇక, బడ్జెట్ తొలి విడత సమావేశాల్లో తీసుకొచ్చిన నూతన ఆదాయపు పన్ను బిల్లును తదుపరి పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో చర్చకు తీసుకొస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. ఫిబ్రవరి 13న ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

అనంతరం దీన్ని సెలెక్ట్ కమిటీకి పంపించారు. ఈ కమిటీ దీనిపై అధ్యయనం చేసి వచ్చే పార్లమెంట్ సమావేశాల తొలి రోజు నాటికి నివేదికను సమర్పించాల్సి ఉంది. అందువల్ల దీనిపై వర్షాకాల సమావేశాల్లో చర్చ చేపడుతామని ఆర్థిక మంత్రి తెలిపారు. ఇక, తయారీ రంగానికి ఊతం ఇచ్చేందుకు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు, సామాన్యులకు ఉపశమనం కలిగించేందుకే కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధీకరిస్తామని నిర్మలమ్మ వివరించారు. అనంతరం ఈ ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మరో మృతదేహం వెలికితీత

అమ్రాబాద్: నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా మరో మృతదేహాన్ని గుర్తించి.. అధికారులు వెలికితీశారు. అనంతరం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. ఈ ఘటనలో మొత్తం 8 మంది కార్మికుల గల్లంతు కాగా.. ఇటీవల ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో ఆరుగురి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతి చెందిన వ్యక్తి ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్‌కుమార్‌గా అధికారులు గుర్తించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని స్వస్థలానికి పంపిచేందుకు ఏర్పాట్లు



చేస్తామని జిల్లా కలెక్టర్ సంతోషకుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు అందిస్తామన్నారు

# అసెంబ్లీ అంటే అదీ.. మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు




హైదరాబాద్, మార్చి 25: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఏది మాట్లాడినా సంచలనమే. ఏం చేసినా ఆసక్తికరమే. ఆయన మీడియా ముందుకు వచ్చారంటే చాలు ఏదో విషయంపై మాట్లాడుతూ నవ్వులు పూయిస్తుంటారు. ఇప్పుడు తాజాగా మల్లారెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో.. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు. గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. అంతే కాకుండా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, వివేక్ మధ్య జరిగిన సంభాషణ కూడా ఆసక్తికరంగా మారింది.

**మల్లారెడ్డి కామెంట్స్ ఇవే..** పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజ్‌పేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసేవారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అత్తుకుని పోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సంచలనంగా మారాయి.

**మల్లారెడ్డి, వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ...** ఇక.. అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. ఈరోజు అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. 'వివేక్‌ను.. నమస్తే మంత్రి గారు' అంటూ మల్లారెడ్డి పలకరించారు. ఇందుకు థాంక్స్ మల్లన్న అని పలకరించారు వివేక్ వెంకటస్వామి. రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్యామిలీ, వివేక్ వెంకటస్వామి ఫ్యామిలీదే హవా నడుస్తోందంటూ మల్లారెడ్డి కామెంట్స్ చేయగా.. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్, మల్లారెడ్డిదే హవా నడిచిందని వివేక్ సమాధానం ఇచ్చారు. 'మేము అధికారం కోల్పోయాం మాదేం లేదన్న' అంటూ మల్లారెడ్డి అనడంతో ఇద్దరు నేతల మధ్య నవ్వులు పూశాయి.

# కేటీఆర్‌కు రాజాసింగ్ మాస్ వార్నింగ్

హైదరాబాద్, మార్చి 25: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వార్నింగ్ ఇచ్చారు. పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన.. పోలీసు శాఖతో పెట్టుకోవద్దని మాజీ మంత్రిని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశంతో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. ఏకంగా రేవంత్ రెడ్డి బెడ్‌రూమ్‌లోకి చొచ్చుకెళ్లి మరీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడా.. ఆ సమయంలో తనను అరెస్ట్ చేసిన వారిని ఏమీ చేయలేదని తెలిపారు. కానీ 'మేము అధికారంలోకి వచ్చాక రిటైరైన పోలీసుల మీద కూడా చర్యలు తీసుకుంటాం' అని ఇప్పుడు కేటీఆర్ అంటున్నారని.. పోలీసు శాఖతో పెట్టుకోవద్దు అంటూ మాజీ మంత్రికి ఎమ్మెల్యే మాస్ వార్నింగ్ ఇచ్చారు.

# ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలం?: సుప్రీంకోర్టు

దిల్లీ: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదన్నారు. నోటీసు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడారని.. ఆ తర్వాత కూడా భారాసలోనే ఉన్నామంటున్నారని చెప్పారు. "ఫిర్యాదులపై ఏం చేస్తారో.. 4 వారాల్లో షెడ్యూల్ చేయాలని కోర్టు ఆదేశించింది. అయినా పార్టీ మారిన వారికి స్పీకర్ నోటీసులు ఇవ్వలేదు. ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారు. 3 వారాల్లో రిప్లై ఇవ్వాలని.. ఫిబ్రవరి 13న స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికి 3 వారాలైంది.. నోటీసులు ఎటు వెళ్లాయో తెలియదు. మేము ఫిర్యాదు చేసి ఏడాదైనా స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదు" అని సుందరం తెలిపారు. ఈక్రమంలో స్పందించిన జడ్జి జస్టిస్ గవాయ్.. పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా అని వ్యాఖ్యానించారు. %ఇలాంటి వ్యవహారాల్లో రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు ఉన్నాయని జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పేర్కొంది. ఎప్పటిలోగా తేల్చాలనే విషయంలో గత తీర్పులు స్పష్టంగా చెప్పలేదని పేర్కొంది. అలాంటప్పుడు ఆ తీర్పును కాదని ఎలా ముందుకు వెళ్లగలమని చెప్పింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలమని ప్రశ్నించింది. పిటిషనర్ల వాదనలు ముగియడంతో విచారణను సుప్రీంకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది.




# ఎంఎంటీఎస్‌లో మహిళపై అత్యాచారయత్నం..
## అదుపులో అనుమానితుడు

హైదరాబాద్: కదులుతున్న ఎంఎంటీఎస్ రైల్లో యువతిపై అత్యాచారయత్నం ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనలో ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని మేడ్చల్ జిల్లా గౌడవల్లి గ్రామానికి చెందిన జంగం మహేశ్‌గా గుర్తించారు. అతడి ఫొటోను బాధితురాలికి చూపించగా.. అనుమానితుడిని ఆమె సరిగా గుర్తించలేకపోయినట్లు సమాచారం. ఏడాది క్రితమే మహేశ్‌ను భార్య వదిలివేసింది. తల్లిదండ్రులు కూడా చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. గంజాయికి బానిసైన అతడు పాత నేరస్థుడని పోలీసులు పేర్కొన్నారు. మొత్తం నాలుగు బృందాలుగా విడిపోయి పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. సికింద్రాబాద్‌తోపాటు అక్కడి నుంచి మేడ్చల్ వరకూ 28 కిలోమీటర్ల ప్రాంతంలోని రైల్వేస్టేషన్లలో అన్ని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన యువతి నగరంలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తోంది. మేడ్చల్‌లో ఉంటున్న యువతి ఈనెల 22న సాయంత్రం సెల్‌ఫోన్ రిపేరు కోసం సికింద్రాబాద్ వచ్చింది. రాత్రి 7.15 గంటలకు సికింద్రాబాద్‌లో తెల్లాపూర్–మేడ్చల్ ఎంఎంటీఎస్ రైలులోని మహిళల బోగీలో ఎక్కింది. రైలు 8.15 గంటల సమయంలో అల్వాల్ స్టేషన్‌కు చేరుకున్నాక బోగీలోని ఇద్దరు మహిళలు దిగిపోవడంతో యువతి ఒక్కతే ఉంది. బోగీలో ఉన్న ఆగంతకుడు యువతి దగ్గరకెళ్లి లైంగిక వాంఛ తీర్చాలంటూ శరీరాన్ని తాకుతూ పట్టుకోవడానికి ప్రయత్నించాడు. భయపడిన యువతి కొంపల్లి సమీపంలో ఒక్కసారిగా రైలు నుంచి దూకింది. తీవ్రగాయాలతో పట్టాల పక్కన పడి ఉన్న యువతిని స్థానికులు గమనించి 108లో గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# మీర్‌పేట మాధవి హత్య కేసు.. పోలీసుల చేతికి డీఎన్ఏ రిపోర్ట్

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మీర్‌పేట మాధవి హత్యకేసులో డీఎన్ఏ రిపోర్టు పోలీసులకు చేరింది. భర్త గురుమూర్తి.. మాధవిని హత్య చేసి, ముక్కలుగా నరికి ఉడకబెట్టి ఎముకలను పొడిగా చేసి చెరువులో వేశాడు. ఎలాంటి ఆధారాలు లేకుండా ధ్వంసం చేసేందుకు ప్రయత్నించాడు. ఇంట్లో దొరికిన టిష్యూస్ ఆధారంగా పోలీసులు గురుమూర్తిని అరెస్టు చేశారు. క్లూస్ టీమ్ ఇచ్చిన టిష్యూస్‌ను డీఎన్ఏ పరీక్షల కోసం పోలీసులు పంపించగా.. మాధవి డీఎన్ఏ తల్లి, పిల్లల డీఎన్ఏతో మ్యాచ్ అయినట్టు ఫోరెన్సిక్ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగ రోజున గురుమూర్తి తన భార్య మాధవిని ముక్కలుగా నరికి.. కాల్చి పొడి చేసిన విషయం తెలిసిందే.






ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ స్టాక్స్ సూచీలను ముందుండి నడిపించాయి. దీంతో వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీలు భారీగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా లాభపడడంతో చాలా రోజుల తర్వాత మళ్లీ 78 రోజుల మార్కును అందుకుంది. నిఫ్టీ 23,700 స్థాయిని దాటింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్ల మేర పెరిగి రూ.418 లక్షల కోట్లకు చేరింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం ఒక శాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 77,456.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,905.51) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 78,107.23 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1078.87 పాయింట్ల లాభంతో 78వేలకు కాస్త దూరంలో 77,984.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 23,700 పాయింట్ల మార్కును దాటింది. చిరికి 307.95 పాయింట్లు లాభపడి 23,658.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 35 పైసలు బలపడి 85.64కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.54 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3030 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవే..** గత కొన్ని నెలలుగా విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలకు దిగడంతో మార్కెట్లు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాయి. గత మూడు నాలుగు సెషన్లుగా నెట్ బయ్యర్లుగా నిలుస్తుండడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. శుక్రవారం పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు దాదాపు రూ.7,470 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అమెరికాలో బాండ్ల రాబడి తగ్గుముఖం పట్టడం కూడా మన మార్కెట్లకు పాజిటివ్‌గా మారింది. అమెరికాలో పదేళ్ల ట్రెజరీ రాబడులు ఫిబ్రవరితో పోలిస్తే 40 బేసిస్ పాయింట్లు క్షీణించి 4.28 శాతానికి చేరాయి. దీంతో భారత్ వంటి వర్ధమాన మార్కెట్లవైపు విదేశీ మదుపర్లు దృష్టి సారిస్తున్నారు. గతేడాది అక్టోబర్ నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ గరిష్ఠాల నుంచి దాదాపు 14 శాతం మేర క్షీణించగా.. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు 20 శాతం మేర పతనమయ్యాయి. ఇదీ కూడా కొనుగోళ్ల మద్దతుకు మరో కారణమని అనలిస్టులు చెబుతున్నారు.





నాగ్‌పూర్‌లో ఇటీవల చెలరేగిన హింసకు కారణమైన కీలక నిందితుడు ఫహీమ్‌ఖాన్‌కు చెందిన అక్రమ నిర్మాణాలపై మహారాష్ట్ర ప్రభుత్వం బుల్డోజర్ ఆపరేషన్ చేపట్టింది. సోమవారం ఉదయం అతడి నివాసం, ఇతర నిర్మాణాలను నాగ్‌పూర్ మున్సిపల్‌శాఖ అధికారులు కూల్చివేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే నోటీసులు జారీ చేశామని.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినందువల్ల వీటిని కూల్చివేశామన్నారు. కాగా మైనారిటీ డెమోక్రటిక్ పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఫహీమ్ సామాజిక మాధ్యమం ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి ఘర్షణలకు కారణమయ్యాడన్న ఆరోపణలతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. మార్చి 17న నాగ్‌పూర్‌లో కొందరు మతపరమైన వ్యాఖ్యలు చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. మతపరమైన వస్తువులు దహనం చేసినట్లు కొంతమంది సోషల్ మీడియా వేదికగా తప్పుడు వదంతులు వ్యాప్తి చేయడంతో ఈ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీనికి కారణమైన ఫహీమ్‌తో సహా ఆరుగురిపై దేశద్రోహం కేసును నమోదు చేశారు. 50 మంది నిందితులపై సైబర్ విభాగం నమోదు చేసిన నాలుగు ఎఫ్ఐఆర్‌లలో వీరి పేర్లు ఉన్నాయి. ఇప్పటివరకు 200 మంది నిందితులను గుర్తించామని, మరో వెయ్యి మందిని సీసీటీవీ కెమెరాల ద్వారా గుర్తించే పనిలో ఉన్నామని ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు.

మహారాష్ట్రలో ఉన్న మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్లు వినిపిస్తున్న నేపథ్యంలో శంభాజీనగర్‌లోని 18వ శతాబ్దానికి చెందిన ఆయన స్మారకానికి ఇరువైపుల భారత పురావస్తుశాఖ (ఏఎస్ఐ) ఇనుప రేకులను, కంచెను ఏర్పాటుచేసింది.

# అమెరికాలో భరించలేక ఇండియాకొచ్చి గొప్పగా సెటిలైన అమెరికన్ యువకుడి కథ!





Elliot Rosenberg
$30k+/yr. in free luxury travel for us entrepreneurs &
4d · Edited

I made a rare financial decision 12 years ago.

And it has changed my finances (and life) forever.

Most personal finance gurus tell you to:
→ Budget your expenses
→ Invest and hold long-term
→ Build multiple streams of income

Then, you achieve:
(F)inancial
(I)ndependence
(R)etire
(E)arly

I'm onboard with all of these things.

The only problem?

America is $@!&%* expensive!

Inflation is bad, but "lifestyle creep" is worse.

In so many social circles, the unspoken truth is:

You need to spend on fancy restaurants, sports and c

అమెరికాలో విపరీతంగా పెరిగిపోయిన ద్రవ్యోల్బణంతో విసిగిపోయిన ఒక అమెరికన్ తొమ్మిదేళ్ల క్రితం భారతదేశానికి వచ్చి స్థిరపడ్డారు. తన వ్యాపారాన్ని ఇక్కడే ప్రారంభించి ఒక భారతీయ మహిళను వివాహం చేసుకుని గోవాలో నివసిస్తున్నాడు. ఇప్పుడు నెలకు ?1 లక్ష లోపు ఖర్చుతో ఎంతో సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నానని చెప్పుకొచ్చాడు. అమెరికా కంటే ఇండియా అన్ని విధాలా బెస్ట్ అంటూ చెప్పుకొస్తున్నాడు. ఎల్లియట్ రోసెన్‌బర్గ్ అనే ఈయన తన లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో 12 సంవత్సరాల క్రితం తాను తీసుకున్న ఒక అరుదైన ఆర్థిక నిర్ణయం తన జీవితాన్నే మార్చివేసిందని తెలిపారు. చాలామంది ఆర్థిక నిపుణులు ఖర్చులను తగ్గించుకోవడం, దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడం, అనేక ఆదాయ మార్గాలను ఏర్పరచుకోవడం వంటి సలహాలు ఇస్తుంటారని.. తద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం సాధించి త్వరగా పదవీ విరమణ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. అయితే అమెరికాలో ఉన్నప్పుడు అధిక ద్రవ్యోల్బణం కారణంగా జీవించడం చాలా ఖరీదైనదిగా అనిపించిందని ఆయన అన్నారు. "ద్రవ్యోల్బణం చెడ్డదే, కానీ జీవనశైలిని పెంచుకుంటూ పోవడం దానికంటే దారుణం" అని ఆయన వ్యాఖ్యానించారు. 'అమెరికాలో స్నేహితులను కోల్పోకుండా ఉండాలంటే ఖరీదైన రెస్టారెంట్‌లకు వెళ్లాలి. సంగీత కచేరీలకు హాజరు కావాలి.. షాపింగ్‌కు వెళ్లాలి.. ఇవన్నీ కూడా వాటిపై డబ్బు ఖర్చు చేయాలనే సామాజిక ఒత్తిడి అమెరికాలో ఎక్కువగా ఉంటుంది' అని ఆయన వివరించారు. ఈ ఒత్తిడి కారణంగానే తాను అమెరికాను విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. మొదట బ్రెజిల్ , ఇతర దక్షిణాసియా దేశాలకు ప్రయాణించిన తరువాత చివరకు భారతదేశంలో స్థిరపడాలని నిర్ణయించుకున్నానని తెలిపాడు.. "నేను ఇక్కడే నా భార్యను కలిశాను. ఆమె కుటుంబంతో సన్నిహితంగా మెలిగాను. హిందీ నేర్చుకున్నాను. జీవితాంతం నిలిచిపోయే బంధాలను ఏర్పరచుకున్నాను. 2 వ్యాపారాలను ప్రారంభించాను" అని ఆయన తన పోస్ట్‌లో తెలిపారు. ప్రస్తుతం తాను గోవాలో నివసిస్తున్నానని.. తన కుటుంబంతో సౌకర్యవంతంగా నెలకు ?1 లక్ష కంటే తక్కువ ఖర్చుతో ఎంతో హాయిగా ఉంటున్నట్లు లింక్ ఇన్డ్ పోస్ట్ లో పేర్కొన్నారు. అమెరికా కంటే ఇండియా బెటర్ అన్నా ఆ యువకుడి పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.

**–సోషల్ మీడియా ఏమంటోంది?....** రోసెన్‌బర్గ్ కథనాన్ని చదివిన నెటిజన్లు ఆయన ధైర్యాన్ని, సాహసాన్ని మెచ్చుకుంటున్నారు. ఒక వ్యక్తి స్పందిస్తూ "మీరు రిస్క్ తీసుకోవడానికి.. సాహసోపేతంగా ఉండటానికి చూపిన ఆకలిని నేను ఇష్టపడ్డాను... అది మీకు మంచి ఫలితాలను ఇచ్చింది .. మీరు సంతోషంగా ఉన్నారని నేను భావిస్తున్నాను. మీ కథను పంచుకున్నందుకు ధన్యవాదాలు" అని కామెంట్ చేశారు.. మరొకరు, "ఆరోగ్యకరమైన , సురక్షితమైన జీవితానికి భారతదేశం చాలా మంచిదని తెలుసుకోవడం సంతోషంగా ఉంది" అని వ్యాఖ్యానించారు. రోసెన్‌బర్గ్ తన పాఠశాల విద్యను పూర్తి చేసిన తరువాత వర్జీనియా విశ్వవిద్యాలయం నుండి కామర్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ , లాటిన్ అమెరికన్ స్టడీస్‌లో రెండవ మేజర్ పట్టా పొందారు. తన కెరీర్‌లో భాగంగా ఇండియాకు వచ్చి రెండు కంపెనీలను స్థాపించి ఇక్కడే గోవాలో సెటిల్ అయ్యారు.

# సలార్ లో 'ఖాన్సార్'లాగా.. చైనాలో మరో అద్భుతం



ఖాన్సార్.. ఈ పేరు వినగానే టాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'సలార్' సినిమా గుర్తుకు రావడం సహజం. సినిమాలో ఒక ప్రత్యేక ప్రపంచంగా, భారీ పరిశ్రమల కేంద్రంగా చూపించిన ఖాన్సార్.. ఇప్పుడు నిజంగానే చైనాలో ఆవిష్కృతం కాబోతోంది. అవును.. మీరు విన్నది నిజమే! ప్రపంచంలోనే అతిపెద్ద పారిశ్రామిక సముదాయాన్ని నిర్మిస్తోంది చైనా. ఇది ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో అగ్రగామిగా ఉన్న బీవైడీ సంస్థ చేపట్టిన ఒక మెగా ప్రాజెక్ట్. ఈ భారీ నిర్మాణం హెనాన్ ప్రావిన్స్‌లోని జెంగ్‌ఝౌ నగరంలో వేగంగా రూపుదిద్దుకుంటోంది. ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగాలనే తపనతో ఉన్న చైనా.. అన్ని రంగాల్లోనూ దూసుకుపోతోంది. భారీ జనాభాను కలిగి ఉన్నప్పటికీ, ఆర్థికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ దేశం.. సరికొత్త ఆవిష్కరణలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. ఇందులో భాగంగానే ఏకంగా 32 వేల ఎకరాల్లో ఈ మెగా ఫ్యాక్టరీని నిర్మించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్‌ను బీవైడీ సంస్థ ఎనిమిది దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఊహకు కూడా అందని ఈ విస్తీర్ణం.. ఒక చిన్న నగరాన్ని తలపించేలా ఉండబోతోంది. ఇందులో అత్యాధునిక భవనాలు, విశాలమైన రోడ్లు, ఉద్యోగుల కోసం ఫుట్‌బాల్ మైదానాలు, టెన్నిస్ కోర్టులు వంటి అనేక సౌకర్యాలు ఉండనున్నాయని సమాచారం.

**–ఉత్పత్తి లక్ష్యంగా..** ఈ మెగా ఫ్యాక్టరీ నిర్మాణం వెనుక బీవైడీ సంస్థ యొక్క ప్రధాన లక్ష్యం ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచడమే. ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న చైనా.. ఈ రంగంలో మరింత పట్టు సాధించాలని చూస్తోంది. బీవైడీ సంస్థ ఈ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ భారీ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీలో దాదాపు 60 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలుస్తోంది. వీరిలో చాలామంది అక్కడే నివసిస్తున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, దాని పరిమాణం అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్ కో కంటే కూడా ఎక్కువ ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**–సోషల్ మీడియాలో వైరల్..** ఈ బీవైడీ పరిశ్రమ నిర్మాణానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. డ్రోన్ ద్వారా చిత్రీకరించిన వీడియోలు ఈ నిర్మాణం యొక్క విశాలతను చూపిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఒకవైపు మైదానాలు, మరోవైపు భారీ భవనాలు.. ఇలా ఎటు చూసినా విస్తారమైన నిర్మాణాలు కనిపిస్తున్నాయి. ఈ వీడియోలు చైనా యొక్క పారిశ్రామిక శక్తిని ప్రపంచానికి చాటిచెబుతున్నాయి. ప్రస్తుతం బీవైడీ సంస్థలో దాదాపు 9 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రాబోయే నెలల్లో మరో 2 లక్షల మందిని నియమించుకోవాలని సంస్థ యోచిస్తోంది. ఈ భారీ నియామకాలు సంస్థ యొక్క విస్తరణ ప్రణాళికలకు అద్దం పడుతున్నాయి.

**– 'మేడ్ ఇన్ చైనా 2025' వ్యూహంలో భాగం..** ఈ మెగా ఫ్యాక్టరీ చైనా ప్రతిష్టాత్మక 'మేడ్ ఇన్ చైనా 2025' వ్యూహంలో ఒక ముఖ్యమైన భాగం. ఈ వ్యూహం ద్వారా చైనా తక్కువ ఖర్చుతో కూడిన హైటెక్ ఉత్పత్తులపై దృష్టి సారించి పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ పరిశ్రమ చైనా ఆర్థిక వ్యవస్థలో ఒక కీలకమైన భాగంగా మారనుంది. ఇది కేవలం ఉద్యోగాల సృష్టికే పరిమితం కాకుండా, ప్రపంచ EV మార్కెట్‌లో చైనా యొక్క ఆధిపత్యాన్ని మరింత బలపరుస్తుంది. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో చైనా తిరుగులేని శక్తిగా ఎదగడానికి ఈ ప్రాజెక్ట్ ఒక మైలురాయిగా నిలువనుంది. సలార్ సినిమాలో ఖాన్సార్ ఎంత ప్రత్యేకమైనదో.. చైనాలో రూపుదిద్దుకుంటున్న ఈ పారిశ్రామిక నగరం కూడా అంతే ప్రత్యేకమైనది. ఇది కేవలం ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదు.. ఒక స్వయం సమృద్ధి కలిగిన నగరం. ప్రపంచ పారిశ్రామిక రంగంలో చైనా ముందంజకు ఇది ఒక గొప్ప నిదర్శనం. ఈ భారీ ప్రాజెక్ట్ పూర్తయ్యే నాటికి ప్రపంచం మరింత ఆశ్చర్యపోవడం ఖాయం!

# ఎవర్రా నా ఫొటో ఇంత చెత్తగా గీసింది.. ట్రంప్ సీరియస్

ఎవరు ఎలా ఉన్నా కూడా...తమ సొంత అందాన్ని ఎప్పటికీ కించపరుచుకోరు. ఎలా ఉన్నా అలానే ఉంటాం అంటారు.. ముసలోళ్లం అయిపోయినా కూడా మనకు మనమే సాటి అనుకుంటాం. అయితే తమ చిత్రం విషయంలో తప్పుగా ఉంటే మాత్రం తట్టుకోలేం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా అంతే.. రాష్ట్ర క్యాపిటల్ లో తన చిత్రాన్ని చూసిన ట్రంప్ కు చిర్రెత్తుకొచ్చింది. దానిపై సీరియస్ అయిపోయాడు. అమెరికా అధ్యక్షుడు, బిజినెస్ టైకూన్ డొనాల్డ్ ట్రంప్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి కారణం ఆయనకు నచ్చని ఒక చిత్రం. కొలరాడో రాష్ట్ర కాపిటల్ భవనంలో తనతో పాటు ఇతర అధ్యక్షుల చిత్రాలు కూడా ఉన్నాయి. అయితే తన చిత్రాన్ని చూసిన ట్రంప్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఆ చిత్రాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఆ రాష్ట్ర గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే అలా చేశారని ఆరోపించారు. ట్రంప్ తన ట్రూత్



సోషల్ వేదికగా తన ఆవేదనను వెళ్లగక్కారు. "ఎవరికైనా తమ చెత్త ఫోటోలు, చిత్రాలు నచ్చవు. కానీ కొలరాడోలో నా చిత్రాన్ని చూస్తే.. భవిష్యత్తులో కూడా ఇంత దారుణమైన చిత్రాన్ని చూడకూడదనిపిస్తుంది. ఇది ఖచ్చితంగా కుట్రపూరిత చర్య!" అంటూ మండిపడ్డారు. ఇంతటితో ఆగకుండా ఆ చిత్రకారిణిపై తన అక్కసు వెళ్లగక్కారు. "ఆమె ఒబామా చిత్రాన్ని అద్భుతంగా గీసింది. కానీ నా చిత్రం మాత్రం దారుణంగా ఉంది. బహుశా ఆమె వృద్ధురాలు కావడం వల్ల తన కళను కోల్పోయి ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. ఒకవేళ తన చిత్రం అక్కడ లేకపోయినా బాధపడేవాడిని కానీ, ఇలాంటి చిత్రాన్ని మాత్రం చూడలేనని తేల్చి చెప్పారు. ట్రంప్ అభిమానులు కూడా తమ నాయకుడికి మద్దతుగా నిలిచారు. కొలరాడో నుండి చాలా మంది ఫోన్లు చేసి ఫిర్యాదు చేస్తున్నారని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా, ట్రంప్ కొలరాడో గవర్నర్ జారెడ్ పోలిస్‌పై మరోసారి విమర్శలు గుప్పించారు. "ఆ రాడికల్ లెఫ్ట్ గవర్నర్‌కు నేరాలను అదుపు చేయడం చేతకాదు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల ముఠాలను అరికట్టడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారు. కానీ, మేం వస్తే అన్నింటినీ చక్కదిద్దుతాం" అంటూ హామీ ఇచ్చారు. విశేషం ఏమిటంటే, ఈ చిత్రం 2019లో ఆవిష్కరించబడింది. దీనిని సారా బోర్డ్‌మన్ అనే కళాకారిణి గీశారు. ఆమె గతంలో జార్జి డబ్ల్యూ బుష్, బరాక్ ఒబామా చిత్రాలను కూడా వేశారు. అయితే, ట్రంప్ మాత్రం తన చిత్రాన్ని ఎందుకు అంత దారుణంగా వేశారో అర్థం కావడం లేదంటున్నారు. మరోవైపు ట్రంప్ శ్వేతసౌధంలో తన ఫోటోలను బంగారు ఫ్రేమ్‌లతో ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాదు, తన మగ్‌షాట్‌ను కూడా అక్కడ ప్రత్యేకంగా ఉంచారు. బహుశా కొలరాడో గవర్నర్ కూడా ట్రంప్ అభిరుచికి తగ్గట్టుగా బంగారు ఫ్రేమ్‌లో వేరే ఫోటోను ఏర్పాటు చేస్తే ఈ వివాదం సద్దుమణుగుతుందేమో చూడాలి! ఏది ఏమైనా అధ్యక్షుడికి ఒక చిత్రం విషయంలో ఇంతలా కోపం రావడం మాత్రం ఆశ్చర్యకరమే. బహుశా ట్రంప్ తన రాజకీయ ప్రత్యర్థులపై చూపించే ఆగ్రహాన్ని ఇప్పుడు తన చిత్రాలపై కూడా చూపిస్తున్నారేమో!

# కుక్కల పోటీ చూసేందుకు ఉషా వాన్స్.. నిప్పులు చెరిగిన గ్రీన్ ల్యాండ్

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు కాకమునుపు నుంచి ఒకటే పట్టు పట్టాడు.. అదే గ్రీన్ ల్యాండ్ ద్వీపాన్ని తాము కొంటామని.. డెన్మార్క్ ఆధీనంలో స్వయం ప్రతిపత్తితో ఉన్న ఈ ద్వీపాన్ని తాము ఇవ్వము పో అన్నప్పటికీ ట్రంప్, ఆయన కార్యవర్గం మాత్రం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఇక ట్రంప్ ప్లాన్లు చూస్తుంటే గ్రీన్ ల్యాండ్ ను వదిలేదు లేదు అన్నట్లుగా ఉన్నారని తెలుస్తోంది. తాజాగా అమెరికా అధ్యక్ష కార్యవర్గంలోని కీలక అధికారులు, సెకండ్ లేడీ తెలుగింటి ఉషా వాన్స్ గ్రీన్ ల్యాండ్ లో అడుగుపెట్టారు. రెండు నెలల కిందట అమెరికాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉషా భర్త జేడీ వాన్స్ ఉపాధ్యక్షుడు అయిన సంగతి తెలిసిందే. దీంతో ఉషా అమెరికా సెకండ్ లేడీ అయ్యారు. బహుశా ఆమె తొలి విదేశీ పర్యటనగా గ్రీన్ ల్యాండ్ లో కాలుపెట్టబోతున్నారు. అదీ అనధికారికంగా. కానీ, ఈ పర్యటనపై గ్రీన్ ల్యాండ్ మండిపడుతోంది. అమెరికాది దుందుడుకు చర్య అని గ్రీన్ ల్యాండ్ ప్రధాని మూట్ బి ఎగీడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మాపై బలప్రదర్శనే..** ఉషానే కాదు అమెరికా జాతీయ భద్రతా



సలహాదారు వాల్ట్ సైతం గ్రీన్ ల్యాండ్ లో టూర్ చేయనున్నారు. దీంతో ఆ దేశ ప్రధాని మూట్ కు కోపం నషాళానికి ఎక్కింది. ఇది తమపై బల ప్రదర్శనే అని నిప్పులు చెరిగారు. గ్రీన్ ల్యాండ్ లో ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఇందులో ఫ్రెడ్రిక్ నీల్సన్ గెలిచారు. అమెరికా ఉన్నత స్థాయి టీమ్ టూర్ చేయడాన్ని ఆయన తమ దేశంపై ఉన్న చిన్న చూపుగా అభివర్ణించారు.

**కుక్కల పోటీలు చూసేందుకట..** గ్రీన్ ల్యాండ్ పై అదుపు ఉన్న డెన్మార్క్ ప్రధాని ఫ్రెడ్రిక్సన్ మాట్లాడుతూ.. అమెరికా ప్రతినిధి బృందం పర్యటనను తాము తీవ్రంగానే చూస్తామని పేర్కొన్నారు. కాగా గ్రీన్ ల్యాండ్ ఎక్కువ శాతం మంచుతో కప్పి ఉండే దేశం. ఇక్కడ జరిగే సంప్రదాయ డాగ్ స్లెడ్ రేస్ చూసేందుకే ఉషా వెళ్తున్నారని అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ తెలిపింది. పనిలో పనిగా గ్రీన్ ల్యాండ్ సంప్రదాయాలను ఉషా తెలుసుకుంటారని చెప్పడంతో ఆందోళన మొదలైంది. గ్రీన్ ల్యాండ్ భద్రత, విదేశాంగం, ద్రవ్య పరపతి విధానాలను డెన్మార్క్ చూస్తుంటుంది. మిగతా అంశాలన్నిటిలో గ్రీన్ ల్యాండ్ దే అధికారం. అయితే, రెండో ప్రపంచ యుద్ధకాలం నుంచే గ్రీన్ ల్యాండ్ లో అమెరికా వైమానిక స్థావరం ఉంది.

అప్పటి సోవియట్ యూనియన్, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా నుంచి ముప్పును ఎదుర్కోవడానికి నాటో తరఫున అమెరికా దీనిని నిర్వహిస్తోంది. విపరీతమైన చమురు, గ్యాస్ నిక్షేపాలు, అరుదైన లోహాలు ఉండడంతో గ్రీన్ ల్యాండ్ పై ట్రంప్ కన్నేశారు.

చురకలు

## సంపాదకీయం

# స్వామీ ఏమిటిది ... పీఠం కదులుతోందా ?

విశాఖలో స్వామిజీ శ్రీ స్వరూపానందేంద్ర స్వామి ప్రముఖుడిగా పేరు గడించారు. ఆయన వద్దకు వచ్చే వారిలో రాజకీయ భక్తులు ఎక్కువగా ఉంటారని ప్రతీతి. స్వామీజీ విశాఖలోని పెందుర్తి వద్ద ఇప్పటికి మూడు దశాబ్దాల క్రితం శ్రీ శారదాపీఠం పేరుతో ఆధ్యాత్మిక స్థావరాన్ని నిర్మించారు. అక్కడ నుంచే ఆయన ఆధ్యాత్మిక ప్రస్థానం మొదలైంది. ఇక దేశాన్ని ఏలే వారి నుంచి ఎంతో మంది శ్రీ శారదా పీఠాన్ని సందర్శించిన వారే. ఇంతింతై అన్నట్లుగా పీఠం ఎంతో విస్తరించింది. హైదరబాద్ లో కూడా పీఠం ఏర్పాటు అయింది. ఉత్తరాదీ రుషీకేశ్ లో కూడా పీఠం ఉంది. ఇదిలా ఉంటే ఏపీలో అయిదేళ్ళ పాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం హయాంలో శారదా పీఠం ఒక వెలుగు వెలిగింది అని చెబుతారు. వార్షిక ఉత్సవాలకు ముఖ్యమంత్రి హోదాలో జగన్ తప్పనిసరిగా వచ్చేవారు. ఆయన చేత రాజశ్యామల హోమం వంటివి స్వామీజీ చేయించేవారు. ఇక భీమిలీ వద్ద పీఠం వేద పాఠశాల కోసం వైసీపీ ప్రభుత్వం భారీ ఎత్తున భూమిని అందించింది. దీని మీద కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుని ప్రభుత్వం పరం చేసింది. తిరుమలలో పీఠం తరఫున నిర్మాణాలను కూడా కూల్చేందుకు టీటీడీ చట్టబద్ధమైన చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇపుడు విశాఖలో ఉన్న శ్రీ శారదాపీఠం మీద కూడా చర్యలకు రంగం సిద్ధం అవుతోంది అని అంటున్నారు. ప్రభుత్వ భూములలో ఉన్న శ్రీ శారదా పీఠాన్ని వెంటనే తొలగించాలని పెందుర్తికి చెందిన తహాశీల్దార్ తాజాగా నోటీసులు జారీ చేయడంతో ఇది అతి పెద్ద చర్చకు తావిస్తోంది. చినముషిడివాడ సర్వే నంబర్ 90లో ప్రభుత్వానికి చెందిన 72 సెంట్లో పోరంబోకు రాస్తాలో 22 సెంట్ల భూమిని ఆక్రమించారు అని శారదాపీఠం మీద అభియోగం మోపుతూ ఈ నోటీసులు జారీ చేశారని అంటున్నారు. అందువల్ల ఏడు రోజుల వ్యవధిలోపల ఈ ఆక్రమిత భూముల్లోని నిర్మాణాలను తొలగించాలని స్పష్టం చేశారు. దీంతో ఏమి జరుగుతుంది అన్న చర్చ అంతటా సాగుతోంది. శ్రీ శారదా పీఠాన్ని తొంభై దశకంలో ప్రారంభించారు. మొదట చిన్నగా ఉన్న ఈ పీఠం ఆ తరువాత బాగా విస్తరించింది. అన్ని రకాలైన సదుపాయాలతో ఆస్తిక జనులకు ఆశ్రమంగా మారింది. వీవీఐపీలు ఎంతో మంది పీఠాన్ని సందర్శిస్తూ వచ్చారు. దాంతో ఈ పీఠం విషయంలో ఇలాంటి అభియోగాలు రావడంతో ఏమిటిది అని అంతా ఆలోచిస్తున్నారు నిజంగా ఆక్రమణలు ఉంటే తొలగించాల్సిందే అన్న మాట వైపు ఉంటే ఏనాడో కట్టిన నిర్మాణాల మీద ఇపుడు నోటీసులు అన్నది మరో వాదనగా ఉంది. కూటమి ప్రభుత్వం ఏపీలో అధికారంలోకి వచ్చాక స్వామీజీ ఏపీ నుంచి దూరంగా ఉంటున్నారు ఆయన ఉత్తరాదిన రుషీకేశ్ లో ఉంటున్నారని చెబుతున్నారు. దీని మీద పీఠం నిర్వాహకులు ఏమి చేస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది.

# అలనాటి మేటి సంపాదకులు పండితారాధ్యుల - మార్చి 26...పండితారాధ్యుల నాగేశ్వరరావు జయంతి




తొలితరం ఖ్యాతి గాంచిన పాత్రికేయులలో, సంపాదకులలో పండితారాధ్యుల నాగేశ్వరరావు ఎన్నదగిన వారు. గుంటూరు జిల్లా, ఇంటూరు గ్రామంలో 1912, మార్చి 26న మల్లయ్య, భైరవాంబ దంపతులకు జన్మించారు. గుంటూరు లోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం పత్రికా రచయితగా ప్రసిద్ధి గాంచారు. పిఠాపురం మహారాజా వారి దేశబంధు పత్రికలో కొన్నాళ్లు పనిచేసి, ఆచార్య రంగా నెలకొల్పిన వాహిని పత్రికలో 1932లో చేరారు. 1943 నుంచి 1959 వరకూ ఆంధ్రపత్రికలో పని చేశారు. 1960లో ఆంధ్రభూమి సంపాదకునిగా విశేషమైన సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వెలువడిన ఆంధ్ర జనతకు 1965లో ఏడాదిపాటు సంపాదకత్వం వహించారు. 1966 నుంచి మరణించే(1976) వరకూ ఆంధ్రప్రభ బెంగళూరు రెసిడెంట్ ఎడిటర్గా పని చేశారు. ఆ పత్రికలతో పాటుగా గోభూమి, క్రాంతి, సంజయ, ప్రజాప్రభ వారపత్రిక, %ావసవం- తీఋఖఅ% పత్రికలలో సంపాదకునిగా పని చేశారు. 1969-72 మధ్య కాలంలో రాష్ట్రంలో తలెత్తిన వేర్పాటు వాద ఉద్యమ సందర్భాలలో సమన్వయానికి, సంఘటితత్వానికి దోహదం చేయడంలో ప్రముఖపాత్ర నిర్వహించారు. పండిత పాత్రికేయులుగా ప్రఖ్యాతి గాంచిన పండితారాధ్యుల నాగేశ్వర్ రావు 1976 నవంబరు 13న తుదిశ్వాస విడిచారు. పదునైన పదజాలంతో చెప్ప దలుచుకున్న తన భావాన్ని సూటిగా చెప్పంలో ఆయన కాయనే సాటి. రచనలో పటుత్వం, భాషలో పట్టు, ఆయన ప్రతిభను ఇనుమడింప చేస్తాయి. 19 వ శతాబ్దపు తొలి దశకంలో రచనలు ప్రజలలో చైతన్యాన్ని రగిల్చాయి. ఆనాటి పత్రికలూ, వారి చైతన్యాన్ని ఇనుమడింప చేసాయి. నాటి పత్రికాధిపతులు, పత్రికల దారా సామాజిక న్యాయాన్ని కాంక్షించి ప్రచురణ సాగించే వారు. ప్రధానంగా స్వతంత్రం పోరాటంలో ఉద్యమ స్ఫూర్తిని ప్రబోధించే రచనలను, రచయితలను, ప్రోత్సహించే స్పందన సాంప్రదాయానికి గట్టి పునాది వేసారు. ఫలితంగా ముద్రణారంగం ఒక పరిశ్రమగా ఆవిర్భవించింది. ఆ పరిశ్రమ ఎందరికో ఉపాధి కల్పించడంతో పాటు సామాజిక ప్రగతికి సోపానాలుగా దినదినాభివృద్ధి చెందుతూ వచ్చాయి. నాగేశ్వరరావు పాత్రికేయ వృత్తికి ఒక గౌరవ ప్రదమైన స్థానాన్ని సంతరింప చేశారు. పత్రికా రంగంలో అలనాటి మేటి పాత్రికేయుల జాబితాలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని స్వంతం చేసుకున్నారు. వర్ధమాన పాత్రికేయులకు నాగేశ్వరరావు సంపాదకీయాలు, రచనలు ఎంతగానో తోడ్పడ గలవనేది నూటికి నూరుపాళ్లు నిజం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పద కవితా పితామహుడు అన్నమాచార్యుడు - ఫాల్గుణ బహుళ ద్వాదశి... అన్నమాచార్య వర్ధంతి



దక్షిణా పథాన భజన సాంప్రదాయానికి, పద కవితా శైలికి ఆద్యుడు, ఆరాధ్యుడు. అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు (మే 9, 1408 - ఫిబ్రవరి 23, 1503) తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనా చార్యులకు మార్గ దర్శకుడైన, భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం భావ లాలిత్యంతో నిండిఉన్న అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. తెలుగు సంస్కృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచు కున్నాయి. ఆధ్యాత్మిక పదాలు, శృంగార గీతాలు, తుమ్మెదల, గొబ్బిళ్ళ పాటలు, శతకాలు, అన్నమయ్య విరచిత, 32 వేల ఆశుకవితా రూపాలలో చాలా వరకు లభ్యాలై, ప్రజల నోళ్లలో నానుతునే ఉన్నాయి. కన్నడ వాగ్గేయకారుడు "పురందరదాసు" అన్నమయ్యను, ఏడుకొండల స్వామి అవతారంగా ప్రశంసిస్తే, మహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ఆచరణల నమ్మకం. అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చిన్నన్న రాసిన "అన్నమయ్య చరితం" ద్విపద కావ్యం ద్వారా ఆయన సమాచారం లభిస్తున్నది. క్రీస్తుశకం పదవ శతాబ్దిలో, నేటి కర్నూలు జిల్లాలోని ప్రాంతాలను నందుడనే రాజు పాలించగా, ఆ రాజు కాశీయాత్ర సమయాన, కాశీలో కొందరు వైదిక బ్రాహ్మణులు పరిచయం కాగా, కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్ర దేశానికి తరలి వచ్చి స్థిరపడగా, తీసుకొని రాబడిన వారు వైదీకులు అయినందున, నంద వైదీకులుగా ప్రచారం పొందినట్లు, అన్నమయ్య అదే కోవకు చెందిన వారై, "తాళ్ళపాక గ్రామం" ఇంటి పేరుగా కలిగి ఉన్నారని ప్రచారం ఉంది. వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో శుభ లగ్నాన, మూడు గ్రహాలు ఉచ్చ స్థితిలో ఉండగా, నారాయణ సూరి - లక్కమాంబలకు "నందకం" అంశమున సర్వధారి సంవత్సర వైశాఖ శుక్ల పౌర్ణమి నాడు 1408 మే 9న అన్నమయ్య ఉదయించారు. నారాయణ మూర్తి పరబ్రహ్మ వాచకంగా "అన్నమయ్య" అని నామకరణం గావించారు. "అన్నమయ్య", "అన్నమాచార్యులు", "అన్నయ గురు", "అన్నయ్య", "కోనేటి అన్నమయ్యం గారు" అనే నామాంతరం తాళ్లపాక సాహిత్యం శాసనాలలో చోటు చేసుకున్నాయి. శిశు ప్రాయం నుండి అన్నమయ్య వెంకట నాథుని మీద ధ్యాస ఉంచేవారు. ఉగ్గు పాలు తాగడం లో, నిద్రకు ఉపక్రమించడంలో, లక్కమాంబ గీతాలు, జోల పాటలు, నారాయణ మూర్తి కావ్య పఠనాలు, అన్నమయ్యపై శైశవ దశలోనే ప్రభావం చూపాయి. ఏకసంతాగ్రాహియై, ఉపనయన సంస్కారం అనంతరం చిరు ప్రాయం నుండే, కలియుగ దైవంపై వింత వింత సంకీర్తనలు నోటి నుండి జాలు వారగా, పదహారేళ్ల ప్రాయం నుండి రోజు కొక్క సంకీర్తనం తప్పక రాయడం మానలేదు. చెరువుగట్టు మీద, చెట్టుపై పిట్టలు, చిరుగాలి సవ్వడులలో, అలల కదలికలలో, మమేకమై సాగిన ఆయన జానపద నేపథ్యంలో, అన్నమయ్య పాటన్నా, మాటన్నా, గ్రామీణులకు సంబరాన్ని కలిగించేవి. ఉమ్మడి కుటుంబంలో, పనులు చేయడం నచ్చక, లౌకిక బంధాలతో, తమకు ఇక పనిలేదని తెలుసుకొని, వేదనలో విరక్తి కలిగి, భక్తి రగిలి, భక్తి రసావేశ భరితులై, తంబుర చేతబూని, తిరుమల దారి పట్టా డు. సనక సనందాదులే భక్తులై తోడురాగా తిరుపతి చేరారు. సకలాభరణ శోభితుడు, భూషితుడు అయిన శ్రీ మూర్తిని దర్శించుకున్నారు. తిరుమలలో "ఘన విష్ణువు" అనే మునితో శంఖ చక్రాదికములతో, పంచ సంస్కారాలను నిర్వహింప చేసుకున్నారు. వైష్ణవ తత్వాలను, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను, అధ్యయనం చేస్తూ, వెంకన్నను కీర్తిస్తూ, తిరుమలలోనే జీవితం గడిపారు. గురువు ఆనతిపై, తాళ్ళపాక వెల్లి తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నా, వారితో తిరిగి తిరుమల దర్శనం చేసుకున్నారు. 95 ఏళ్ళ పూర్ణ వయస్కుడై, అన్నమయ్య దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 1503 ఫిబ్రవరి 23న పరమపదించారు. అన్నమయ్య సంకీర్తనా సేవ, సంగీత సాహిత్య భక్తి పరిపుష్టం. తెలుగులోనే రాసినా పాడినా ఆయన సాహిత్యం సంస్కృత పద భూయిష్టం. అన్నమయ్య యోగ వైరాగ్య శృంగారం సరణి మొత్తం 32 వేల సంకీర్తనలు రచించారని అనుకొంటున్నా, ఆయన వారసులు రాగి రేకులపై వ్రాయించి, తిరుమలలో సంకీర్తనా భాండాగారం నందు పొందు పరిచినవి, ప్రస్తుతం 12 వేలు మాత్రమే. మంజరి ద్విపదలో "శృంగార మంజరి" అనే కావ్యాన్ని రచించారు. ఆయన రచనలని చెప్పబడే 12 శతకాలలో "వెంకటేశ్వర శతకము" మాత్రమే లభిస్తున్నది. "అదివో అల్లదివో, క్షీరాబ్ధి కన్యకకు, జో అచ్యుతానంద, ఉదయాద్రి తెలిపాయే, కొండలలో నెలకొన్న, మూసిన ముత్యాల, నిగమ నిగమాంత, లాంటి అన్నమయ్య కీర్తనలు, తెలుగు సంగీతాభిమానులకు, నిత్యం వీనులకు విందు చేస్తూనే ఉన్నాయి. "సంకీర్తనాచార్యుడు", "పదకవితా పితామహుడు", "పంచమాగమ సార్వభౌముడు'', ''ద్రావిడ ఆగమ సార్వభౌముడు''అని బిరుదాంకితుడు అయిన, అన్నమయ్య వాసిలో, రాశిలో, రచనలు ఆంధ్ర వ్మాయంలో సరిరానివి అనడంలో అతిశయోక్తి లేదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అక్కినేని, దుక్కిపాటి లది అద్వితీయ అనుబంధం - మార్చి 26...దుక్కిపాటి మధుసూదనరావు వర్ధంతి





దుక్కిపాటి మధుసూదనరావు ( జూలై 17, 1917 మార్చి 26, 2006) కు తెలుగు సినిమాతో 1940 నుంచే అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావు సినీ జీవితాన్ని ప్రభావితం చేసిన అతి ముఖ్యుల్లో దుక్కిపాటి ఒక్కరు. అక్కినేనికి చిత్రసీమలో మార్గదర్శిగా నిలచి ఆయన నటునిగా సినీ చరిత్రలో నిలచి పోయేలా చేయడంలో ప్రధాన భూమిక పోషించారు దుక్కిపాటి. అన్నపూర్ణ పిక్చర్స్ పతాకంపై సినిమాలు సిర్మించిన ప్రముఖ తెలుగు నిర్మాత. దుక్కిపాటి 1951సెప్టెంబరు10వ తేదీన అక్కినేని నాగేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, కొరటాల ప్రకాశరావు టి.వి.ఎ.సూర్యారావు లతో కలసి అన్నపూర్ణ పిక్చర్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థను స్థాపించి, మొదటి ప్రయత్నంగా "దొంగరాముడు" సినిమాను తీశారు. దుక్కిపాటి తనని అమ్మకన్నా మిన్నగా పెంచి పోషించిన సవతితల్లి అన్నపూర్ణ పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించారు. దానికి అక్కినేని నాగేశ్వరరావుని ఛైర్మన్ ను చేశారు. కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా పెయ్యేరు గ్రామంలో దుక్కిపాటి మధుసూదనరావు జూలై 27, 1917 న సంపన్న వ్యవసాయ కుటుంబంలో గంగాజలం, సీతారామస్వామి దంపతులకు జన్మించారు. బందరు నోబుల్ కళాశాలలో బి.ఏ చదివారు. ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించారు. చదువు పూర్తి చేసుకున్న దుక్కిపాటి, తాను కార్యదర్శిగా ఎక్సెల్సియల్ క్లబ్బు అనే నాటక సంస్థను ప్రారంభించారు. కోడూరి అచ్చయ్య, ఎం.ఆర్.అప్పారావు వంటి మిత్రులతో కలసి ఆ క్లబ్బు పక్షాన నాటకాలు విరివిగా ప్రదర్శించారు. ఎక్సెల్సియల్ క్లబ్బులో దుక్కిపాటితో పాటు పెండ్యాల, బుద్ధిరాజు శ్రీరామమూర్తి వంటివారు ఉండేవారు. వారి సహకారంతో ఆయన ఆశాజ్యోతి, సత్యాన్వేషణ, తెలుగుతల్లి వంటి సాంఘిక నాటకాలను రాయించి చేపట్టారు. అవి ఘన విజయాలను నమోదు చేసుకున్నాయి. ఆ సమయంలో దుక్కిపాటికి అక్కినేనితో పరిచయం విచిత్రంగా కలిగింది. అప్పటికే అక్కినేని ధర్మపత్ని చిత్రంలో నటించి వెనక్కి వచ్చేశారు. బుద్ధిరాజు శ్రీరామమూర్తి సలహాతో 'విప్రనారాయణ' నాటకంలో దేవదేవి పాత్ర పోషిస్తున్నారు. ఆ నాటక ప్రదర్శన చూసిన దుక్కిపాటి, తమకు కథానాయిక/స్త్రీ పాత్ర లేని లోటు తీరిందని అక్కినేనిని హీరోయిన్ని చేశారు. అలా వారంతా నాటకాల్లో బిజీగా ఉన్నప్పుడే ఘంటసాల బలరామయ్య ఓ రైల్వేస్టేషన్లో అక్కినేనిని చూసి తన సినిమాకు ఆయనే తగిన వ్యక్తి అని నిర్ధారించుకొని చిరునామా తీసుకొన్నారు. తర్వాత గుడివాడకు వచ్చి అక్కినేనికి కబురు చేశారు. దుక్కిపాటి, రామబ్రహ్మం (అక్కినేని సోదరుడు) ఇద్దరూ అక్కినేనిని ఘంటసాల బలరామయ్య వద్దకు తీసుకెళ్లారు. ఆయన వారిని మద్రాసు కొచ్చి 'ప్రతిభ' ఆఫీసులో సంప్రదించ మన్నారు. దుక్కిపాటి, మరో మిత్రుడు సూర్యప్రకాశరావుతో కలసి అక్కినేనిని తీసుకొని మద్రాసులో 'ప్రతిభ' ఆఫీసుకు వెళ్లగా, పేకేటి అక్కినేని స్వాగతించారు. అలా 'సీతారామ జననంలో అక్కినేని హీరో అయ్యారు. ఆ తర్వాత దుక్కిపాటి, బలరామయ్య, చల్లపల్లి రాజాలతో కలసి గూడవల్లి రామబ్రహ్మం దగ్గరకెళ్లి అక్కినేనిని 'మాయాలోకం'లో చిత్రానికి తీసుకొమ్మని సూచించారు. దుక్కిపాటి మధుసూదనరావు తనని అమ్మకన్నా మిన్నగా పెంచి పోషించిన సవతితల్లి "అన్నపూర్ణ" పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించారు. దానికి అక్కినేని నాగేశ్వరరావుని ఛైర్మన్ని చేశారు. ఆ సంస్థ ద్వారా తొలిసారి "దొంగరాముడు" చిత్రం నిర్మించారు. కె.వి.రెడ్డి దర్శకత్వంలో అక్కినేని, సావిత్రల జంట కన్నుల పండువుగా నటించడంతో అది ఘనవిజయం సాధించింది. దుక్కిపాటి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తోడికోడళ్ళు, మాంగల్యబలం, వెలుగునీడలు, చదువుకున్న అమ్మాయిలు, ఇద్దరు మిత్రులు, డాక్టర్ చక్రవర్తి, ఆత్మ గౌరవం, పూలరంగడు, విచిత్రబంధం, ప్రేమలేఖలు, రాధాకృష్ణ, పెళ్లీడు పిల్లలు, అమెరికా అబ్బాయి... వంటి అద్భుతమైన చిత్రాలెన్నో దుక్కిపాటి నిర్మించారు. డాక్టర్ చక్రవర్తి చిత్రం రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన తొలి నంది అవార్డును అందుకోవడం విశేషం. అధిక చిత్రాలు ఘనవిజయం సాధించాయనడంలో సందేహం లేదు. తెలుగులో ద్విపాత్రాభినయం చేసిన మొదటి సినిమా "ఇద్దరు మిత్రులు". అన్నపూర్ణ సంస్థ నిర్మించే సినిమాలకు ఎక్కువగా ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వం వహించే వారు. దుక్కిపాటి తన సినిమాలలో కొత్రపాటి గంగాధరరావు, యుద్దనపూడి సులోచనరాణి, గొల్లపూడి మారుతీరావు, ముప్పాళ్ల రంగనాయకమ్మ (సంభాషణల రచయిత్రి), కె.విశ్వనాథ్ (దర్శకుడు), ఆశాలత కులకర్ణి, జి. రామకృష్ణ, జీడిగుంట రామచంద్ర మూర్తి, శారద వంటి కళాకారులను పరిచయం చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ హైదరాబాద్కు తరలి రావడానికి అక్కినేనితోపాటు దుక్కిపాటి మధుసూదనరావు ఎంతో కృషి చేశారు. అందుకే ప్రతిష్ఠాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డుతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ని సత్కరించింది. అలా దుక్కిపాటి, అక్కినేని ఇద్దరూ తమ సంబంధం, బంధం, అనుబంధం అద్వితీయం అని నిరూపించారు. దుక్కిపాటి 90 యేళ్ళ వయసులో 26 మార్చి, 2006 రోజున మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# సిబ్బంది లేక ఇబ్బంది..!

ఖమ్మం: ఖమ్మం ప్రభుత్వ బోధనాసుపత్రి (సర్వజనాసుపత్రి)లో వైద్యనిపుణుల కొరత వేధిస్తోంది. కీలకమైన రేడియాలజీ విభాగంలో నిపుణులు లేకపోవటంతో స్కానింగ్ పరీక్షల నిర్వహణ, వ్యాధి నిర్ధారణ నివేదికల జారీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు పలుమార్లు వైద్యాధికారులు నోటిఫికేషన్ వెలువరించినా అభ్యర్థుల నుంచి స్పందన లేదు. ప్రభుత్వం చెల్లించే వేతనాల పట్ల నిరాసక్తతే పోస్టుల భర్తీకి ఆటంకంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీలు ఎక్కడెక్కడంటే.. సర్వజనాసుపత్రిలో 34 విభాగాలు ఉంటాయి. 115 పోస్టులకు 39 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 21విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ అధ్యాపక పోస్టుల్లో



ఏదో ఒకటి ఖాళీగా ఉంటోంది. రేడియాలజీలో నాలుగు, కమ్యూనిటీ మెడిసిన్, ఫిజికల్ మెడిసిన్, హాస్పిటల్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్‌లో మూడేసి చొప్పున, జనరల్ మెడిసిన్, అనాటమీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, సైకియాట్రీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, గైనకాలజీలో రెండేసి చొప్పున, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, డెర్మటాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, డెంటల్, రెస్పిరేటరీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఒక్కోటి చొప్పున పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.


భోధనాసుపత్రిలో ఆచార్యుల పోస్టుల భర్తీకి పలుమార్లు నోటిఫికేషన్లు ఇచ్చాం. అభ్యర్థుల నుంచి స్పందన కనిపించలేదు. దరఖాస్తులు వచ్చిన వాటిలో అర్హులుంటే వెంటనే భర్తీ చేస్తున్నాం. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. ప్రస్తుతం ఒకట్రెండు విభాగాలు మినహాయిస్తే వైద్యసేవలు, బోధనకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఖాళీలను భార్తీ చేసేందుకు మరోమారు నోటిఫికేషన్ ఇచ్చేందుకు యత్నిస్తున్నాం.డాక్టర్ రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, సర్వజనాసుపత్రి, ఖమ్మం

# ఆదాయం ఘనం.. వసతులు గగనం..!

వేంసూరు : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక దేవాలయాలకు వందలు, వేలాది ఎకరాల భూములున్నా, అధికాదాయం సమకూరుతున్నా.. ఆమేరకు అభివృద్ధి పనులు జరగటం లేదు. ఉభయ జిల్లాల్లో రూ.2లక్షల్లోపు ఆదాయం కలిగిన ఆలయాలకు భక్తుల విన్నపాల మేరకు పాలకవర్గాలను అధికారులు నియమించారు. రూ.25లక్షల ఆదాయం కలిగిన ఆలయాలకు జిల్లా కమిషనరేట్ స్థాయిలో పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలో జమలాపురం, కందుకూరు, భద్రాద్రి జిల్లాలో భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి, పెద్దమ్మగుడి తదితర ఆలయాలకు సుమారు దశాబ్దకాలంగా పాలకవర్గాలు లేవు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో 190, భద్రాద్రి జిల్లాలో 32 ఆలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 14,391.32 ఎకరాల భూముల్లో 1,284.07 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు రెవెన్యూశాఖ లెక్కలు చెబుతున్నాయి.

తాత్కాలిక కమిటీలతోనే సరి.. రూ.25లక్షల కంటే ఎక్కువ ఆదాయం వస్తున్న ఆలయాలకు ఉత్సవాల సమయంలో మూడు నుంచి ఆరునెలల కాలపరిమితితో తాత్కాలిక కమిటీలను దేవాదాయశాఖ అధికారులు నియమిస్తున్నారు. ఈ కమిటీలకు పర్యవేక్షణ మినహా ఎలాంటి అధికారాలు ఉండవు. ఆలయ నిర్వహణలో దేవాదాయశాఖ, ఆలయ అధికారులు ఏపని చేయాలన్నా ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. పాలకవర్గాలను నియమిస్తే ప్రధానంగా ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవచ్చు. ప్రభుత్వంతో చర్చించి ఆలయాల పునరుద్ధరణ, అదనపు శాశ్వత నిర్మాణాలకు నిధులు రాబట్టే అవకాశముంది. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

వేంసూరు మండలం కందుకూరులో కాకతీయుల కాలం నాటి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 365 ఎకరాల భూమి ఉంది. ఏటా రూ.30లక్షల పైచిలుకు ఆదాయం వస్తుంది. ఆలయ ముఖమండపం శిథిలావస్థకు చేరుకుంది. మూలవిరాట్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల మందిరాలు, రథశాలను పునర్నిర్మించాలి. ఆలయాభివృద్ధికి అదే గ్రామానికి



చెందిన హెటిరోడ్రగ్స్ అధినేత, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి రెండేళ్ల క్రితం రూ.2కోట్లు విరాళం ప్రకటించారు. తితిదే నుంచి మరో రూ.4కోట్లు మంజూరయ్యాయి. అయినా ఆలయాభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవటం లేదు.

అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి 2,224 ఎకరాల భూములున్నాయి. వీటిపై వచ్చే ఆదాయంతో దుకాణాల సముదాయం, కోనేరు నిర్మించాలనే ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. రేణుకాచౌదరి కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆలయాభివృద్ధికి రూ.కోటి ప్రకటించినా వినియోగించుకోలేదు.తెలంగాణ తిరుపతిగా పేరొందిన ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 62.50 ఎకరాల భూమి ఉంది. దీనిపైనా, భక్తుల కానుకల రూపంలో ఏటా సగటున రూ.6కోట్లు ఆదాయం సమకూరుతుంది. అన్నదానం నిమిత్తం మరో రూ.3కోట్లు ఉన్నాయి. అయినా ఆలయంలో భోజనశాల సౌకర్యాలు మెరుగుపడటం లేదని భక్తులు వాపోతున్నారు.రూ.25లక్షల కన్నా ఎక్కువ ఆదాయం కలిగిన ఆలయాలకు సంబంధిం చి ప్రకటనలిచ్చాం. త్వరలో పాలకవర్గాలను నియమిస్తాం. జీపీఎస్ పద్ధతిలో సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగిస్తాం. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తాం. వీరస్వామి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్

# భూతాపం.. భవితకు శాపం



మిర్యాలగూడ : వాతావరణంలో ఇటీవలి కాలంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా భూతాపం పెరిగి వాతావరణం విపరీతంగా వేడెక్కుతోంది. దీంతో మార్చి ప్రారంభంలోనే ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణంలో చోటు చేసుకుంటున్న ఈ మార్పులకు మనమే కారణమని నిపుణులు చెప్తున్నారు. ఈ మార్పులపై సమరం సాగిస్తూ ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏటా మార్చి 23న 'ప్రపంచ వాతావరణ దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

**కాటేస్తున్న కాలుష్యం..**

ఉమ్మడి జిల్లాపై గత ఏడెనిమిదేళ్లుగా కాలుష్యం కాటేస్తుంది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పెద్ద, మధ్య తరహా, చిన్న పరిశ్రమలు వందల సంఖ్యలో వెలుస్తున్నాయి. వీటి నిర్మాణానికి చెట్లను నరుకుతుండగా వీటి నుంచి వచ్చే కాలుష్యంతో వాతావరణంలోని గాలి, నీరు కలుషితమై మానవ మనుగడ ప్రమాదంలో పడుతుంది.

**భారీ వృక్షాలు నేలమట్టం..**

మానవాళికి జీవవాయువు అందించే భారీ వృక్షాలు ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో అనేక నేలమట్టం అయ్యాయి. మరో వైపు ప్రధాన వ్యాపార కేంద్రాలైన నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, కోదాడ వంటి పట్టణాల్లో భవన నిర్మాణం రంగం భారీగా సాగుతుంది. వీటికి కలప కోసం సైతం చెట్లను నరికేయాల్సిన పరిస్థితి నెలకొంది.

**విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం..**

గత పదేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. ప్రభుత్వాలు నిషేధించిన పలు ప్లాస్టిక్ ఉత్పత్తులను యథేచ్ఛగా వాడుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇవి భూమిలో కలిసేందుకు సుమారు 200 నుంచి వెయ్యేళ్ల వరకు సమయం పడుతుంది. ఈ ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణానికి పెను ప్రమాదం సంభవిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మొక్కలు నాటడమే ఏకైక మార్గం...**

రావుల శ్రీనివాస్, పర్యావరణ ప్రేమికుడు, మిర్యాలగూడ.

అభివృద్ధి పేరుతో చెట్లను నరికేస్తున్నారు. మానవ మనుగడ సజావుగా సాగాలంటే చెట్లను నరకడం ఆపాలి. దీంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని ప్రభుత్వాలు చెప్తున్నాయి. దీన్ని నివారించాలంటే ప్రజలే ముందుకు వచ్చి స్వచ్ఛందగా మొక్కలు నాటుతూ వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలి.

# సేంద్రియ ఎరువు.. తయారీ సులువు




కరీంనగర్ : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కరీంనగర్ నగర పాలక సంస్థ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు పకడ్బందీగా చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే 31వ డివిజన్‌లో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్ల నుంచి వచ్చే కుళ్లిన కూరగాయలు, హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి వచ్చే ఆహార పదార్థాలను డంపింగ్‌యార్డుకు తరలించకుండా సేంద్రియ ఎరువు తయారు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు నగరపాలక సంస్థ వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఇటీవల యంత్రాలను ప్రదర్శించారు. కంపోస్టు ఎరువు తయారీకి కావాల్సిన యంత్రాలు, పనితీరు గురించి ఆయా ప్రతినిధులు వివరించారు. **కోళ్ల ఫారాలకు బ్లాక్ స్లోడ్జర్ ఫ్లై :** కోళ్ల ఫారాల్లో ఉండే హానికర ఈగలను, వాసనను తగ్గించడంతోపాటు వ్యర్థాల నుంచి వచ్చే కీటకాలను అరికట్టడానికి, ఫుడ్ వేస్టేజీ తినేందుకు బ్లాక్ స్లోడ్జర్ ఫ్లై కీటకాలు ఉపయోగపడతాయి. ఇవి వాటిని తిని, సేంద్రియ ఎరువుగా మారుస్తాయి. మొదట ఇవి పురుగుల మాదిరిగా ఉండి ఈగల తరహాల వృద్ధి చెందుతాయి. వీటితో ఎలాంటి హాని ఉండదు. 40 రోజుల తర్వాత ఇవి చనిపోతాయి.

**బయోగ్యాస్ తయారీ :** హోటళ్లు, రెస్టారెంట్లు, కల్యాణ మండపాల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు, చికెన్, మటన్ వ్యర్థాలతో గ్యాస్ తయారీ చేయొచ్చు. ప్రస్తుతం కార్పొరేషన్ నుంచి తడి చెత్త మొత్తం 8 టన్నులు వస్తోంది. 10 టన్నుల చెత్తకు కావాల్సిన బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. దీనిని ఉపయోగించుకుంటే గ్యాస్ తయారీ చేసి హోటళ్లకు సరఫరా చేసే వీలుంది.

చాక్లెట్ కవర్, ప్లాస్టిక్ కవర్లతో టైల్స్ : కుర్‌కురే ప్యాకెట్, చాక్లెట్ కవర్, ఒకసారి వాడి పడేసే నీళ్ల సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులతో టైల్స్, కుర్చీలు, టేబుళ్లు, పలకలు, పెన్నులు, ట్రేలు వంటివి తయారు చేసేందుకు ఏరోబిక్ బయో కంపోస్టర్ వినియోగిస్తున్నారు. ఈ యంత్రం కొనుగోలు ఖర్చుతో కూడుకున్నది కావడంతో పురపాలికలు తీసుకొని మహిళా సంఘాలకు అప్పగిస్తే చెత్తలో ప్లాస్టిక్ శాతం తగ్గుతుంది.

**పనితీరును వివరిస్తున్న ప్రతినిధి**

ఇళ్లలో మిగిలిన ఆహార పదార్థాలు, కుళ్లిన కూరగాయలు, పండ్ల తొక్కలు వంటివి చెత్తలో పడేయకుండా ఇంటి దగ్గరే సేంద్రియ ఎరువుగా మార్చవచ్చు. రెండు డబ్బాలు తీసుకొని ఒక డబ్బాలో నెల రోజుల వరకు వీటిని పోయాలి. నిండిన తర్వాత మరొక డబ్బాలో పోయాలి. ఎండిన కొబ్బరిపొడి మిక్స్ చేయాలి. ఆటోమెటిక్‌గా పురుగులు తయారవుతాయి. కొద్దిరోజులకే ఎరువుగా మారుతోంది.

# వడగాలుల కాలం.. వడగళ్ల ప్రతాపం



కాగజ్‌నగర్ : జిల్లాలో వడగాలులు వీచే వేసవి కాలంలో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. కౌటాల, రెబ్బెన, సిర్పూర్(టి) మండలాల్లో పాక్షికంగా, కాగజ్‌నగర్ పట్టణం, మండలంలోని పలు గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపింది. పంటలు చాలాచోట్ల దెబ్బతిన్నాయి. ఇళ్ల పైకప్పులు లేచిపోగా, చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా, నజ్రూల్‌నగర్ విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని స్తంభాలు విరిగి పడ్డాయి.

**దెబ్బతిన్న 600 ఇళ్లు** వడగళ్ల వానకు కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో సుమారు 600 ఇళ్లకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. పట్టణం, నజ్రూల్‌నగర్, వల్లకొండ, నాగంపేట్, రాస్పెల్లి పంచాయతీల్లో అధికంగా నష్టం వాటిల్లింది. కాగజ్‌నగర్ మండలంలో 37, పట్టణంలో 10 ఇళ్లకు నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. మరిన్ని ఇళ్లకు సైతం నష్టం వాటిల్లిందని, పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని తహసీల్దార్ కిరణ్ తెలిపారు.

**మూడు వేల ఎకరాల్లో మొక్కజొన్న నష్టం**

ఉమ్మడి నజ్రూల్‌నగర్ పంచాయతీలోని 13 గ్రామాలు, అనుకోడ, ఈజ్‌గాం, వల్లకొండ, తదితర గ్రామాల్లో సుమారు అయిదు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. శనివారం ఆయా గ్రామాల్లో ఏఈఓలు పరిశీలించగా.. సుమారు 3 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక సర్వేలో తేలిందని ఏఓ రామకృష్ణ తెలిపారు.

**67 ఎకరాల్లో మామిడి తోటలకు..**

నజ్రూల్‌నగర్, జంబుగ, గజ్జిగూడ, గన్నారం, నాగంపేట్ గ్రామాల్లో 67 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్టు సర్వే నిర్వహించిన కాగజ్‌నగర్ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి సుప్రజ చెప్పారు.

**స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు**

కోసిని, నజ్రూల్‌నగర్, భట్టుపల్లి, జంబుగ విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలో 120 విద్యుత్తు స్తంభాలు విరిగి పడ్డాయి. ఎస్ఈ శేషారావు, డీఈ నాగరాజుల ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. విద్యుత్తు లైన్లు తెగిపోవడం, స్తంభాలు నేలకొరగడంతో.. పలు గ్రామాల్లో భగీరథ నీటి సరఫరా నిలిచింది. విలేజి నం.8లో మాజీ సర్పంచి గోకుల్ రాయ్ జనరేటర్ ఏర్పాటు చేయడంతో.. రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నీటిని నింపుకొని అవసరాలు తీర్చుకున్నారు.

**ఏ అధికారి రాలేదు.. బికాస్‌రాయ్, విలేజ్ నం.8**

గాలులకు ఇంటి పైకప్పు ఆనవాళ్లు లేకుండా పోయింది. రాత్రంతా పిల్లలతో జాగరణ చేయాల్సి వచ్చింది. ఉదయం అధికారులకు సమాచారమిచ్చినా ఎవరూ రాలేదు. ఓవైపు నిల్వ నీడలేక, మరోవైపు సాగుచేసిన కూరగాయల తోట దెబ్బతినడంతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు ఆదుకోవాలి.

# సన్నం సరే.. ఉన్న బియ్యం మాటేంది?

ఆదిలాబాద్ :ఓ చౌకధరల దుకాణంలో ఈ నెల బియ్యం పంపిణీ చేయగా.. మిగిలిన దొడ్డు బియ్యం బస్తాలివి. సన్నబియ్యం ఇస్తే నిల్వ ఉన్న దొడ్డు బియ్యం ఏం చేస్తారో తెలియక డీలర్లలో ఆందోళన నెలకొంది. వీటిని తిరిగి ప్రభుత్వ గోదాముకు తీసుకెళ్లాకే సన్నబియ్యం దుకాణాలకు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.చౌకధరల దుకాణాల్లో వచ్చే నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. దుకాణాల్లో పేరుకుపోయిన దొడ్డు బియ్యం నిల్వలపై డీలర్లలో ఆందోళన కనిపిస్తోంది. పోర్టబులిటీ సౌకర్యంతో డీలర్లు కోటాకు మించి బియ్యం తీసుకునే వెసులుబాటు ఉండటంతో ఇప్పుడు అదే వారికి ఇక్కట్లు తెచ్చిపెట్టనుంది. పంపిణీలో ఈ సారి ఆలస్యం కావడంతో మెజార్టీ డీలర్లు ఏప్రిల్‌లో బియ్యం రావడం ఆలస్యమవుతుందని నిల్వలు తెచ్చిపెట్టుకున్నారు. ఫలితంగా అలా మిగులు బియ్యం వెనక్కి తీసుకోకుండానే ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి చర్యలు తీసుకోనుండటం వారిని కలవరపెడుతోంది.చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు దొడ్డుబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఆహార భద్రతకార్డు(ఎఫ్ఎస్‌సీ) ఒక్కో యూనిట్కు ఆరు కిలోల చొప్పున, అంత్యోదయ ఆహారభద్రత కార్డుదారు(ఏఎఫ్ఎస్‌సీ)కు 30 కిలోల చొప్పున, అదే అన్నపూర్ణ అన్నయోజన (ఏఏవై) కార్డుదారులకు 10 కిలోలు ఉచితంగా పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15 వరకు లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా.. కోటా కేటాయింపులో ఆలస్యం కారణంగా ఈ తేదీల్లో తరచూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు పోర్టబులిటీ సౌకర్యంతో కార్డుదారు రాష్ట్రంలో బియ్యం ఏ దుకాణంలోనైనా తీసుకునే వెసులుబాటు ఉండటంతో.. డీలర్లు నిర్ణీత కోటాకు మించి బియ్యం తీసుకుంటున్నారు. తాజాగా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెబుతుండటంతో దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు భారీగా మిగిలిపోయాయి. ఏప్రిల్ మాసానికి ఇంకా వారం రోజుల గడువు ఉండటంతో దుకాణ నిల్వలు ఎప్పుడు ఖాళీ చేస్తారో స్పష్టత రావాల్సి ఉంది. ఇదే విషయమై అధికార వర్గాలను సంప్రదిస్తే దీనిపై ఆదేశాలు రావాల్సి ఉందని సమాధానం ఇస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్‌లో చూపిస్తున్న వివరాలకు, దుకాణంలోని మిగులు బియ్యం లెక్కలు సరిచూసుకోవడంలో డీలర్లు మల్లగుల్లాలు పడుతున్నారు.

# అరకొర సిబ్బంది.. అంతటా ఇబ్బంది

నల్గొండ : సూర్యుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. వృద్ధులు, యువకులు, చిన్నారులు అనే తేడా లేకుండా ఎక్కువ శాతం మంది వేసవిలో వచ్చే రోగాలబారిన పడుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా జనరల్ ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. అయితే ఏ విభాగంలోనూ పూర్తి స్థాయిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారిపైనే భారం పడుతోంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా మూడేళ్లు పైబడిన కారణంగా కొంతమంది వైద్యాధికారులు వెళ్లాల్సి వచ్చింది.

వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో దేవరకొండ, మిర్యాలగూ




డ, నకిరేకల్, నాగార్జునసాగర్, మర్రిగూడ, ఆసుత్రులతో పాటు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యూపీహెచ్‌సీలు, బస్తీదవాఖానాల్లో వైద్యులు, నర్సులు, కిందిస్థాయి సిబ్బంది సరిపడలేక ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, వైద్యకళాశాల ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వంటి ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌ఛార్జులతో కాలం వెళ్లదీస్తున్నారు.

**నివేదికలు పంపాం:**డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి విభాగాల వారీగా ఖాళీల వివరాలను కలెక్టర్‌తో పాటు ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వ ఆదేశాలు వస్తే నియామకాలు జరుగుతాయి. ప్రస్తుతానికి జిల్లాలో ఎక్కడా ఎవరికి ఇబ్బంది లేకుండా ఉన్న వైద్యులు, సిబ్బందితో వైద్య సేవలు అందిస్తున్నాం.

# శంకుస్థాపన ముహూర్తం సమీపిస్తోంది!

వేంసూర జిల్లాలో తొలి పామాయిల్ కర్మాగార పనుల ప్రారంభోత్సవానికి ముహూర్తం దగ్గరపడుతోంది. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో కర్మాగార నిర్మాణానికి గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ఉగాది పర్వదినాన శంకుస్థాపనకు ఆయిల్ ఫెడ్ అధికారులు ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు.

**ఏర్పాట్లు ఇలా..**

కల్లూరుగూడెంలో 42 ఎకరాల్లో రూ.87 కోట్లతో పామాయిల్ కర్మాగారం కొత్తగా నిర్మించనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్ ఫెడ్ రాష్ట్ర అధికారుల ఆదేశాలతో పరిశ్రమ శంకుస్థాపనకు సంబంధించిన ఏర్పాట్లు కొద్దిరోజులుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ప్రధాన రహదారి నుంచి కర్మాగారానికి 60 అడుగుల మార్గాన్ని శరవేగంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తిచేసి ఫెన్సింగ్ వేయగా.. ఆ తర్వాత బుష్ కటింగ్ పనులు పూర్తిచేశారు.

**తోటల విస్తరణకు మరింత అవకాశం**

కర్మాగారం పూర్తయితే జిల్లాలో, ముఖ్యంగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఆయిల్‌పాం సాగు మరింత జోరందుకుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కర్మాగార ప్రతిపాదనకు ముందే వేంసూరుతో పాటు సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు మండలాల్లో తోటలు వేసేందుకు రైతులు ఆసక్తి చూపారు. తాజాగా కొత్త పరిశ్రమ రానున్న నేపథ్యంలో 50–60 ఏళ్ల వయసున్న మామిడి తోటలను తొలగించి ఆయిల్‌పాం మొక్కలు నాటేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఫిబ్రవరి, మార్చిలోనే వేంసూరు మండలంలో 150 ఎకరాల్లో మామిడి తోటలు తొలగించడం విశేషం. మామిడితో పోల్చితే ఆయిల్‌పాం తోటల నిర్వహణ, యాజమాన్య పద్ధతులు తేలిక. అధిక దిగుబడులతో పాటు వాటి రవాణా సులువుకానుంది. ప్రభుత్వ రాయితీలతో తోటల విస్తీర్ణం వచ్చే ఏడాదికల్లా మరింత పెరిగే అవకాశముంది. ప్రస్తుత లెక్కల ప్రకారం.. ఖమ్మం 1,478, పాలేరు 3,732, మధిర 3,741, సత్తుపల్లి 11,672, వైరా నియోజకవర్గంలో 5,190 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది.

# ప్రాజెక్టులు నిండకుంటే ఇక్కట్లే!

ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ నెల ఆరంభం నుంచి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. వచ్చే రెణ్నెల్లు భానుడి సెగలు, వడగాలులు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. మరోవైపు భూగర్భజలాలు పడిపోతున్నాయి. వ్యవసాయ బోర్లు వట్టిపోతున్నాయి. నదీ జలాలు అడుగంటుతున్నాయి. ఈ సమయంలో ప్రణాళికాబద్ధంగా, ప్రత్యామ్నాయాలతో ముందుకుసాగితేనే సాగు, తాగు ఎద్దడిని సమర్థంగా ఎదుర్కోగలం. ప్రధాన ప్రాజెక్టుల వారీగా ప్రస్తుత పరిస్థితులు, అధికారులు చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తే..

**పాలేరు జలాశయం**

జలాశయానికి నాగార్జునసాగర్ నుంచి 5,551 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వీటిల్లోంచి ఎడమ కాలువ ఆయకట్టుకు 4,606, పాత కాలువకు 200, 'భక్త రామదాసు' ఆయకట్టుకు 275 క్యూసెక్కుల నీరిస్తున్నారు. సాగు సంగతి ఇలాఉంటే.. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల తాగునీటికి మరో 135 క్యూసెక్కులు సరఫరా జరుగుతోంది. సాగర్ నుంచి మరో నెలపాటు జలాలొస్తాయని అంచనా. ఆ తర్వాత రిజర్వాయర్ నుంచి 2,375 ఆవాసాలకు రెణ్నెల్లపాటు తాగునీరివ్వాలి. ఏప్రిల్‌లో సాగర్ నీరివ్వకుంటే గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదు. ప్రస్తుత జలాల్ని రైతులు సాగుకు వారబందీతో పొదుపుగా వాడుకోవాలి.

నిల్వ సామర్థ్యం: 2.558 టీఎంసీలు

ప్రస్తుత నిల్వలు: 1.768 టీఎంసీలు

పూర్తిస్థాయి నీటిమట్టం (అడుగుల్లో): 23

ప్రస్తుతం: 18.25

వైరా..వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని 11 మండలాల్లోని 465 గ్రామాల అవసరాలకు.. రోజుకు 10 కోట్ల లీటర్ల తాగునీరివ్వాల్సి ఉంది. ఇది సాధ్యం కావాలంటే నీటిమట్టం 13 అడుగులకు తగ్గకుండా చూడాలి. మరోవైపు, ఆయకట్టు పంటలు కాపాడుకునేందుకు జలాలు అందిస్తున్నారు. ఎండల తీవ్రతతో నీటి ఆవిరి శాతం పెరుగుతుంది. సాగర్ జలాలు అరకొరగా సరఫరా అవుతున్నందున, వచ్చే రెణ్నెల్లు నిల్వల్ని పొదుపుగా వాడేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

పూర్తిస్థాయి నీటిమట్టం (అడుగుల్లో): 18.3

ప్రస్తుతం: 12.2

"జిల్లాలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతాం. గ్రామీణ నీటిసరఫరా, భగీరథ గ్రిడ్ విభాగం సమన్వయంతో నిల్వల నిర్వహణ, శుద్ధి, సరఫరా చేపడుతున్నాం. ప్రాజెక్టుల్లో నిల్వలు తగ్గితే ప్రత్యామ్నాయ వనరులు సద్వినియోగం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టుకు సైతం వారబందీ విధానంలో నీరిస్తున్నాం. వృథాకు అడ్డుకట్ట వేస్తూనే, జలాలు పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచిస్తున్నాం."మిషన్ భగీరథ, నీటిపారుదల శాఖ అధికారులు

# పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం-ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.
ముఖ్యాంశాలిలా..
మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం
ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు.ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.
ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ-ఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.
పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ
ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

# నాణ్యతా ప్రమాణాలు పట్టేదెవరికి?

పెద్దపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్దేశించిన ఈ-నామ్ వ్యవస్థ వ్యాపారులకు వరంగా మారింది. పెద్దపల్లి మార్కెట్‌లో రైతులు తెచ్చిన పత్తికి నాణ్యతతో సంబంధం లేకుండా ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ విషయంలో భారత పత్తి సంస్థ(సీసీఐ) చెల్లించే మద్దతు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో 8 శాతం తేమ కలిగిన పత్తి క్వింటాలుకు రూ.7,520 ఉండగా ఇటీవల నాణ్యత తగ్గిందనే ఉద్దేశంతో సీసీఐ మద్దతు రూ.7,430కు కుదించింది. పత్తిలోని వివిధ ప్రమాణాల స్థాయిని బట్టి మద్దతు ధర అటు ఇటుగా మారుతోంది. **పట్టించుకోని అధికారులు**సీసీఐ పత్తిలో 8-12 వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుంది. నిబంధనల ప్రకారం ఒక శాతం తేమ పెరిగితే ధర కూడా ఒక శాతం తగ్గుతుంది. 12 శాతం ఉంటే రూ.7,132కు కొనుగోలు చేస్తుంది. ఈ నిబంధనను వ్యాపారులకు వర్తింపజేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ 18 శాతం ఉండగా ధర రూ.5003గా నిర్ణయించారు. ఈ మేరకు సంచిపై మార్కర్‌తో రాశారు. నిబంధనల ప్రకారం రూ.6,687 వరకు చెల్లించాలి. మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరను ప్రామాణికంగా తీసుకున్నా రూ.6,319 చెల్లించాలి. శుక్రవారం మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,022 వరకు నమోదైంది. అయితే ఇవేవీ వ్యాపారులకు ప్రామాణికంగా కనిపించడం లేదు.

**వ్యాపారికి నచ్చిందే ధర**

పెద్దపల్లి మార్కెట్‌లో 11 మంది క్రియాశీలక అడ్తీదారులుండగా వీరి వద్ద 7 నుంచి 8 మంది కొనుగోలుదారులు ఖరీదు చేస్తున్నారు.
వారం రోజులుగా ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులే తీసుకుంటున్నారు. మిల్లర్లు మార్కెట్‌వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక ఆన్‌లైన్‌లో ఇతర మార్కెట్‌కు చెందిన ట్రేడర్లు కొనుగోలు చేసే స్థాయిలో వ్యవస్థం అభివృద్ధి చెందలేదు. నాణ్యతను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. సిబ్బందిని కూడా నియమించలేదు.

# బుక్కుతున్న డిపాజిత్తులు

నంద్యాల : పాములపాడు మండలం కనకయ్య కొట్టాలలో కేసీ కాల్వ 13వ డిస్ట్రిబ్యూటరీలో పనులు చేసినట్లు ఎం.బుక్కులు చేశారు. రూ.1.40 కోట్లతో చేసిన ఈ పనులకు సంబంధించి రూ.70 వేల డిపాజిట్ మొత్తం తిరిగి చెల్లించేందుకు రూ.5 వేల వరకు వసూలు చేశారు.బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలం వరకు జరిగిన పనులకు ఒక్కో బిల్లుకు రూ.1500 వరకు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది.కేసీ కాల్వ పరిధిలో 2018లో చేసిన నీరు- చెట్టు పనుల డిపాజిట్ మొత్తాలకు సంబంధించి కొన్ని రోజులుగా ఎం.బుక్కులు చేస్తున్నారు. ఆయా పనులకు తుది(ఫైనల్) బిల్లు చేయాలంటే కచ్చితంగా నిర్ణీత మొత్తం లంచం ఇవ్వాల్సిందేనని కొంతమంది అధికారులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బిల్లులు చేయడం లేదని గుత్తేదారులు గగ్గోలుపెడుతున్నారు.
కార్యాలయంలో కాసుక్కూర్చున్నారు
ఉమ్మడి జిల్లా పరిధిలో కేసీ కాల్వ పొడవునా 2 వేల వరకు పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి గుత్తేదారులకు డిపాజిట్ మొత్తం రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సిన ఉంది. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 ఎం.బుక్కులకు సంబంధించి రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. 500 మంది గుత్తేదారులకు ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ.27 వేలు చొప్పున డిపాజిట్ మొత్తాలు తిరిగి ఇవ్వాల్సి ఉంది. రూ.27 వేలు రావాల్సిన గుత్తేదారుల నుంచి రూ.1500, రూ.70 వేలు రావాల్సిన వారి నుంచి రూ.2,500 వరకు కేసీ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇవ్వకుంటే పక్కన పెట్టేస్తారుఅడిగినంత ఇవ్వకుంటే ఎం.బుక్కులు కార్యాలయాల్లోనే ఉండిపోతున్నాయి. ఈ మొత్తాలు త్వరగా ఇస్తే పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి వెళ్తాయి. లేదంటే కేసీ కార్యాలయా ల్లోనే పేరుకుపోతున్నాయి. నందికొట్కూరు, బండిఆత్మకూరు, గడివేముల, శిరివెళ్ల మండలాలకు చెందిన కొన్ని పనులకు అడిగినంత ఇవ్వకపోవడంతో రోజులకొద్దీ ఎం.బుక్కులు కార్యాలయంలోనే ఉండిపోయాయి. చివరికి గుత్తేదారులు దిగొచ్చాకే బిల్లులయ్యాయి. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ గుత్తేదారు అధికారులను ప్రసన్నం చేసుకోవడంతో పెద్ద మొత్తంలో బిల్లులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.రూ.350 కోట్ల పనులకు చెల్లింపులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కేసీ కాల్వ పరిధిలో 2018లో నీరు- చెట్టు పనులు జరిగాయి. వీటిని సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం రాజోలి వరకు సుమారు 180 కి.మీల పొడవున చేపట్టారు. రూ.350 కోట్లు వెచ్చించి చెరువుల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, ఆయకట్టు పరిధిలోని పొలాల్లో మట్టి రహదారులు వంటి పనులు చేశారు.

# పొదుపు మరిస్తే గడ్డుకాలమే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో 1,218 గ్రామ పంచాయతీలు రెండు నగరపాలక సంస్థలు, 14 పురపాలికల్లో వచ్చే వేసవి నాటికి తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జనవరి నెలలోనే పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అవరోధాలు ఎదురవుతున్నాయి. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలతోపాటు పలు చెరువుల్లోని నీటిని శుద్ధి చేసి మిషన్ భగీరథ ద్వారా ఇళ్లకు నీళ్లందించే ప్రక్రియలో అక్కడక్కడ ఇబ్బందులున్నాయి. ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని 5 బల్దియాలకు, 346 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా నీళ్లందే విషయంలో లోపాలు పూర్తిగా తొలగిపోలేదు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోనూ 20శాతం గ్రామాలకు నీరందించే పథకాలదీ ఇదే పరిస్థితి. ఇంట్రా పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం శాపంగా మారింది. ఇప్పటి నుంచే అధికారులు దృష్టి పెడితే వేసవిలో తాగు నీటి ఎద్దడి దరిచేరదు.

**సాగు అవసరాలకు వినియోగం**

ప్రధాన జలాశయాల్లోని నీటిని సాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎల్ఎండీ నుంచి ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని పంటలకు కాకతీయ కాలువ ద్వారా నిత్యం 4,229 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈసారి ఇక్కడి జలాశయంలో నీటి మట్టం కొంత తగ్గింది. ఇదే తరహాలో వరి పంట కోసం ఏప్రిల్‌లోనూ చివరి తడికి నీళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. జాగ్రత్తగా నీటిని వినియోగించకుంటే వేసవిలో కరీంనగర్ కార్పొరేషన్‌లో తాగునీటి అవసరాలకు తిప్పలు పడాల్సి వస్తుంది. ఎల్లంపల్లి, మధ్యమానేరు జలాశయాలలో నీటి నిల్వ బాగున్నా.. పొదుపుగా వినియోగిస్తేనే వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. గతేడాదితో పోలిస్తే జగిత్యాల జిల్లాలో 15 శాతం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 6 శాతం లోటు వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షాలు, నిల్వ ఉన్న నీళ్లను ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకోకుంటే తీరని నష్టం, కష్టం వాటిల్లే వీలుంది.

**లోపాలు సవరిస్తేనే!**

మిషన్ భగీరథ ద్వారా నాలుగు జిల్లాల్లో రూ.3,300 కోట్లు వెచ్చించి 1,351 నీటి ట్యాంకులను నిర్మించారు. 7,692 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. పంచాయతీలతోపాటు మరో 1,126 అనుబంధ గ్రామాలకు తాగునీటి సరఫరాను మెరుగుపర్చారు. అయితే 12 నియోజకవర్గాల పరిధిలో ఆరు గ్రిడ్‌ల ద్వారా శుద్ధ జలాలను అందించే విషయంలో ఇంకా లోపాలున్నాయి. ముఖ్యంగా 18,970 మోటార్లను ఏర్పాటు చేయగా వీటిలో నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారులు, వాగులు, రైల్వే లైన్ల వద్ద భూగర్భ పైప్‌లైన్లలో లీకేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని నీటి సంప్‌లకు నీరు అందని దుస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇలాంటి లోపాలను సవరించి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. 'వచ్చే వేసవిలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగు శ్రద్ధ వహించాలి. ఇప్పటి నుంచే నీటి వనరుల్లో ఉన్న జలాలను సంరక్షించండి. లోపాలను సవరించుకోండి' ఇటీవల మంత్రి సీతక్క పంచాయతీ

# గుర్తింపు దక్కినా.. ఎదురు చూపులే!



మెట్‌పల్లి : మండలం ఆత్మకూర్ పల్లె దవాఖానా ఇది. 2023లో ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు దక్కింది. దీని ద్వారా మంజూరయ్యే నిధులతో మరింత అభివృద్ధి చేసుకోవచ్చని భావించారు. సుమారు రెండేళ్లు దగ్గర పడుతున్నా నిధులు విడుదల కాలేదు. నిధులు విడుదలైతే ప్రహరీ, ప్రధాన ద్వారం, ఇతర మౌలిక వసతులు, వైద్య సేవలకు అవసరమైన పరికరాలు సమకూర్చుకోవచ్చని భావిస్తున్నారు.
ప్రజలకు అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో సేవలందించడమే లక్ష్యంగా కేంద్రం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలను(ఎన్‌క్యూఏఎస్) రూపొందించింది. ఈ ప్రమాణాలను పాటించే ప్రభుత్వ ఆసుపత్రులకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు ఇవ్వడంతో పాటు మూడేళ్ల పాటు నిధులు మంజూరు చేస్తోంది. తద్వారా ఆయా ఆసుపత్రుల్లో వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులు మరింత మెరుగుపడి ప్రయోజనం చేకూరుతుందన్నది ఆలోచన. ఎన్‌క్యూఏఎస్ కింద మొదట్లో గుర్తింపు దక్కిన ఆసుపత్రులకు నిధులు మంజూరైనా, ఆ తర్వాత ఎంపికైన వాటికి రెండేళ్లుగా నిధులు రాలేదు. జిల్లా ఆసుపత్రులు, సామాజిక, పట్టణ, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాల్లో అమలు చేస్తున్న ప్రమాణాలను అంశాల వారీగా తనిఖీ బృందాలు పరిశీలించి మార్కులు ఇస్తారు. వీటి ఆధారంగా ఆసుపత్రులకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు వస్తుంది. ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, కనీస వసతులు, రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితర నాణ్యత ప్రమాణాల ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు వచ్చిన తర్వాత ఆసుపత్రి స్థాయిని బట్టి మూడేళ్ల పాటు నిధులు విడుదల చేస్తారు. 2018 నుంచి ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపికవుతుండగా మొదట్లో ఎంపికైన ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, కథలాపూర్ పీహెచ్‌సీలకు నిధులు మంజూరయ్యాయి. ఆ తర్వాత మళ్లీ రెండోసారి ఈ మూడు ఎన్‌క్యూఏఎస్‌కు అర్హత సాధించాయి. వీటితో పాటు దశల వారీగా మరిన్ని పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలు, పల్లె దవాఖానాలకు గుర్తింపు దక్కింది. రెండేళ్లుగా నిధులు విడుదల కావడం లేదని తెలుస్తోంది. నిధులు విడుదల చేస్తే ఆసుపత్రుల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందేలా దోహదపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపికైన ఆసుపత్రులు
ఎంసీహెచ్ జగిత్యాల పీహెచ్‌సీలు - 6
యుపీహెచ్‌సీలు - 3
ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు (పల్లె దవాఖానా) - 14

రెండు పల్లె దవాఖానాలకు..
- ఎన్.శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి
జిల్లాలో ఎన్‌క్యూఏఎస్ గుర్తింపునకు ఆసుపత్రులు ఎంపికవుతున్నాయి. ఇటీవల రెండు పల్లె దవాఖానాలకు గుర్తింపు వచ్చింది. ఎన్‌క్యూఏఎస్ గుర్తింపుతో మరింత ప్రయోజనం ఉంటుంది. త్వరలోనే నిధులు విడుదలవుతాయి.

# పేదలకు ఆవాసయోగం

సిరిసిల్ల: జిల్లాలో పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. స్థలం ఉండి ఇళ్లులేనివారికి ఎంపిక చేసిన గ్రామాల్లో ఇళ్లు మంజూరు చేసింది. స్థలంలేని వారికి గతంలో అసంపూర్తి దశలో నిలిచిపోయిన రెండు పడక గదుల నిర్మాణాలను పూర్తిచేసి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనికి ఇటీవల బడ్జెట్లో నిధులు కేటాయించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో నిధులు విడుదల చేయనున్నారు.

**అసంపూర్తి దశలో 702 గృహాలు**

జిల్లాలో 6,886 రెండు పడక గదుల ఇళ్లు మంజూరుకాగా అందులో 3,546 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 3,448 గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 702 ఇళ్లు అసంపూర్తి దశలో నిలిచిపోయాయి. వీటిలో సిరిసిల్ల నియోజకవర్గంలో 558, వేములవాడలో 144 ఇళు ఉన్నాయి. వీటిని పూర్తి చేయనున్నారు. జిల్లాలో రెండు పడక గదుల నిర్మాణ వ్యయం రూ.248.9 కోట్లు కాగా ఖర్చు చేసింది రూ.188.49 కోట్లు.నిర్మాణాలు పూర్తయినా.. కొన్ని చోట్ల మౌలిక వసతుల్లేక పంపిణీ జరగలేదు. లబ్ధిదారుల ఎంపిక కూడా జరిగింది. కారణం మౌలిక వసతుల్లేవు. గత ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.5.04 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.5.30 లక్షలు కేటాయించింది. అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్తు, తాగునీరు వంటి కనీస వసతుల కల్పనకు ఒక్కోఇంటికి రూ.75 వేలు అదనంగా కేటాయించారు.రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైన చోట మౌలిక వసతుల కల్పన కోసం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల కోసం రూ.151 కోట్లు, పట్టణ ప్రాంతాల కోసం రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వాటిలో వివిధ దశలో రూ.24 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. మౌలిక వసతులు కల్పిస్తే మరికొన్ని గృహాలు లబ్ధిదారులకు



అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.
ప్రభుత్వం ఇటీవలి బడ్జెట్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యమిచ్చింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పేర్కొన్న ఆరు గ్యారంటీల్లో ఒక్కటైన ఇందిరమ్మ ఇళ్లను సాధ్యమైనంత ఎక్కువగా నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. వాటిని ఎల్-1, 2, 3 విభాగాల్లో ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. వీటిలో ఎల్-1లో స్థలం ఉన్నవారు. దీనిలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఇళ్లు మంజూరు చేశారు. ఎల్-2లో సొంత స్థలంలేని వారిని గుర్తించారు. ఎల్-3 జాబితాలోని దరఖాస్తులను ప్రభుత్వం ఏఐ (కృత్రిమ మేధ) ద్వారా మరోసారి పరిశీలించనుంది. దీనిలో గతంలో ఇందిరమ్మ ఇళ్లు పొందినవారు, ఇళ్లు, వ్యవసాయ స్థలాలు, ఇతర ఆస్తులు ఉన్నవారిని గుర్తిస్తుంది. దీనిలో ఏది ఉన్నా ఇళ్లు మంజూరు కాదు.

# కళ.. కలేనా..?

నారాయణగూడ: పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్ పదేళ్ల క్రితం వరకు చిన్నారులతో కళకళలాడింది. ప్రస్తుతం చిన్నారుల సందడి లేక వెలవెలబోతోంది. పిల్లలు వేసవి సెలవులను బాలభవన్‌లో ఆస్వాదిస్తారు. 1966లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దీన్ని ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా వేసవి శిబిరాలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించేవారు. బాలభవన్ తరపున 'బాలశ్రీ, బాలసూర్య, బాలరత్న' పురస్కారాలు అందించేవారు. ప్రస్తుతం అవి లేవు. ప్రతినెలా బీసీ, ఓసీ పిల్లలకు నామమాత్రపు రుసుము రూ.50, ఎస్సీ, ఎస్టీ పిల్లలకు రూ.20 ఉండేది. ప్రభుత్వ పాఠశాలల నుంచి పిల్లలను బాలభవన్‌కు బస్సులో తీసుకొచ్చేవారు. ఇప్పుడా బస్సు నిరుపయోగంగా మారింది.



పోస్టులన్నీ ఖాళీ..బాలభవన్‌లో లైబ్రేరియన్, చిత్రలేఖనం, విజ్ఞానశాస్త్రం, తబలా గురువులు మినహా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వారిలో ఒకరు జూన్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. సంగీతం, తబలా, మృదంగం, కథక్, కూచిపూడి, జానపదం, నాటకం, కరాటే, స్కేటింగ్ గురువులు కావాలి. జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, ఆంగ్లం, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులను ఇక్కడికి పంపించారు. ఒకే పోస్టులో ముగ్గురు సైన్స్ టీచర్లున్నారు. ఒక ఉపాధ్యాయురాలికి రాష్ట్రస్థాయి బాధ్యతల్ని అప్పగించడంపై విమర్శలున్నాయి. మరో ఎస్జీటీ టీచర్‌ను లైబ్రేరియన్‌గా పంపించారు. పదేళ్లుగా ఇన్‌ఛార్జి డైరెక్టర్.. ఇంతకుముందు బాలభవన్‌కు ప్రత్యేకంగా డైరెక్టర్ ఉండేవారు. పదేళ్లుగా అదనపు బాధ్యతలతో ఈ వ్యవస్థ కొనసాగుతోంది.

# గోదావరి జలాల విడుదల

అశ్వాపురం : భీమునిగుండం కొత్తూరు సీతారామ ఫేజ్-1 పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను అధికారులు విడుదల చేశారు. ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ఫేజ్-2 పంప్‌హౌస్ వైపు నీళ్లు పయనిస్తున్నాయి. ములుగు జిల్లా తుపాకులగూడెంలో సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి విడుదల చేసిన 1,200 కూసెక్కుల గోదావరి జలాలు దుమ్ముగూడెం ఆనకట్టను చేరుకొని పొంగిపొర్లుతున్నాయి. బెల్‌మౌత్ వద్ద గోదావరికి, సీతారామ ప్రధాన కాల్వకు మధ్యనున్న మట్టి కట్ట తొలగింపు పనులు పూర్తయ్యాయి. గోదావరి జలాలు సీతారామ ప్రధాన కాల్వలోకి ప్రవేశించాయి. అమెర్దా వద్ద సీతారామ హెడ్ రెగ్యులేటర్ ద్వారాలను అధికారులు తెరిచారు. గోదావరి జలాలు



భీమునిగుండం కొత్తూరు ఫేజ్-1 పంప్‌హౌస్‌కు చేరుకున్నాయి. పంప్‌హౌస్‌లోని ఏ-3 విద్యుత్తు మోటారును ఆన్ చేసి డెలివరీ సిస్టర్న్ ద్వారా సీతారామ రెండో ప్యాకేజీ ప్రధాన కాల్వలోకి విడుదలవుతున్నాయి. అక్కడి నుంచి పూసుగూడెంలోని ఫేజ్-2 పంప్‌హౌస్, కమలాపురంలోని సీతారామ ఫేజ్-3 పంప్‌హౌస్‌కు చేరుకుంటాయి. జలవనరులశాఖ ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆనకట్ట పైనుంచి గోదావరి జలాలు పొంగిపొర్లుతుండటంతో సీతారామ ప్రధాన కాల్వలోకి విడుదల చేస్తున్నామని తెలిపారు.

# విపత్తు దళం.. సింగరేణి బలం

శ్రీరాంపూర్: విపత్తుల సమయంలో ఆదుకోవడంలో సింగరేణి రెస్క్యూ సిబ్బందికి దేశవ్యాప్త గుర్తింపు ఉంది. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ కోసం శ్రమిస్తున్న సైన్యం, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు సింగరేణి నుంచి వంద మంది రెస్క్యూ బృందం ఉంది. ఎన్‌డీఆర్ఎఫ్‌తోపాటు సింగరేణి బృందం వెంటనే అక్కడికి వెళ్లి సహాయ పనుల్లో నిమగ్నమైంది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి దాదాపు 60 మంది రక్షక చర్యల్లో పాల్గొన్నారు.
సింగరేణి యాజమాన్యం రెస్క్యూ బృందాలను అత్యంత సమర్థంగా ఖర్చుకు వెనుకాడకుండా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం సింగరేణిలో 483 మంది సుశిక్షితులైన రెస్క్యూ సిబ్బంది ఉన్నారు. వీరంతా భూగర్భ గనుల్లో తమ రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే, విపత్తుల సమయంలో సేవలు అందించడానికి ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందుతారు. కోల్ ఇండియా వెలికితీసే ఉత్పత్తిలో పది శాతం బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణి రెస్క్యూ సేవల్లో మాత్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఉండే ఐఆర్ఎంబీ (ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ బాడీ)లో కోల్ ఇండియాకు దక్కని సభ్యత్వం సింగరేణికి 2002లోనే లభించింది. దేశంలో ఎక్కడ విపత్తులు సంభవించినా, సహాయక చర్యల కోసం సింగరేణివైపు చూడటం జరుగుతోంది. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్), హట్టి గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (హెచ్‌జీఎంఎల్), యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐ) లాంటి సంస్థలకు సింగరేణి విపత్తుల నిర్వహణపై ఆయా సంస్థలకు రెస్క్యూ బృందాలకు శిక్షణ ఇస్తోంది. అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లోనూ సింగరేణి సంస్థ పలు మార్లు బహుమతులు సాధించింది. ప్రస్తుతం సింగరేణి రెస్క్యూ జీఎం కె.శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ బి.మాధవరావు (డీజీఎం), శిక్షకులుగా అదనపు మేనేజర్ భాస్కర్‌రెడ్డి, డీవైఎస్ఈ నర్సింహామూర్తిలు గోదావరిఖని కేంద్రంగా సింగరేణి వ్యాప్తంగా రెస్క్యూ బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు.

**వీరు అందించిన సేవల్లో కొన్ని..**

ఎనిమిదేళ్ల కింద కోల్ ఇండియాలో పైకప్పు కూలి అత్యంత విలువైన కంటిన్యూయస్ మైనర్ యంత్రం కూరుకుపోతే సింగరేణి రెస్క్యూ బృందం అధునాతన న్యూమటిక్ హైడ్రాలిక్ కట్టర్స్, స్లిట్టర్స్ సహాయంతో ఆ యంత్రాన్ని వెలికి తీసింది. కొత్తగూడెం సమీపంలోని కేటీపీఎస్‌లోని కేబుళ్లకు మంటలు అంటుకుని దట్టమైన పొగ కమ్ముకుంటే అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేని స్థితిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రానైట్ గనిలో పేలుళ్ల సందర్భంగా పెద్ద బండకింద చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీశారు. సింగరేణిలో చోటు చేసుకున్న ప్రతీ విపత్తులోనూ రెస్క్యూ బృందం సహాయక చర్యలు చేపట్టిన ఘటనలు కోకొల్లలు. బోర్‌బావుల్లో పడినప్పుడు పిల్లల్ని కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయి. బోర్‌లోకి ఆక్సిజన్ సరఫరా చేయడం, చిక్కుకున్న పిల్లల కదలికల్ని గుర్తించడానికి సెర్చ్‌కామ్ ప్రోబ్ లాంటి అధునాతన వస్తువులు సింగరేణి సొంతం.

## గడ్డి చూపింది.. గట్టి ఉపాధి

కడెం : వారు కడెం ప్రాంత యువకులు.. ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వివిధ ప్రాంతాలు తిరిగారు. ముంబయి, దుబాయి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కొద్దికాలం దొరికిన పని చేశారు. కానీ అది ఎటూ సరిపోవడం లేదు. మెరుగైన ఉపాధి కోసం అన్వేషిస్తుండగా అనుకోని రీతిలో వీరికో అవకాశం అందివచ్చింది. దాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకుని లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారు. అదే గోధుమ గడ్డి జ్యూస్ విక్రయం. అందులోని పోషక విలువలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తుండటంతో ఈ జ్యూస్‌కు ఆదరణ పెరిగింది. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, జగిత్యాల జిల్లాల్లో ఇక్కడి యువకులు విక్రయ కేంద్రాలను నడుపుతున్నారు.

**నిర్మల్‌లో ఇద్దరు..**

ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి నిరాశతో తిరిగి వచ్చిన కడెం మండలం చిట్యాలకు చెందిన బోరె వెంకటేష్, ధర్మాజి తిరుపతి హైదరాబాద్‌లో రాపల్లి సత్యం జ్యూస్ సెంటర్ గురించి తెలుసుకుని ఆయనను సంప్రదించారు. ఆయన సూచనలతో నిర్మల్‌లో గోధుమ గడ్డి జ్యూస్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఒకరు డిగ్రీ కళాశాల వద్ద, మరొకరు ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఈ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. మరోవైపు ఇంటి స్లాబ్‌పైనే గోధుమ గడ్డి పెంచుతూ అవసరమైన వారికి సరఫరా చేస్తున్నారు. వివిధ రకాల జ్యూస్‌లనూ విక్రయిస్తున్నారు. వాటికి ఆదరణ లభించడంతో తమకు గిట్టుబాటుగా ఉందని వీరు పేర్కొంటున్నారు.

**16 ఏళ్లుగా హైదరాబాద్‌లో..**

కడెం మండలం లక్ష్మీపూర్‌కు చెందిన రాపల్లి సత్యం ఇక్కడ వ్యవసాయం



అచ్చిరాక ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. కొన్నాళ్లకు ఓ విదేశీ మిత్రుడు ఇచ్చిన సలహా మేరకు హైదరాబాద్ కేబీఆర్ పార్కు వద్ద 16 ఏళ్ల క్రితం గోధుమ గడ్డి జ్యూస్ విక్రయించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానికి ఆదరణ లభించడంతో మరో మూడుచోట్ల బ్రాంచీలు ఏర్పాటుచేసి ఉపాధి మెరుగుపర్చుకున్నారు. ఇప్పుడు గోధుమ గడ్డితో పాటు 16 రకాల ఆకుకూరలు, కూరగాయలతో రసాలు విక్రయిస్తూ మరో పదిమందికి ఉపాధి చూపిస్తున్నారు. ఆసక్తి ఉన్న యువకులకు శిక్షణ ఇస్తూ ఆయా ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నారు.

**ఆదిలాబాద్‌లో బంక రవి..**

కడెంకు చెందిన బంక రవి హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేశారు. ఆదాయం సరిపోక కడెం తిరిగొచ్చారు. హైదరాబాద్‌లో జ్యూస్ కేంద్రం నడుపుతున్న రాపల్లి సత్యం సూచనతో తానూ అదే మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నారు. కొద్దిరోజులు శిక్షణ తీసుకుని నెల క్రితం ఆదిలాబాద్ పార్కు దగ్గర గోధుమ గడ్డితోపాటు ఇతర కొన్ని రకాల రసాలను ఉదయపు నడకకు వచ్చేవారికి, ఇతరులకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

**భైంసాలో..**


కడెం మండలం పెద్దూరుకు చెందిన బైరి మహేష్ భైంసాలో కొంతకాలంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. అదనపు ఆదాయ వనరుగా గోధుమ గడ్డి జ్యూస్ కేంద్రాన్ని ఏనిమిది నెలల క్రితం ఏర్పాటు చేసుకుని ఉదయం ఉపాధి పొందుతున్నారు. అవసరమైన వారికి గడ్డి, తయారు చేసిన జ్యూస్ ఇళ్లకు తీసుకెళ్లి ఇస్తున్నారు.

## రీచ్ అక్కడ.. దోపిడీ ఇక్కడ

జైపూర్ : ఇసుక మాఫియా, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయినా జైపూర్ మండలం నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. నేరుగా ప్రధాన రహదారులపై నుంచే వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక రీచ్ కోటపల్లి మండలం కొల్లూరులో ఉండగా.. జైపూర్ మండలం ఇందారం, రామారావుపేట, వేలాల, కిష్టాపూర్ శివారుల నుంచి ఇసుక అక్రమ దోపిడీ జరుగుతోందనే విమర్శలున్నాయి. తాజాగా వేలాల, కిష్టాపూర్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకోవడం గమనార్హం.

**నంబర్ ప్లేట్ లేకుండానే రవాణా..**

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడి పట్టుబడితే ఇటీవల కాలంలో జరిమానాలు సైతం భారీగా విధిస్తున్నారు. గతంలో రూ.5 వేలు ఉ



న్న జరిమానా ప్రస్తుతం రూ.25 వేలకు పెంచారు. దీంతో అంతమొత్తం జరిమానా కట్టడానికి కొందరు వెనుకాడటం లేదు. మరికొందరు తమకున్న రాజకీయ పలుకుబడితో జరిమానాలను తగ్గించుకోవడం గమనార్హం. ఇటీవల పట్టుబడిన నాలుగు ట్రాక్టర్లతో రెండింటికి నంబర్ ప్లేట్లు లేకుండానే రవాణా సాగిస్తున్నారు. గతంలో కూడా ఇలా నంబర్ ప్లేట్ లేకుండా రవాణా చేసిన వారికి భారీ మొత్తంలోనే జరిమానాలు విధించారు.

**ఈ ప్రాంతాల నుంచే..**

జైపూర్ మండలంలోని రామారావుపేట, ఇందారం, టేకుమట్ల, శెట్‌పల్లి, బెజ్జాల, కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం శివారుల మీదుగా గోదావరి ప్రవాహం ఉంది. గోదావరిలో నీటి లభ్యత లేని కారణంగా ఇందారం, రామారావుపేట, వేలాల, కిష్టాపూర్ శివారులలో పాటు రసూల్‌పల్లి వాగు నుంచి ఇసుక రవాణా డిమాండ్‌ను బట్టి బాగానే సాగుతోంది. రాత్రివేళలో అదను చూసి ఇసుకాసురులు తమ పనికానిచ్చేస్తున్నారు.

# ఆపద వేళ.. అంబులెన్స్‌ల దందా!



హుజూరాబాద్: హుజూరాబాద్‌కు చెందిన ఓ మహిళకు ఇటీవల తుంటి ఎముక విరిగింది. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచనతో హనుమకొండ వెళ్లేందుకు ప్రైవేటు అంబులెన్స్‌ను ఆశ్రయించారు. సదరు నిర్వాహకుడు రూ.4 వేలు డిమాండ్ చేశాడు. అత్యవసరం కావడంతో చేసేదేమి లేక అడిగినంత చెల్లించారు.

జమ్మికుంటకు చెందిన ఒకరు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా.. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫార్సుతో వరంగల్ ఎంజీఎంకు ప్రైవేటు అంబులెన్స్‌లో తీసుకెళ్తే రూ.5 వేలు వసూలు చేశారు. ఇలా ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులు ఇష్టారీతిన వసూలు చేస్తున్నారు. రోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా భారీగా దండుకుంటున్నారు. వాస్తవానికి దూరాన్ని బట్టి కిలోమీటరు లెక్కన డబ్బులు తీసుకోవాలి. అయితే ఇదెక్కడా అమలు కావడం లేదు. ఇంకొందరైతే కమీషన్ల కక్కుర్తితో బాధితులను నమ్మించి కరీంనగర్, వరంగల్, హనుమకొండ, తదితర ప్రాంతాల్లో వారికిష్టమైన ప్రైవేటు ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు వేలకు పైగానే ప్రైవేటు ఆంబులెన్స్‌లు ఉన్నాయి.

**ప్రభుత్వాసుపత్రుల ఎదుటే నిలిపి..**

ఒక్క హుజూరాబాద్, జమ్మికుంటలోనే 30 అంబులెన్స్‌లు ఉన్నాయంటే ఏ స్థాయిలో దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రథమ చికిత్సలే తప్ప సరైన వైద్యంలేక ఇతర ఆసుపత్రులకు వెళుతున్న రోగుల సంఖ్య అధికంగా ఉంటుంది. దీంతో ప్రభుత్వాస్పత్రుల ఎదుటే అంబులెన్స్‌లను పార్కింగ్ చేసి అత్యవసర చికిత్సలు అవసరమైన రోగుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. 35–40 కిలోమీటర్ల దూరం వరకు సాధారణ రోగిని తీసుకెళితే రూ.2,500, ఆక్సిజన్ పెడితే రూ.3,200 చెల్లిస్తే చాలని వైద్యుడొకరుతో చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు కమీషన్‌గా సగటున రూ.లక్ష బిల్లుకు 30–35 శాతం ముట్టజెబుతున్నట్లు సమాచారం.

**సరైన పత్రాలు లేకుండా..**

ప్రభుత్వ నిబంధనల మేరకు అంబులెన్స్ వాహనాల్లో ప్రథమ చికిత్స కిట్టు.. ఫిట్‌నెస్, ట్యాక్సీ, పొల్యూషన్, బీమా పత్రాలతోపాటు డ్రైవర్‌కు బ్యాడ్జీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. వాహనంలో ఆక్సిజన్ సిలిండర్, మాస్కు ఉండాలి. అయితే కొన్నింటిలో ఇవేవి లేకుండానే నడిపిస్తున్నట్లు తెలిసింది. అత్యవసర సేవలు కావడంతో అధికారులు వీటిని తనిఖీ చేయడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నారనే ఆరోపలున్నాయి. అధికారులు తనిఖీలు చేసి ఈ దోపీడిని అరికట్టాలని కోరుతున్నారు.

# అమృత్ భారత్‌తో ఆధునిక వసతులు



రామగుండం : స్టేషన్లలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు రైల్వే శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన అమృత్‌భారత్ పనులు వేగంగా సాగుతున్నాయి. 2023 ఆగస్టులో రామగుండం, 2024 ఫిబ్రవరిలో పెద్దపల్లి స్టేషన్లలో అభివృద్ధి పనులను ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. రూ.26.5 కోట్లతో ఒక్కో స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. రామగుండంలో పనులు ఇప్పటికే వేగంగా సాగుతుండగా పెద్దపల్లిలో నెల రోజులుగా జోరందుకున్నాయి. జిల్లాకేంద్రంలోని స్టేషన్ నమూనాలో మార్పులు, చేర్పులతో పనులు ఆలస్యమయ్యాయి.

**సరకుల రవాణా కేంద్రం అభివృద్ధి**

పెద్దపల్లి స్టేషన్ ఆధునికీకరణతో పాటు సమీపంలోని సరకుల రవాణా కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నారు. రవాణా ప్లాట్‌ఫాంపై కవరింగ్ షెడ్ల నిర్మాణంతో పాటు బోగీలు వెలుపలికి కనిపించకుండా గోడ నిర్మించనున్నారు. ఇక్కడ సరకుల దిగుమతి, ఎగుమతి మొత్తం కూనారం రోడ్డు మీదుగా సాగేలా అటువైపు రవాణా ప్లాట్‌ఫాం విస్తరణ పనులు చేపడుతున్నారు. మరోవైపు కూనారం రైల్వే గేటు పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. కలెక్టర్ పలుమార్లు వంతెన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులు, గుత్తేదారులతో సమీక్షించడంతో పనుల్లో వేగం పెరిగింది. వేసవి చివరి నాటికి ఆర్వోబీ పనులు కొలిక్కి వచ్చే అవకాశముంది.

**మెరుగవనున్న సేవలు**

జిల్లాలో ప్రధానమైన రామగుండం, పెద్దపల్లి స్టేషన్లు మెరుగైన ఆదాయంతో ఇప్పటికే ఎన్‌ఎస్‌జీ–4 స్థాయికి చేరుకోగా అమృత్‌భారత్ పథకంతో మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రస్తుతం ఉన్న నడక వంతెనకు అదనంగా మరో ఎస్కలేటర్ నిర్మించనున్నారు. ప్లాట్‌ఫాం విస్తరణతో పాటు పూర్తిగా కవరింగ్ షెడ్లు నిర్మిస్తారు.

ప్రయాణికులు వేచి ఉండేందుకు వెయిటింగ్ హాల్‌తో పాటు ఏసీ హాల్ కూడా అందుబాటులోకి రానుంది. ప్రస్తుతమున్న టికెట్ వెండింగ్ యంత్రాలకు అదనంగా మరో యంత్రం ఏర్పాటు చేసి, బుకింగ్ కేంద్రాన్ని ఆధునికీకరిస్తారు. రెండు ప్లాట్‌ఫాంలకు ఇరువైపులా మరుగుదొడ్లు నిర్మిస్తారు. స్టేషన్ బయట ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరు పార్కింగ్ స్థలాలు కేటాయించి, షెడ్లు నిర్మిస్తారు. స్టేషన్ భవనాన్ని పూర్తిగా తొలగించి ఆధునిక నమూనాతో కొత్తది నిర్మించనున్నారు. పెద్దపల్లిలో భవనం కూల్చివేత సాగుతుండగా, రామగుండంలో నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి.

# ఆ మార్గం.. నిత్య నరకం

భీంపూర్ : తెలంగాణ – మహారాష్ట్ర ప్రాంతాలను అనుసంధానించే మార్గం అది. దాదాపు 20 వేల పైచిలుకు ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డు. ఆర్టీసీకి అధిక ఆదాయాన్నిచ్చే మార్గం. అధికారుల పట్టింపులేనితనం.. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ఫలితంగా ఆ మార్గం మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నరకయాతన తప్పడం లేదు. ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలను అనుసంధానిస్తూ జందాపూర్ నుంచి కరంజి – మాండ్వి, గుబిడి వరకు దాదాపు 50 కి.మీ. అంతర్రాష్ట్ర రోడ్డు దుస్థితి ఇది. గత ప్రభుత్వ హయాంలో జందాపూర్ నుంచి ఈదుల్లాసావర్గాం వరకు 7 కి.మీ. మేర రెండు వరుసల బీటీ రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి నిపాని వరకు, దనోర – కరంజి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.18 కోట్లు, కరంజి – గుబిడి వరకు మరో రూ.6 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గుబిడి రోడ్డు ఉత్తర్వులు ఊసు లేకపోయినా.. మిగిలిన రూ.18 కోట్లకు టెండర్లు పూర్తి చేసి 13 కి.మీ. మేర పనులు ప్రారంభించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఈదుల్లాసావర్గాం నుంచి నిపాని వరకు రోడ్డును విస్తరించి మట్టి, మొరం పోశారు. దారిపొడవునా పలు వంతెనలు నిర్మించారు. ఇక బీటీ వేయడమే తరువాయి అనుకుంటుండగా.. చేసిన పనులకు బిల్లులు రాక రెండు నెలలుగా గుత్తేదారు పనులు నిలిపి వేశాడు.

**దుమ్ము ధూళిమయం**

విస్తరించిన రోడ్డు గుండా దుమ్ము, ధూళితో ఎదురెదురుగా వస్తున్న



వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. మరోవైపు దనోర నుంచి కరంజి – గుబిడి వరకు రోడ్డు కంకర తేలి, గుంతలుగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జిల్లా కేంద్రం నుంచి కరంజి–టి వరకు గంటన్నరలో చేరుకోవాల్సిన బస్సు మరో గంట ఆలస్యంగా వస్తోందంటే రోడ్డు దుస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అత్యవసర సమయంలో గర్భిణులు, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్సులు రావడం లేదు. బదిలీల్లోనూ ఉపాధ్యాయులు మండల పాఠశాలల ఖాళీలను ఎంచుకునేందుకు విముఖత చూపడం వెనుక రోడ్డు దుస్థితే కారణం. అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో కదలిక తెచ్చేందుకు మండల పట్టభద్రులు ఈ నెల 27న జరిగే మండలి ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించేందుకు సిద్ధమవుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. బిల్లులు రాక.. నర్సయ్య, ఈఈ, ఆర్‌అండ్‌బీ బిల్లులు రాక గుత్తేదారు పనులు నిలిపేశారు. ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించాం.

## సమయం ఉంది మిత్రమా..!

పాల్వంచ : పదోతరగతి విద్యార్థినులు రమ, రమ్య, రమణి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారు. ముగ్గురు మంచి స్నేహితులు. వెళ్లే దారిలో.. నాకు కాస్త లెక్కలు చెప్పవా అని రమ్యను రమ అడిగింది. నాకు లెక్కలు ఏమోకానీ సైన్స్‌తో పెద్ద చిక్కొచ్చి పడింది అని రమ్య బదులిచ్చింది. సైన్స్ విషయాన్ని నాకు వదిలిపెట్టి.. ఇంగ్లిష్ సబ్జెక్టులో నేను ఎలా మెరుగుపడాలో చెప్పండి అని రమణి మాట కలిపింది. కొన్ని సబ్జెక్టులపై భయాలు నిరాధారం అనే విషయాన్ని గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గణితం, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టులపై భయానికి మూలకారణాలు గుర్తించి, వాటిని అధిగమించేందుకు యత్నిస్తే పట్టు సాధించటం సులువవుతుందని స్పష్టం చేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో గత మూడేళ్ల పదోతరగతి ఫలితాలను విశ్లేషిస్తే ఎక్కువ మంది విద్యార్థులు గణితం, సైన్స్, ఆంగ్లం సబ్జెక్టుల్లో అనుత్తీర్ణులవుతున్నారు. ఈసారి పదోతరగతి వార్షిక పరీక్షలు మార్చి 21న ప్రారంభమవుతాయి. 26 రోజులే మిగిలాయి. ఈ సమయాన్ని విద్యార్థులు ఎలా సద్వినియోగం చేసుకోవాలనే కోణంలో కథనం.

**మెలకువలతో లెక్కలు సులువే**

ప్రతి సబ్జెక్టులో కీలకమైన అభ్యసన మెలకువలను గుర్తించాలి. ఉ



దాహరణకు మ్యాథ్స్‌కు సంబంధించి భౌతిక అంశాలను వస్తువులకు అన్వయిస్తూ అభ్యసించడం ద్వారా సులువుగా నేర్చుకోవచ్చు. గణిత అంశాల్లో సమ వయస్కుల చర్చల్లో పాల్గొనటం, లెక్కలకు సంబంధించిన ఆటలతో తార్కిక ఆలోచన స్వభావం పెరుగుతుంది. వేగం, కచ్చితత్వం అలవడతాయి.

**ఆంగ్లంపై భయం పోవాలంటే..**

మిత్రులతో తరచూ ఆంగ్లంలో సంభాషించటం ద్వారా ఇంగ్లిష్ పదజాలం అభివృద్ధి చెందుతుంది. ఆంగ్ల ప్రశ్నపత్రంలో వచ్చే వివిధ రకాల డిస్కోర్స్‌లపైన ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలి. ఈ అంశాలను ఇతరులతో చర్చించటం ద్వారా ఆంగ్లం అంటే భయం పోతుంది.

**అన్వయించుకుంటే అసామాన్య ఫలితాలు**

ప్రయోగశాల పనులు, వైజ్ఞానిక ప్రదర్శనలు, బొమ్మలు గీయటం–భాగాలు గుర్తించటం, ముగ్గులు వేసే నైపుణ్యాన్ని సైన్స్ రంగోలి ద్వారా ప్రతిబింబింపజేయటం వంటి వాటితో సామాన్యశాస్త్రంపై పట్టు సాధించవచ్చు. నిజజీవిత అంశాలపై సమ వయస్కులు, మిత్రులతో హేతుబద్ధంగా చర్చించటం ద్వారా సృజనశీలత మెరుగుపడుతుంది. సన్నద్ధతే.. విజయంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతి పాఠ్యాంశానికి నిర్దిష్టమైన ప్రణాళిక, ప్రశ్నపత్రం నమూనా ఉంటుంది. ఆయా సబ్జెక్టుల్లో ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు? ఏఏ అంశాలపై సమగ్రంగా పట్టు సాధిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయో గుర్తించాలి. కఠినమైన అంశాలను చదివేటప్పుడు తొలుత వెంటవెంటనే సాధన చేయాలి. తదనంతరం కాస్త సమయాన్ని పెంచుతూ నిర్ణీత వ్యవధిలో సాధన చేయటం ద్వారా మెదడు పనితీరు మెరుగుపడి ఆ విషయాలపై పట్టు పెరుగుతుంది. పెసర ప్రభాకర్‌రెడ్డి, సైన్స్ పాఠ్యపుస్తక రచయిత, గైడెన్స్, కౌన్సెలింగ్ నిపుణుడు

పదోతరగతి విద్యార్థులు ఖమ్మం 16,416 భద్రాద్రి 12,970

## పునరావాసం.. అవస్థలమయం!

ఆసిఫాబాద్ : జలాశయ మిగులు జలాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారనే కారణంతో ఏడేళ్ల కిందట పునరావాసం కల్పిస్తామని అధికారులు హామీనిచ్చారు. ఈ గ్రామాలకు కొద్ది దూరంలో స్థలాలను కొనుగోలు చేసి, సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులను పూర్తి చేశారు. కానీ విద్యుత్తు, తాగునీటి సౌకర్యాలను కల్పించకపోవడం, ఇంటి స్థలాల కేటాయింపు లేకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాగూ తరలించే గ్రామమే కదా అని అధికారులు అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. దశాబ్దాల తరబడి అవస్థలతో సహవాసం చేస్తున్నామని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుమురం భీం జలాశయం నిర్మాణంలో భాగంగా.. 14 గ్రామాలు ముంపునకు గురికాగా, ఇతర చోట్ల పునరావాసం కల్పించారు. కెరమెరి మండలంలోని దేవుడిపల్లి, రాంపూర్, దాబ్‌గూడ, రాంజీగూడకు ఏడేళ్ల కిందట పునరావాసం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఇందులో రాంజీగూడకు ధనోరా సమీపంలో ప్రధాన రహదారి పక్కన 10 ఎకరాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు పూర్తి చేశారు. దేవుడిపల్లి గ్రామాన్ని తరలించడానికి సమీపంలో కొండ వద్ద స్థలాన్ని చదును చేసి సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు. మొత్తం రూ.4.50 కోట్లు ఖర్చు చేసినా.. పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక తరలింపు ప్రక్రియ మూలకు చేరింది. మరోవైపు చేసిన అభివృద్ధి పనులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

**కూలుతున్న కాలువ మట్టితో ఆందోళన**

రాంపూర్ గ్రామానికి చేరువలో ప్రతి వానాకాలంలో వరద నీరు వస్తుంది. ఈ గ్రామాన్ని పునరావాస గ్రామంగా గుర్తించలేదు. రూ.20 కోట్ల వ్యయంతో కుమురం భీం జలాశయం నుంచి ఏడు కిలోమీటర్ల పొడవైన కుడి కాలువను ఆరేళ్ల కిందట పూర్తి చేశారు. కాలువ ప్రారంభంలోనే కూలిపోవడంతో చుక్కనీరు ఆయకట్టుకు అందడం లేదు. దీని ఒడ్డునే మానిక్‌గూడ (ఇదీ పునరావాస గ్రామమే) ఉంది. కాలువ మట్టి క్రమంగా కూలిపోతూ ఏకంగా గ్రామంలోని సీసీ రోడ్డు వరకు వచ్చింది. ఈ నేపథ్యంలో కొందరు ఇళ్లు మరో చోట ఏర్పాటుచేసుకుంటున్నారు. సీసీ కింది నుంచి మట్టి కూలిపోగా, రోడ్డు అవతల నివాస గృహాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వెంటనే మట్టి కూలకుండా చర్యలు చేపట్టాలని, గ్రామాన్ని మరోచోటకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ గ్రామం వద్ద కూలిపోతున్న కుమురం భీం కుడికాలువ మట్టి ఇది. ఓవైపు సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా, మరోవైపు ఇలా ప్రమాదకరంగా మారింది. ఈ స్థలానికి కొద్ది దూరంలో సైతం భారీగా గట్టు కూలిపోవడంతో పశువులు పడి మరణిస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.

**పాత ఇంట్లో ఉండలేం.. మరమ్మతులు చేసుకోలేం**

గ్రామాన్ని తరలిస్తామని ఏడేళ్ల నుంచి చెబుతున్నారు. కొత్త ఇల్లు కట్టుకోలేకపోతున్నాం. శిథిలమవుతున్న పాత ఇంట్లో ఉండలేకపోతున్నాం. అధికారులు త్వరగా నిర్ణయం తీసుకోవాలి. వామన్, దేవుడిపల్లి, కెరమెరి

చురకలు



# చేనుకు చేవ.. రైతుకు తోవ

అనకాపల్లి : వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి సాగునీటి ఎద్దడి నివారణకు సేద్యపు కుంటలు ఎంతో ఉపయోగపడతాయి. వీటితో భూగర్భ జలాల వృద్ధితో పాటు రైతుకు అదనపు ఆదాయం వచ్చేలా కూటమి సర్కారు ఫారం పాండ్ ప్లస్ పేరుతో పంటకుంటలను తవ్విస్తోంది. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నేతలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 2025-26లో 17,900 పైగా సేద్యపు కుంటలు తవ్వాలన్నది లక్ష్యం. దీనికోసం రైతులను సన్నద్ధం చేసేందుకు అధికారులు, సిబ్బంది వీటితో కలిగే ప్రయోజనంపై అవగాహన కల్పిస్తున్నారు.



**ఈసారి ప్రత్యేకం..**

గతం కంటే భిన్నంగా రైతులకు బహుళ ప్రయోజనాలు కలిగేలా సేద్యపు కుంటలను నిర్మిస్తున్నారు. వర్షాల సమయంలో కుంటలోకి నీరు వచ్చే మార్గంలో సిల్ట్‌ట్రాప్ ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఇసుక, మట్టి కుంటలో చేరి పూడిపోయే పరిస్థితి ఉండదు. గట్లపై పండ్లజాతి మొక్కలు, తీగజాతి కూరగాయల మొక్కలు నాటేలా ప్రణాళికలు చేస్తున్నారు. కుంటల్లో చేపలను పెంచడం ద్వారా రైతుకు ఆదాయం సమకూరుతుంది. దీంతోపాటు ఆ నీటిని పంటలకు ఉపయోగించడం ద్వారా సేంద్రియ ఎరువు అందుబాటులోకి రానుంది. ప్రతి పంచాయతీ లోనూ 25 పంటకుంటలను నిర్మించేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు డ్వామా పీడీ పూర్ణిమాదేవి తెలిపారు.

**నిర్మాణం.. ఉపయోగం ఇలా..**

సేద్యపు కుంటకు అవసరమైన స్థలం : 2.5 సెంట్లు
ఎంత నీరు ఇంకుతుంది : 81 వేల లీటర్లు
విస్తీర్ణం బట్టి అందే వేతన మొత్తం : రూ. 36 వేలు
జీడి, మామిడి దిగుబడి : 30 శాతం పెంపు

# ఈ మందులు ప్రాణాలు పోయవు.. తీస్తాయ్

విజయనగరం : అవి ఏ కంపెనీవో తెలియదు.. మంచివా అంటే అదీ లేదు. ప్రజలు ఎలా పోయినా.. నాకు నాలుగు రూపాయలు మిగిలితే చాలు అన్న రకంగా ఔషధ దుకాణాల వ్యాపారులు వారి ప్రాణాలతో ఎలా చెలగాటమాడుతున్నారో 'ఆపరేషన్ గరుడ'లో వెలుగు చూసింది. మన్యం జిల్లాల్లో 2,176 మందుల దుకాణాలు ఉన్నాయి. రెండు చోట్ల 15 దుకాణాలపై దాడులు జరిపారు. వైద్యులు రాసిన చీటీ లేకుండా వ్యాపారులు తమకు తెలిసిన పరిజ్ఞానంతో ఏవేవో మందులు అంటగడుతున్నారని, కొందరు మత్తు కలిగించే ఔషధాలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని తేలింది.

**దగ్గు మందు కొన్నదెవరు?**

విజయనగరంలో రత్నం ఫార్మా స్యూటికల్స్‌లో మద్యం తాగినంత కిక్కు వచ్చే దగ్గు మందు విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ఇటీవల డెహ్రాడూన్ నుంచి 305 సీసాలు తెప్పించి, అమ్మగా దుకాణంలో ఉన్న 45 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన సరకు ఏమైందని అధికారులు ఫార్మాసిస్ట్‌ను ప్రశ్నించగా అధిక సంఖ్యలో ఒకాయన తీసుకెళ్లారని బదులిచ్చారు. ఆ వ్యక్తి తన కోసమా.. ఇతరులకు



విక్రయిస్తున్నారా.. అన్న కోణంలో ఆరా తీస్తున్నారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు మాట్లాడుతూ 'ఏళ్ల క్రితం నాటి కాలం చెల్లిన మందులపై ముద్రించిన బ్యాచ్ నంబరు, తయారీ తేదీ, ముగిసిన గడువు తేదీ తొలగించి విక్రయిస్తున్న స్ట్రిప్‌లు వెయ్యికి పైగా దొరికాయి. వీటికి రికార్డులు లేవు. చిన్న పిల్లలకు వాడే మందులు కాలం చెల్లినవి ఉండటాన్ని గుర్తించాం. వైద్యుడి సిఫార్సు లేకుండా, కాలం చెల్లిన మందులు అమ్మకాలకు సంబంధించి దుకాణ యజమాని, ఆయన భార్యపై రెండు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులు నిర్ణయించారని' చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఒక హెల్త్‌కేర్ కంపెనీ పేరిట ఇతర రాష్ట్రాల్లో తయారైన మందులు విక్రయిస్తున్నట్లు ఔషధ నియంత్రణ విభాగం అధికారులు గతేడాది గుర్తించి కేసు నమోదు చేశారని ఔషధ నియంత్రణ విభాగం సహాయ సంచాలకురాలు రజిత చెప్పారు.

**పశువుల మందులూ..?**

ఒడిశా నుంచి పశువులకు వినియోగించే కొన్ని రకాల మందులను సరిహద్దులోని పార్వతీపురం మన్యం జిల్లాలో విక్రయిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. మత్తు మందు తరహాలో వాడేందుకు కొన్ని రకాల మాత్రలు, సిరప్‌లను అంటగడుతున్నట్లు తేలింది. కొన్ని ప్రముఖ కంపెనీల పేరిట, ఇతర కంపెనీల్లో తయారైన నకిలీ సరకు అమ్ముతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది.

**అక్రమార్కులపై కఠిన చర్యలు**

వైద్యుడి సిఫార్సు లేకుండా మందులు విక్రయించి సంపాదించాలనుకునే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. శాంపిల్ డ్రగ్స్ అమ్మినా నేరమే. గతంలో తనిఖీలు చేసినప్పుడు కొందరు దుకాణ యజమానులు కాలం చెల్లిన మాత్రలు వెనక్కి పంపించడానికి సిద్ధం చేశామని చెప్పారు. ఆ తర్వాత వాటిపై తయారీ తేదీ, బ్యాచ్ నంబరు, కాలం చెల్లిన తేదీ తీసివేసి అమ్ముతున్నారు. చాలా దుకాణాల్లో అమ్మకాలు, నిల్వలకు సంబంధించి లెక్కల్లో తేడా కనిపిస్తోంది. వారందరిపై చర్యలు తీసుకుంటాం. రజిత, ఔషధ నియంత్రణ విభాగం సహాయ సంచాలకురాలు

# చెత్తకొండలు.. కరిగించేందుకు చర్యలు



నంద్యాల : 125 ఏళ్ల చరిత్ర కలిగిన నంద్యాల పురపాలక సంఘంలోని డంపింగ్‌యార్డులో లక్ష టన్నుల చెత్త పేరుకుపోయింది. 17 ఎకరాల్లో గుట్టల్లా పోగైన ఘన వ్యర్థాల తొలగింపు అధికారులకు సవాల్‌గా మారింది. తరచూ ఈ చెత్తకు నిప్పంటుకుని సమీప కాలనీలను పొగ కమ్మేస్తోంది. దీనివల్ల పట్టణంలో వాయు కాలుష్యం పెరిగిపోయింది. ఈ పరిస్థితుల్లో చెత్త గుట్టల తొలగింపునకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

**ఫలించని గత ప్రయత్నాలు**

నంద్యాల డంపింగ్‌యార్డులో ఉన్న చెత్తను తొలగించడానికి 2010 ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ అధికారులు ఒక ప్రణాళికను రూపొందించారు. చెత్తను కాల్చివేయకుండా, ఇతర ప్రాంతాలకు తరలించకుండా భూమిలో పాతిపెట్టి ఎరువులు తయారు చేసి రైతులకు సరఫరా చేయాలని ప్రతిపాదించారు. 'సైంటిఫిక్ ల్యాండ్ ఫిల్లింగ్' పేరుతో చేసిన ఈ ప్రయోగం ఫలించలేదు. చెత్తను భూమిలో పాతిపెట్టిన కొన్నాళ్లకే కుందూనదికి వరద రావడంతో అంతా కొట్టుకుపోయింది. ఈ ప్రయోగం మున్సిపాల్టీకి ఆర్థిక భారాన్నే మిగిల్చింది.

ఏడేళ్ల కిందట డంపింగ్‌యార్డులోని చెత్తను రిక్లేమేషన్ (బయో మైనింగ్) చేసి ఆరెకరాల భూమిని ఖాళీ చేయాలన్న ప్రయత్నాలు జరిగాయి. శుద్ధి చేసిన వ్యర్థాలను అక్కడే వదిలేశారు.

గత ప్రభుత్వం గొప్పలు

గత వైకాపా ప్రభుత్వంలో మూడేళ్ల కిందట అధికారులు డంపింగ్‌యార్డులోని చెత్తను తొలగించేందుకు రూ. 5.25 కోట్లతో సాగర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పట్లో 65 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించి 14 ఎకరాల స్థలం ఖాళీ చేస్తామన్నారు. 30 శాతం తొలగించినట్లు అధికారులు ప్రకటించారు. వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. గుత్తేదారు సంస్థకు నిధులు ఇవ్వకపోవడంతో పాటు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చెత్త తొలగింపు జరగలేదు.

**6 నెలలు.. లక్ష టన్నులు**

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతినెలా మూడో శనివారం ఒక మున్సిపాల్టీలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ 19న నంద్యాల పురపాలక సంఘంలో పర్యటించనున్నారు. డంపింగ్‌యార్డును సందర్శించి చెత్త శుద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఏప్రిల్ 19న ఈ ప్రక్రియ ప్రారంభమై అక్టోబరు 2వ తేదీకి పూర్తి చేయనున్నారు. ఆరు నెలల్లో లక్ష టన్నుల చెత్తను తొలగించనున్నారు.

**నాలుగు భాగాలుగా విభజన**

తాజాగా కూటమి ప్రభుత్వం నంద్యాల డంపింగ్‌యార్డులోని చెత్త శుద్ధిపై దృష్టిపెట్టింది. నాలుగు పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ట్రామెల్ యంత్రాన్ని వినియోగించనున్నారు. యార్డులోని చెత్తను ఈ యంత్రంలో వేస్తారు. అది ప్లాస్టిక్, ఇనుము, గాజు వస్తువులు, రాళ్లురప్పలను విభజిస్తుంది. నాలుగు రకాల వ్యర్థాలను నాలుగు వైపులకు వేర్వేరుగా పంపిస్తుంది.

రాళ్లు రప్పలను మున్సిపాల్టీ పరిధిలో గుంతలను పూడ్చేందుకు ఉపయోగిస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంటు పరిశ్రమలకు పంపిస్తారు. గాజు, ఇతర వస్తువులను గుట్టలుగా పేరుస్తారు. వీటిని ఎందుకు ఉపయోగిస్తారన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. చెత్తను ఎరువుగా మార్చి రైతులకు అందజేయనున్నారు. ఈ శుద్ధి ప్రక్రియను చేపట్టేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఇప్పటికే టెండర్లు పిలిచింది.

# బరువు తగ్గిన పుస్తకం



కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. 'కూటమి' ప్రభుత్వం చక్కదిద్దే పనిలోపడింది. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పుస్తకాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలకు విడతల వారీగా పంపిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు మొదటి విడతలో 3,44,932 పుస్తకాలొచ్చాయి. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాలకు సంబంధించినవి ఉన్నాయి. కర్నూలు నగరంలోని పుస్తక నిల్వ కేంద్రానికి చేరుకున్న పుస్తకాలను ఏప్రిల్ మొదటి వారంలోపు ప్రభుత్వ పాఠశాలలకు చేరవేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. నిల్వ కేంద్రంలో చెదలు పట్టకుండా రసాయనాలు చల్లించామని, ఆర్టీసీ బస్సుల ద్వారా పాఠశాలలకు చేరవేస్తామని గోదాము మేనేజర్ భారతి తెలిపారు.

**'బన్ని' ఉత్సవానికి చోటు**

పదో తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో కర్నూలు జిల్లాకు చోటు దక్కింది. హొళగుంద మండలంలో ఏటా నిర్వహించే దేవరగట్టు బన్ని ఉత్సవ ప్రత్యేకతను పుస్తకంలోని 26వ పేజీలో వివరించారు. దసరా సందర్భంగా ఎందుకు నిర్వహిస్తారన్న అంశాన్ని అందులో విశ్లేషించారు. ఆదోనిలో ప్రసిద్ధి గాంచిన గొరవయ్యల నృత్యాన్ని పాఠ్యాంశంగా చేర్చారు.

**ఈసారి ఇలా**

పిల్లలకు పుస్తక భారం లేకుండా వివిధ సబ్జెక్టులను ఒకేదాంట్లో కలిపి ముద్రించారు. గతంలో మూడు సెమ్‌లుగా ముద్రించేవారు.. ప్రస్తుతం రెండు సెమ్‌లకే పరిమితం చేశారు.

1-5 తరగతులకు సంబంధించి తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు..వర్క్‌బుక్ అదనంగా చేర్చారు.

6-9 తరగతులకు సంబంధించి తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. ఎన్ఎస్, పీఎస్ కలిపి ఒకటి చేశారు. సాంఘిక శాస్త్రం మూడు పుస్తకాలు ఉండగా ఇప్పుడు ఒకటిగా చేశారు. 'పది'లో హిందీ పాఠ్య పుస్తకం మారినట్లు సమాచారం.

కావాల్సిన పుస్తకాలు: 50 లక్షలు
మొదటి విడతలో కేటాయింపు: 8,04,366
జిల్లాకు చేరినవి: 3,44,932

# బొబ్బిలికి వెక్కిళ్లు



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతోంది. ఓ పక్క భోజరాజపురం పంపుహౌస్ పథకం శిథిలావస్థకు చేరింది. మరోపక్క వేగావతి నదిలోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో ఊరే నీటి శాతం తగ్గిపోయింది. ఫలితంగా ప్రజలకు అవసరం మేర తాగునీరు అందించలేని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం రెండు రోజులకోమారు కుళాయిల నుంచి అందిస్తున్నారు.

వేగావతి నది నుంచి పట్టణంలోని రిజర్వాయర్లకు తాగునీరు అందించే భోజరాజపురం ప్రధాన పైపులైను పూర్తిగా పాడైంది. ఎనిమిది చోట్ల లీకులు ఉండడంతో పంపింగ్ అవుతున్న నీటిలో 10 శాతం వృథాగా పోతోంది. రెండు రోజుల కిందట పాలకవర్గ సభ్యులు పథకాన్ని పరిశీలించి, లోపాలు తెలుసుకున్నారు. వేసవిలోనైనా సరిచేస్తారా, లేదా అలా నెట్టుకొస్తారా? చూడాల్సిందే.

**ఈ ప్రాంతాల్లో ఇక్కట్లు**

పట్టణంలోని ఐటీఐ, ఇందిరమ్మ, బోస్ నగర్, మిలట్రీ కాలనీలు, అప్పయ్యపేట, రాజమహల్, ఎరుకుల పాకలు, ప్రసాద్‌నగర్, చేనేత కాలనీ, పాత బొబ్బిలి, మల్లంపేటలో కుళాయి నీరు పూర్తిస్థాయిలో రావడం లేదు. ప్రస్తుతం పట్టణ అవసరంలో 40 శాతమే సరఫరా అవుతోంది. ఒక్కో వీధికి 20 నుంచి 30 నిమిషాలే వదలడంతో అవస్థలు పడుతున్నారు. బోరింగులు, నేలబావులు కూడా సరిపడా లేవు.

**ఇవీ లోపాలు**

నదిలో ఊట బావుల వద్ద ఇసుక తవ్వకాలు కట్టడి చేయాలి. బావుల్లో మేటలు తొలగించాలి.

ప్రధాన పైపులు, సబ్‌లైన్లలో లీకులు అరికట్టాలి.

భోజరాజపురం హెడ్ వాటర్ వర్క్సు వద్ద నదిలో నాలుగు బావుల్లో ఒకటి పనిచేయడం లేదు. దీన్ని సరి చేయాలి.

గతంలో తవ్విన ఆరు బోర్లలో రెండు పనిచేయడం లేదు. వాటికి మరమ్మతులు చేసి, అదనంగా బోర్లు తీయాలి.

**వృథాను అరికడుతున్నాం**

పైపులైన్ల లీకులను సరిచేసి నీటి వృథాను అరికడుతున్నాం. ఇప్పటికే కొన్ని మరమ్మతులు చేశాం. వేగావతిలో ఇసుక గట్లు వేసి నీటిని సంపుల్లోకి మళ్లించే పనులు ప్రారంభిస్తాం. అవసరమైతే పెద్దగెడ్డ నుంచి వేగావతిలోకి నీటిని విడిచి పెట్టడానికి జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడతాం. ఈశ్వర గుప్తా, ఏఈ, బొబ్బిలి పురపాలక

# అనుసంధానం.. ఇంకెంత దూరం?

జియ్యమ్మవలస: కొండల నడుమ సహజసిద్ధంగా వచ్చే జీవజలాలు ఉపయోగించుకోవడంలో గత ప్రభుత్వం, పాలకులు అలసత్వం ప్రదర్శించారు. జియ్యమ్మవలస మండలంలోని అలమండ పంచాయతీ నిడగల్లుగూడ గిరిజన గ్రామానికి సమీపంలో చిట్టిగెడ్డపై పదిహేనేళ్ల క్రితం సుమారు రూ. 30 లక్షలతో నిర్మించిన చెక్‌డ్యామ్‌తో వట్టిగెడ్డలో చిట్టిగెడ్డ అనుసంధాన ప్రక్రియ చేపట్టారు. అప్పట్లో నిధులు ఉన్నంత వరకు పనులు చేసి మిగిలినవి వదిలేశారు. చిట్టిగెడ్డ నుంచి వట్టిగెడ్డ జలాశయం వరకూ తవ్విన కాలువల్లో అక్కడక్కడ బండరాళ్లు ఉండటంతో అప్పట్లో సగం పనులు మాత్రమే చేశారు. చిట్టిగెడ్డ కింద ఉన్న సుమారు 300 ఎకరాల కోసం స్థానికులు చిన్న కాలువలు తవ్వుకోవడంతో వట్టిగెడ్డకు నీరు చేరకుండా వృథాగా పోతోంది.

**17 వేల ఎకరాలకు జీవం**

వేసవిలో నీరు లేక వట్టిగెడ్డ పూర్తిగా ఎండిపోతోంది. ఏటా ఖరీఫ్‌లో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఎగువనున్న మండలాల్లో కురిసిన వానలకు జలాశయం నిండితే 17



వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జలాశయంలో సరిపడా నీరు లేక నేటికీ చివరి భూములకు చేరడం లేదు. చిట్టిగెడ్డకు ఎగువ నుంచి నిత్యం నీరు ప్రవహిస్తుంటుంది. దీన్ని వట్టిగెడ్డతో అనుసంధానిస్తే ఎగువన గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో వర్షాలు కురవకపోయినా అది నిండుతుంది. నిత్యం రెండు పంటల సాగుకు నీటిని అందించవచ్చని రైతులు అంటున్నారు. అనుసంధాన ప్రక్రియ సకాలంలో పూర్తి కానందున ఏటా వేసవిలో వట్టిగెడ్డ కింది ఆయకట్టు ఎండిపోతోంది. గతంలో ఈ విషయమై పలుమార్లు రైతులు, వామపక్షాలు ధర్నాలు, పాదయాత్రలు నిర్వహించినా ఏళ్లుగా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. నిధులు మంజూరు చేసి మిగిలిన పనులు చేపట్టి చిట్టిగెడ్డ -వట్టిగెడ్డ అనుసంధానం పూర్తి చేయాలని మండల రైతులు కోరుతున్నారు. **పూర్తిచేస్తే మేలు..:** చిట్టిగెడ్డ నీటిని వట్టిగెడ్డలోకి పంపిస్తే నిత్యం నీరు ఉంటుంది. అనుసంధానం చేపట్టడానికి చర్యలు చేపడితే రైతులకు మేలు జరుగుతుంది.

కొల్లి గంగునాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి, పార్వతీపురం మన్యం

ప్రతిపాదనలు లేవు..: గతంలో కొంత వరకు పనులు చేశాం. ప్రస్తుతం నిధులు లేవు. వట్టిగెడ్డ- చిట్టిగెడ్డ అనుసంధాన ప్రక్రియ పూర్తిస్థాయిలో చేపట్టేందుకు ప్రతిపాదనలు కోరితే పంపిస్తాం.

జీవీ రఘు, వట్టిగెడ్డ జలాశయం ఏఈ, జియ్యమ్మవలస

# మొక్కవోని కక్ష

విజయనగరం : వేసవొస్తే విజయనగరంలో ఉండలేమని ఉత్తరాంధ్ర వాసులు చెబుతుంటారు. పచ్చదనం లేకపోవడం, కాలుష్య తీవ్రత పెరగడం, గతంలో వేసిన మొక్కలు కానరాకపోవడం, నీటి వనరులు తగ్గిపోవడం తదితర కారణాలతో ఈ దుస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం రెండు వారాలుగా ఎండలు భగ్గుమంటున్నాయి. జిల్లా కేంద్రంలో అడుగెట్టలేని పరిస్థితి ఉంది. సేదదీరేందుకు సైతం చాలాచోట్ల చెట్లు కరవయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నివారణ చర్యలు శూన్యం. ఈ నేపథ్యంలో అధికారులు దృష్టిసారించాల్సిందే.

**పెరిగిన తీవ్రత...**

దేశంలో కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉన్న నగరాల్లో విజయనగరం ఒకటి. ఉమ్మడి జిల్లాకు సంబంధించి వీటీఅగ్రహారం, కస్పా ఉన్నత పాఠశాల, నగరపాలిక కార్యాలయం, బొబ్బిలి గ్రోత్ సెంటర్లలో యంత్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వాయు కాలుష్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. పీసీబీ(పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) ప్రకారం పీఎం- 10(పాలిక్యులేట్ మేటర్) రోజుకు 100 ఎంఎఫ్‌సీఎం(మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్) దాటకూడదు. ఏడాదిలో సరాసరి 60 కంటే తక్కువగా ఉండాలి. ప్రస్తుతం నగరంలో 72 నుంచి 78 వరకు నమోదవుతోంది.



**ఇకనైనా మారాల్సిందే..**

గతేడాది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో దాదాపు 30 వేల మొక్కలు వేస్తామని అధికారులు ప్రకటించారు. ఈమేరకు రూ. 50 లక్షల వరకు ఖర్చు చేస్తామని ప్రకటించారు. కానీ చర్యల్లేవు. ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటికే 10 వేల మొక్కలు నాటాలి. ఇప్పటివరకు 2,500 వేసినట్లు చెబుతున్నారు. నగరపాలిక పరిధిలో కొత్తగా ఏర్పాటైన ఉద్యానశాఖ విభాగానికి వచ్చిన అధికారిణి ఉమాభరణి కాలపరిమితి పూర్తవడంతో తిరిగి ఆమె మాతృశాఖకు వెళ్లిపోయారు. ఈక్రమంలో సెంటర్ డివైడర్లు, విస్తరించిన రోడ్లకు ఇరువైపులా, ఖాళీస్థలాలు, పార్కుల్లో చాలావరకు మొక్కలు కానరావడం లేదు. పరిశీలించి, అవసరం మేరకు నాటుతామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. నిర్వహణకు 44 మంది సిబ్బందిని నియమించామన్నారు.

**స్పందించని వైకాపా..**

2021లోనే కేంద్రం హెచ్చరించింది. దీంతో మయూరికూడలి, గంటస్తంభం, కొత్తపేట, కలెక్టరేట్ కూడలి, బాలాజీ కూడలి, పారిశ్రామిక వాడ(వీటీ అగ్రహారం), వైకూడలిని ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా చోట్ల పెద్దఎత్తున మొక్కలు నాటాల్సి ఉంది. అప్పట్లో జగనన్న హరిత నగరాలు, మెగా ప్లాంటేషన్ తదితర కార్యక్రమాల కింద రూ. కోటి వరకు వెచ్చించి మొక్కలేశామని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం వాటిల్లో ఒక్కటీ కానరావడం లేదు.

# పురం.. లీకేజీల పరం



హిందూపురం : హిందూపురం పట్టణం అంటేనే అనాదిగా నీటి సమస్యకు పర్యాయపదం. దీనికి తోడు ఇక్కడ నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా లేదు. ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ తీసుకొని రూ.194 కోట్లతో గొల్లపల్లి నుంచి ఏర్పాటు చేసిన తాగునీటి పథకమే పట్టణానికి జీవనాడి. ఈ పథకంలో భాగంగా పట్టణ సమీపంలోని కొట్నూరు సంపు వరకు మాత్రమే నీరు సరఫరా అవుతోంది. అక్కడ శుద్ధి చేసి మోతుకపల్లి సంపునకు చేరవేస్తారు. అక్కడి నుంచి పాత పైపులైన్ వ్యవస్థతోనే ప్రజలకు నీటి సరఫరా జరుగుతోంది. గొల్లపల్లి నుంచి సైతం కేవలం 8 మిలియన్ లీటర్లు నీరు మాత్రమే సరఫరా అవుతోంది. ఈ నీరు ప్రజల అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదదు. మరోవైపు పట్టణంలోని పాత పైపులైన్ వ్యవస్థ దెబ్బతింది. రోజుకు 20కి పైగా లీకేజీలు అవుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఓ ఇంజినీర్ బదిలీ.. మరో ఇద్దరు సెలవుల్లో..**

వేసవి తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో పట్టణానికి వచ్చే 8-10 మిలియన్ లీటర్ల నీరు ఒక్క రోజు నిలిచిపోయినా పరిస్థితి దారుణంగా మారనుంది. ఇలాంటి సమయంలో నీటి సరఫరా విభాగంలో అధికారులే లేకుండా పోయారు. పట్టణ నీటి సరఫరాపై అవగాహన ఉన్న ఇంజినీర్ బాలసుబ్రహ్మణ్యంకు కమిషనర్‌తో తలెత్తిన విభేదాల కారణంగా ఇక్కడి నుంచి బదిలీపై టిడ్కోకు పంపారు. ఆయన స్థానంలో ఎవరూ ఇక్కడికి రాకపోవడంతో మహిళా డీఈ వాణికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆమె పని ఒత్తిడి తట్టుకోలేక సెలవుపై వెళ్లారు. ఇదే సమయంలో నీటి సరఫరా విభాగం ఏఈ జనార్దన్ ఆకస్మికంగా సెలవులో వెళ్లిపోయారు. ఇంజినీరింగ్ విభాగంలో డీఈ మోహన్, ఏఈ శంకర్‌లు మాత్రమే మిగిలారు. వారు ఇటీవలే బదిలీపై పట్టణానికి వచ్చారు. దీంతో వారికి పట్టణ నీటి సరఫరాపై అవగాహన లేదు. మరో వైపున అన్నీ పనులు వారే చూడాల్సి రావడంతో విపరీతమైన పని భారంతో అల్లాడిపోతున్నారు.

**సహకరించని సిబ్బంది**

నీటి సరఫరా విభాగం కింది స్థాయి సిబ్బంది, కొత్తగా బాధ్యతలు చూస్తున్న ఇంజినీర్లకు ఏ మాత్రం సహకరించడం లేదు. వీటన్నింటి కారణంగా నీటి సరఫరా విభాగం అస్తవ్యస్తంగా మారింది. పట్టణంపై పూర్తి అవగాహన ఉండి, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే వారిని గుర్తించి, నీటి సరఫరా విభాగం పూర్తి బాధ్యతలు అప్పగిస్తే తప్ప నీటి సరఫరా విభాగంలో మార్పు రాదు.

పది రోజుల్లో పరిష్కరిస్తాం ..శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్

మున్సిపల్ నీటి సరఫరా విభాగం అస్తవ్యస్తంగా ఉన్న మాట వాస్తవమే. నీటి సరఫరాలోనూ ఇబ్బందులు ఉన్నాయి. పైపులైన్ లీకేజీలు అధికంగా వస్తున్నాయి. వీటన్నింటినీ సరిదిద్దడానికి చర్యలు చేపట్టాం. పది రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

## టిడ్కో లబ్ధిదారులకు తీపి కబురు

పుట్టపర్తి : పట్టణాల్లో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల హామీ అమలు దిశగా కీలకమైన ముందడుగు వేసింది. పేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే సంకల్పంతో 2014-19 మధ్య కాలయంలో నాటి తెదేపా ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి ధర్మవరం, కదిరి, హిందూపురం మున్సిపాలిటీల్లో నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో టిడ్కో సౌజన్యంతో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. త్వరలో సొంతిల్లు సాకారం అవుతుందని, ఆశతో లబ్ధిదారులు అప్పులు చేసి కంతులు చెల్లించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. ఐదేళ్ల పాలనలో ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. ఎక్కడికక్కడ పనులు నిలిచిపోవడంతో పేదల సొంతింటి కల సాకారం కాలేదు. చెల్లించిన డిపాజిట్‌కు ఆరేడేళ్లుగా వడ్డీలు చెల్లిస్తూ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ హామీ మేరకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో భవనాలను పూర్తి చేసి, జూన్ నాటికి నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు వచ్చే జూన్ నాటికి జిల్లాలోని 4,176 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అనుకున్న తేదీ నాటికి గృహాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

**త్వరలో పూర్తి చేసేలా చర్యలు చేపడతాం..**

షబానా, టీడ్కో డీఈ జిల్లాలో అర్ధాంతరంగా ఆగిపోయిన టిడ్కో సామూహిక భవనాలు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో 4,176 మందికి జూన్ నాటికి సొంతింటి తాళాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా చర్యలు చేపట్టింది.

## సహజ పద్ధతుల్లో సాగే ఉత్తమం

హిందూపురం : దీర్ఘకాలిక రోగాలు దూరం కావాలంటే సహజ పద్ధతుల్లో పండించే పంటలే శరణ్యమని విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి రైతు నీటిని పొదుపుగా వాడుకోవడంలో ప్రకృతి వ్యవసాయ పరిశోధకుడు సుభాష్ పాలేకర్ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేసినపుడు నిబంధనలకు విరుద్ధంగా బోర్ల తవ్వకాన్ని అడ్డుకున్నట్లు గుర్తుచేశారు. శనివారం పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉద్యానవనం, వ్యవసాయ శాఖ, ఆర్డీటీ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మన వ్యవసాయం, పంటలు, వంటకాలు, ఆరోగ్యంపై సదస్సు, చిరుధాన్యాల మేళాను ప్రారంభించారు. ఇజ్రాయెల్ లాంటి దేశాల్లో తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధిస్తున్న విషయాన్ని



జనార్దన్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రకృతి వ్యవసాయ స్వతంత్ర ప్రచారకర్త విజయరావ్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో ప్రతి రైతు ఎకరాకు రూ.3 నుంచి 6 లక్షల వరకు లాభాలు పొందవచ్చన్నారు. పురుగు మందులు, రసాయన ఎరువులు లేకుండా చెన్నంగి, కొలతేర్ రకాల వరి వంగడాలను పండించాలన్నారు. ఎ.ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి అనుకూల వంటలు తినాలంటే పంటల సాగులో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. సహాయ కలెక్టర్ వినూత్న, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఎన్‌ఐఆర్డీ డైరెక్టర్ డబ్ల్యూఆర్ రెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి గోపాల్‌రెడ్డి, ఏపీఎంఏఎస్ సీఈఓ సీఎస్ రెడ్డి, 18 ఎన్‌జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు ఆకట్టుకున్న స్టాళ్లు: చిరుధాన్యాల మేళాలో భాగంగా వివిధ రకాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కట్టె గానుగ నూనెలు, చిరుధాన్యాలతో తయారు చేసిన తినుబండారాలు, వివిధ ప్రాంతాల్లో ప్రాముఖ్యం ఉన్న విత్తనాల ప్రదర్శన, కూరగాయలు, పండ్లు, తదితర రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

## ఎండిన ఆకులు.. చెదిరిన రూపురేఖలు..!

ఆరిలోవ : ఘన చరిత్ర గల ముడసర్లోవ ఉద్యానవనంలో ఇటీవల అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం స్థానికులను కలవరపరిచింది. అటు పచ్చని సింహగిరులు..ఇటు గలగలపారే సెలయేరు.. ప్రకృతి రమణీయత ఉట్టిపడే ప్రాంతంలో ఈ ఉద్యానవనాన్ని 1902లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. నాటి నుంచి దశాబ్దాలపాటు విశాఖ నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచింది. 1980 దశకంలో పదుల సంఖ్యలో సినిమాలను ఇక్కడ చిత్రీకరించారు. అలాంటి ఉద్యానవనాన్ని గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది.వైకాపా ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ పాలకులు ప్రపంచ స్థాయి ఉద్యానవనంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వాస్తవంలో ఒక్క పైసా ఖర్చు చేయలేదు. కొత్తగా ఒక్క మొక్క కూడా నాటించలేదు. ఉన్న మొక్కలకు నీరు పోసి సంరక్షించలేదు. గడ్డి ఎండిపోతున్నా, పిల్లల ఆట పరికరాలు విరిగిపోయినా పట్టించుకోలేదు. రాలిన ఆకులను ఏరోజుకారోజు డంపింగ్‌యార్డుకు తరలించే ఏర్పాట్లు చేయలేదు. ఫలితంగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అక్రమాలకు అడ్డాగా మారి: ఉద్యానవనం నిర్వహణను వాస్తవంగా జీవీఎంసీ ఉద్యాన విభాగం చూడాలి. కాని నాటి పాలకులు నీటిసరఫరా విభాగానికి అప్పగించారు. సందర్శకుల నుంచి రుసుములు వసూలు చేయడానికి టెండరు పిలిచి గుత్తేదారుకి అప్పగించారు. ఎన్నడూలేని విధంగా నాడు ఉద్యానవనంలో టెంట్లు వేసి పార్టీలు నిర్వహించే సంస్కృతిని తెచ్చారు. కార్తికమాసంలో గుత్తేదారు ఒక్కో టెంటుకు సుమారు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అనధికారికంగా వసూలు చేశాడు. టెంట్లు, కుర్చీలు, టేబుళ్లను కూడా ఆయనే సరఫరా చేశాడు. వసూలు చేసిన మొత్తంలో భారీగానే నాటి వైకాపా పాలకులు, అధికారులకు అందేవని ఆరోపణలు వచ్చాయి. ఐదేళ్లు కేవలం జేబులు నింపేసుకోవడంపై దృష్టిపెట్టిన గుత్తేదారు ఉద్యానవనం నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న దృష్ట్యా ముడసర్లోవ ఉద్యానవనాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అందులో సగం వెచ్చించినా మెరుగయ్యేది..**జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం మేరకు రెండేళ్ల క్రితం ముడసర్లోవ ఉద్యానవనం పక్కన పెద్ద వృక్షాలున్న ప్రాంతంలో హార్స్ రైడింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. దీనికి సుమారు రూ.3కోట్లు వెచ్చించారు. రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో నిర్మిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో మధ్యలో ఆపేశారు. అంటే రూ.1.5కోట్లు ఖర్చు పెట్టినా ముడసర్లోవ ఉద్యానవనానికి వచ్చేదని స్థానికులు చెబుతున్నారు.

# కాగితాల్లోనే ట్రామా కేర్



గుత్తి : రవాణాపరంగా గుత్తి ప్రాంతం ఎంతో కీలకమైంది. ఈ ప్రాంతం మీదుగా పలు జాతీయ, రాష్ట్ర రహదారులు ఉండటంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు రైల్వే జంక్షన్ ఉంది. ఈ నేపథ్యంలో ట్రామా కేర్ కేంద్రం ఎంతో అవసరం. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. స్థానికంగా రైల్వేజంక్షన్‌తోపాటు డీజిల్‌షెడ్డు, బాక్స్‌ఎన్‌డిపో, టీఎక్స్‌ఆర్, ఇంజినీరింగ్ విభాగాలు ఉన్నాయి. సుమారు 3వేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. హైదరాబాదు-బెంగళూరు, గుత్తి-నెల్లూరు, గుత్తి-అంకోలా జాతీయ రహదారులు... రాష్ట్ర రహదారి గుత్తి-ఆదోని రోడ్డు ఉంది. నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ప్రతిరోజు సుమారు లక్ష వాహనాలు వెళుతుంటాయి. ఈ క్రమంలో రెండు రోజులకోసారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా కొత్తపేట ప్లైఓవర్, బాటసుంకులమ్మ ఆలయ సమీపాన, ఊబిచర్ల మలుపుల వద్ద ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాద బాధితులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తెస్తుంటారు. గుత్తి, యాడికి, పెద్దవడుగూరు మండలాలతోపాటు నంద్యాల జిల్లా ప్యాపిలి, పోతుదొడ్డి, కర్నూలు జిల్లాలోని జి.ఎర్రగుడి, జొన్నగిరి, బాటతండా, పగిడిరాయి, పెరవలి, లక్ష్మితండా తదితర ప్రాంతాల నుంచి బాధితులు వస్తుంటారు.

**ప్రాథమిక చికిత్సతో సరి...**కాళ్లుచేతులు విరిగి గాయపడిన వారికి ఇక్కడి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి.. కర్నూలు, అనంతపురంలోని ఆసుపత్రులకు పంపుతున్నారు. గుత్తి ఆసుపత్రిలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటైతే సుమారు 30 పడకలు వస్తాయి. ప్రస్తుతం 52 పడకలు ఉన్నాయి. మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం ఎల్లప్ప, వైద్యాధికారి, గుత్తిట్రామా కేర్ కేంద్రం ఏర్పాటుకు గతంలో ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం.

# కథలో అదే కీలక 'మలుపు'



విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వంలో భీమిలి-భోగాపురం ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి ప్రతిపాదన తీరు అత్యంత వివాదాస్పదమైంది. ఆ రోడ్డుకు ఆనుకొని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు అప్పటి అధికార పార్టీ నేతలు కొందరు భారీగా ఆస్తులు కొనుగోలు చేశారు. కేవలం వారి స్థలాలకు విలువ పెరిగేలా దాని ఎలైన్‌మెంట్ రూపకల్పన చేశారనేది ప్రధాన ఆరోపణ. ప్రస్తుతం ఆ ప్రక్రియ ఆగినా.. తాజాగా భీమిలి మండలంలో కొత్తగా ప్రతిపాదించిన నేరెళ్లవలస-తాళ్లవలస రహదారి చర్చనీయాంశమవుతోంది. ఈ ప్రతిపాదిత మార్గం కేవలం వైకాపా నేతలకు మేలు చేసేలా ఉందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అనుసంధాన రహదారుల ముసుగులో కొందరికి ప్రత్యేక లబ్ధి కలిగించేయత్నాలు సాగుతున్నట్లు పలువురు నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు కి.మీ. పరిధిలో..**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేసరికి రద్దీ నియంత్రణకు విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కొన్ని రహదారులను ప్రతిపాదించింది. అందులో భీమిలి మండలంలో అధికంగా ఉన్నాయి. నేరెళ్లవలస - తాళ్లవలస మధ్య 4 కిలోమీటర్లలో 24 మీటర్ల వెడల్పుతో రహదారికి ప్రతిపాదించారు. ఇది కొత్తవలస, దొరతోట మీదుగా జాతీయ రహదారికి చేరుంది.

విశాఖ నుంచి భీమిలిలోకి వెళ్లే ముందు ప్రతిపాదిత నేరెళ్లవలస-తాళ్లవలస రోడ్డు మలుపు తిరుగుతుంది. అక్కడ కొత్తవలస కొండను ఆనుకొని వెళ్లేలా మార్గాన్ని నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏకు ఈ ప్రాంతంలో భూములు ఉన్నాయి. అయితే రోడ్డు భీమిలిలో మలుపుతిరిగే చోట.. గతంలో వైకాపా నేతలు భారీగా ఆస్తులు కొనుగోలు చేశారు. ఆ మార్గానికి సమీపంలో దాదాపు వారికి చెందిన స్థలాలే ఉన్నాయి. కొత్తవలస కొండ దిగువన కూడా చాలా స్థలాలు గతంలో పెద్దల చేతుల్లోకి వెళ్లాయి. వీరికి అనుకూలంగా నిర్ణయాలున్నాయనే ఆరోపణలొస్తున్నాయి.

ప్రత్యామ్నాయంగా: ప్రతిపాదిత మార్గానికి ప్రత్యామ్నాయంగా భీమిలిలోనుంచి వెళ్లే రోడ్డును విస్తరిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పలువురు చెబుతున్నారు. బీచ్ రోడ్డు మీదుగా కాకుండా లక్ష్మీనరసింహస్వామి ఆలయం మీదుగా ప్రస్తుతమున్న రోడ్డును విస్తరించి భీమిలి పోలీసు స్టేషన్ దాటి తగరపువలస వద్ద జాతీయ రహదారికి అనుసంధానం చేస్తే బాగుంటుందనే సూచనలొస్తున్నాయి. ప్రస్తుతం భీమిలి-తగరపువలస రోడ్డు రద్దీగా మారింది. దీన్ని విస్తరించాల్సిన అవసరం కూడా ఉంది.

## జలం నిలవాలి జనం మురవాలి

కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలభగ్నం చేసింది.. నిర్వహణకు పైసా ఇవ్వలేదు.. కేసీ చెదిరింది.. ఎస్సార్బీసీ ఏడిపిస్తోంది.. అలగనూరు కుప్పకూలింది.. గోరుకల్లు లీకేజీ అవుతోంది.. అవుకు అధోగతి పాలైంది.. పెండింగ్ ప్రాజెక్టుల దస్త్రాన్ని అటకెక్కించారు.. తుంగభద్ర, హంద్రీ, కృష్ణమ్మ నదులు పారుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి.. ప్ర'జల'కు ప్రాధాన్యం ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జలాశయాల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరుల బాగుకు రూ.1,568 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు.

**వీటికి మోక్షం కలిగేనా**

పశ్చిమ ప్రాంతంలో ఆర్డీఎస్, వేదవతి జలాశయాల నిర్మాణానికి గతంలో తెదేపా పునాది వేసింది. 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు రూ.90 కోట్లు ఖర్చు చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.

కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు నీరందించేలా రూ.1,985 కోట్ల వ్యయంతో ఆర్డీఎస్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ.12.60 కోట్ల వరకు వెచ్చించారు. అందుబాటులోకొస్తే 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సుంకేసుల (రూ.27 కోట్లు)

కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల పరిధిలో 2.65 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సుంకేసుల జలాశయానికి రూ.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాల్వ అధ్వానంగా మారడంతో 1,500 క్యూసెక్కులు ప్రవహించని పరిస్థితి నెలకొంది.సుంకేసుల, అలగనూరు, ముచ్చుమర్రి జలాశయాలకు కలిపి తొలుత రూ.107 కోట్లకు ప్రతిపాదించారు.. ఆ తర్వాత రూ.27 కోట్లకు కుదించారు.

ఎస్సార్బీసీ (రూ.89 కోట్లు)

శ్రీశైలం కుడిగట్టు కాల్వకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుంటారు. జలాశయం పనులు పూర్తికాకపోవడంతో 12 టీఎంసీలు నిల్వ చేయని పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో కట్ట కుంగింది. ఈ నేపథ్యంలో రూ.89 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.

అవుకు (రూ.40కోట్లు)

గత ఐదేళ్లుగా అవుకు జలాశయం నిర్వహణ పనులు చేపట్టలేదు. గేట్ల వద్ద నీటి లీకేజీ కొనసాగుతోంది. గత ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.. రెండో విడత పనులకు సంబంధించి రూ.24 కోట్లు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంది.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అవుకు సొరంగం, జలాశయం నిర్వహణకు రూ.40 కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

హంద్రీనీవా (రూ.700కోట్లు)

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వను విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మల్యాల నుంచి జీడిపల్లి (0-216 కి.మీ.) వరకు కాల్వ వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.700 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదించారు.

ప్రస్తుతం కాల్వలో 1,900 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విస్తరించి 3,850 క్యూసెక్కులు తరలించనున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గురు రాఘవేంద్ర (రూ.57కోట్లు)తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు స్థిరీకరించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా కనీసం విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు.. నిర్వహణలేక మోటార్లు సతాయిస్తున్నాయి. వీటిని బాగు చేసేందుకు రూ.57 కోట్లు అవసరమవుతాయి.

శ్రీశైలం (రూ.18కోట్లు)కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.18 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులతో కొంతవరకు పనులు చేసేందుకు అవకాశముంటుంది, డ్రిప్ ద్వారా నిధులు విడుదలైతే తప్ప పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు అవకాశముండదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ రూ: 313 కోట్లు

కేసీ, రాజోలి, జొలదరాశి (235)


గాజులదిన్నె (35)

చెరువుల నిర్వహణ (46)

సిద్ధాపురం ఎత్తిపోతల (8)

## ఉపాధి మేడలు

కర్నూలు : ఐదేళ్ల వైకాపా కాలంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. 'కొత్త ఇసుక విధానం' పేరిట రీచ్‌లను మూసేశారు. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. భవనాలు, ఇళ్ల పనులన్నీ ఆగిపోవడంతో కార్మికులకు నెలల తరబడి ఉపాధి కరవైంది. ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అర్ధాకలితో అలమటించేలా చేసింది. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్మికులకు చేతినిండా పని దొరుకుతోంది. పనుల స్థాయిని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తోంది. ఏడాదిలో అక్టోబరు నుంచి మే వరకు నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉంటుంది. 'కూటమి' ప్రభుత్వం పల్లె పండగ పేరుతో సిమెంటు దారులు నిర్మిస్తోంది.



ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,000, రూ.1,500, రూ.2 వేలకు అందుబాటులో ఉంది. కారుచౌకగా ఇసుక లభిస్తుండటంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు." నగరంలో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపన చేశాం.. రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు" బ్యాంకు ఉద్యోగి నవీన్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే గత నెలలో వంద ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

**దండిగా ఇసుక నిల్వలు** గతంలో టన్ను రూ.326 ఉండగా.. దాన్ని కూటమి ప్రభుత్వం రూ.320కు తగ్గించింది. ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను రూ.202, మరలి ఇసుక రీచ్‌లో రూ.119, గుడికంబాలి రూ.39, నదిచాగిలో రూ.40 నామమాత్రపు ధరకు ఇసుక లభిస్తోంది.ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 1,45,350

## సొంతానికి సేవా రుసుములు

నెల్లూరు : సచివాలయాల్లో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సేవల రూపంలో ప్రజలు చెల్లిస్తున్న నగదును 24 గంటల్లో ఖాతాకు జమ చేయాల్సి ఉండగా.. కొందరు సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా తీరు మారలేదు. ఉద్యోగుల జీతం నుంచి రికవరీ చేసేందుకు నగరపాలకసంస్థ అధికారులు చర్యలు చేపట్టారు.
నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలో 54 డివిజన్లు ఉండగా.. 166 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో సుమారు 1200 మంది వరకు ఉద్యోగులు పని చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో 2020 జనవరి 26వ తేదీ నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 543 సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించినా.. 15 లోపు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ, సంక్షేమానికి సంబంధించినవే అధికం. ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా సేవలు పొందేందుకు చెల్లిస్తున్న నిర్దేశిత



రుసుంను సచివాలయ ఉద్యోగులు దారి మళ్లించారు. ప్రజల నుంచి నగదు రూపంలో వసూలు చేస్తున్నా.. కొందరు ఆ సొమ్ము సకాలంలో జీఎస్‌డబ్ల్యూఎస్ ఖాతాకు జమ చేయడం లేదు. అధికారుల పరిశీలనలో వెలుగు చూడగా.. కమిషనర్ సూర్యతేజ సమీక్షలు, టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదేశించినా.. ఉద్యోగులు పెడచెవిన పెట్టారు.

**డబ్బు జమ చేయకుండా..**
ప్రజలు చెల్లించిన నిర్దేశిత రుసుము జమచేయని సచివాలయ ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేయాలని అధికారులు నిర్ణయించారు. నగరంలోని 44 సచివాలయాల పరిధిలో రూ.5,74,686 రుసుం వసూలు వసూలు చేశారు. చలానాలు జనరేట్ చేసినా.. డబ్బు జమ చేయలేదు. వాస్తవంగా 24 గంటల్లో చెల్లించాల్సి ఉంది. అడిగే వారు లేరని వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారు. అత్యధికంగా అరుణాచలంవీధిలో సచివాలయం రూ.1,91,765, ఆనం వెంకటరెడ్డినగర్ రూ.1,13,040 చెల్లించాల్సి ఉంది. అధికారులు మొండి బకాయిలుగా పరిగణించారు.

**రూ.5,74,686 జమ కావాల్సి ఉంది : వైవో నందన్, అదనపు కమిషనర్**
వార్డు సచివాలయాల్లో ప్రజలు చెల్లించిన రుసుం వెంటనే ఖాతాకు జమ చేయాలి. వ్యక్తిగత అవసరాలకు వాడుకునేందుకు వీలులేదు. సమావేశాలు, టెలీకాన్ఫరెన్స్‌లో అనేకసార్లు ఆదేశించాం. 21వ తేదీ నాటికి 44 సచివాలయాల ద్వారా రూ.5,74,686 జమ కావాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగుల జీతం నుంచి రికవరీ చేసేలా ఉత్తర్వులు జారీ చేశాం.

## లెక్కలేనితనం.. ధిక్కరణలే సాక్ష్యం

నెల్లూరు: ప్రతి వారం ఏదో ఒక కేసు విషయంలో న్యాయ స్థానానికి హాజరుకావాల్సి వస్తోంది. సకాలంలో అఫిడవిట్ దాఖలు చేయడంలో మీకొచ్చిన ఇబ్బంది ఏమిటీ? పిటిషనర్ సమస్య తీర్చదగినదైతే.. చేసేయండి. లేదంటే నిబంధనల ప్రకారం ఎందుకు చేయలేమో కోర్టుకు చెప్పండి. దీనిపై ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. మీకు వంద పనులు ఉండొచ్చు. సకాలంలో కోర్టుకు కౌంటర్ దాఖలు చేయాల్సిందే. ఈ పని చేయడానికి నెలలకు నెలల సమయం ఎందుకు తీసుకుంటారో అర్థం కాదు. ఈ పరిస్థితి ఇకపై జిల్లాలో ఉండకూడదు.’
జిల్లాలో భూ సంబంధిత సమస్యలు సృష్టించడంలో.. వాటిని సాగదీయడంలో.. కొందరు అధికారులు సిద్ధహస్తులు. ఏళ్లుగా సాగులో ఉన్న భూముల యజమానుల పేర్లు.. రికార్డుల్లో ఒక్కసారిగా మారిపోతాయి. ప్రభుత్వ భూములు వారసత్వంగా వచ్చినట్లు దస్త్రాల్లో నమోదవుతాయి. అంతేనా.. అసైన్డ్ భూముల పంపిణీ, పరిరక్షణ, ఆక్రమణల నిరోధం, ఇనాం, చుక్కల భూములు, ఇతర వ్యవహారాలకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. కొందరు అధికారులు అనుకున్నదే చేస్తారు. కాసులు పడందే దస్త్రాలు ముట్టరు. దీంతో మండల స్థాయి మొదలు జిల్లా అధికారుల చుట్టూ తిరిగి అలసి.. విసిగి.. గత్యంతరం లేని పరిస్థితుల్లో కోర్టులను ఆశ్రయిస్తున్నవారే జిల్లాలో అధికం. పోనీ.. కోర్టు నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతైనా పనిచేస్తారా? అంటే అదీ లేదు. ఒక వేళ నిబంధనల ప్రకారం చేయదగ్గది కాకపోతే.. ఆ విషయం



న్యాయస్థానానికి చెప్పడంలోనూ తాత్సారమే. ఫలితంగా సదరు వ్యక్తులు కోర్టు ధిక్కరణకు వెళుతుండగా.. ఉన్నతాధికారులు కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీనిపై జేసీ కార్తీక్ మాట్లాడుతూ.. కోర్టు కేసులపై ఎప్పటికప్పుడు రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్నాం. అఫిడవిట్‌లు దాఖలు చేయాలని సూచిస్తున్నాం. దీంతో పాటు ప్రత్యేకంగా లీగల్ సెల్ ఏర్పాటు చేశాం. కోర్టు ధిక్కరణకు వెళ్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు.

**ఒక్క నెల్లూరు డివిజన్‌లోనే..** జిల్లాలో భూ సంబంధిత వివాదాలు పరిష్కారం కాక దాదాపు 833 మంది కోర్టును ఆశ్రయించగా- వీటిలో నెల్లూరు డివిజన్‌లో 286, ఆత్మకూరులో 133, కావలి డివిజన్‌లో 163, కందుకూరులో 192 కేసులు ఉన్నాయి. నెల్లూరులో అత్యధికంగా 74 కేసులకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. 58 కేసుల్లో కోర్టు ధిక్కరణ నోటీసులు అందగా.. వీటిలోనూ ఇంకా పదింటికి కౌంటర్ వేయాల్సి ఉంది. వీటినైనా పూర్తి చేయాలని కలెక్టర్, జేసీలు చెబుతుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పలు శాఖల్లో చాలా మందికి కనీసం కౌంటర్ వేయడం కూడా రాదు. గతంలో శిక్షణ ఇప్పించినా.. ఉపయోగం లేకుండా పోయిందని సంబంధిత అధికారులే చెబుతుండటం గమనార్హం.

# గుట్టుగా ‘సామాజిక తనిఖీలు’



పాలకోడేరు : జిల్లాలో పాలకోడేరు, పాలకొల్లు మండలాల్లో వారం రోజులుగా జరుగుతున్న సామాజిక తనిఖీల తీరు విస్మయం కలిగిస్తోంది. అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని బూచిగా చూపి కనీసం షెడ్యూలు ప్రచురించకుండా, మైకు ప్రచారం, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులకు సమాచారం లేకుండా గుట్టుగా తనిఖీలు నిర్వహిస్తుండటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**మొక్కుబడి తంతుగా..** పాలకోడేరు మండలంలో 14 గ్రామాలు ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో సుమారు రూ.6 కోట్ల విలువైన పనులు చేశారు. వీటిలో సుమారు రూ.4 కోట్లు వేతనాలుగా, రూ.2 కోట్లు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు. దాదాపు అన్ని గ్రామాల్లో వైకాపాకు చెందిన సర్పంచులు ఉండటం, వారి వర్గీయులనే క్షేత్ర సహాయకులుగా నియమించుకొని నిధులు కొల్లగొట్టారనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మోగల్లు గ్రామంలో క్షేత్ర సహాయకుడిపై వచ్చిన ఆరోపణలపై డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. విస్సాకోడేరు, పెన్నాడ, వేంద్ర, గొరగనమూడి, పాలకోడేరు, కుముదవల్లి గ్రామాల్లోనూ అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో తనిఖీలు పక్కాగా జరిగితే అక్రమాలు బయటపడతాయనే భావనతో గ్రామస్థులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మొక్కుబడి తంతుగా తనిఖీలు ముగించేస్తున్నట్లు కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు.

**ముందే సర్దుబాట్లు..** మండలంలో ఈ నెల 17న తనిఖీలు మొదలు కాగా శనివారంతో ముగిశాయి. కానీ తనిఖీల విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. అంతకు ముందే మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ పనులకు సంబంధించిన ఎం.బుక్‌లు, దస్త్రాలను క్షేత్ర సహాయకులతో హడావుడిగా నమోదు చేయించారు. తనిఖీల సమయంలోనూ ఇలాంటి సర్దుబాట్లే జరిగినట్లు కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. ‘ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో గ్రామసభలు నిర్వహించడం లేదు. ప్రజావేదిక సభ ఈ నెల 24న కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో జరుగుతుంది. క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించిన అనంతరం అభ్యంతరాలను నమోదు చేస్తాం’ అని సామాజిక తనిఖీ విభాగం ఎస్ఆర్‌పీ ఎం.గోవింద తెలిపారు.

# వెంటిలేటర్ల ప్రాణాలు తీశారు!



భీమవరం : ప్రాణాపాయ స్థితిలో ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన వెంటిలేటర్లు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. కొవిడ్ సమయంలో రూ.కోట్లు వెచ్చించి వెంటిలేటర్లు కొనుగోలు చేశారు. గత వైకాపా పాలకులు అధునాతన పరికరాలను అందుబాటులోకి తేవాలన్న కనీస ఆలోచన చేయలేదు. ఫలితంగా ప్రభుత్వాసుపత్రుల్లో యంత్ర సామగ్రి నిరుపయోగంగా మూలకు చేరాయి. కూటమి ప్రభుత్వ హయాంలో వినియోగంలోకి తీసుకొస్తే ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరవయ్యే అవకాశముందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ప్రాంతీయాసుపత్రికి ఏడేసి.. జిల్లాలోని ఒక్కో ప్రాంతీయాసుపత్రికి రూ.35 లక్షలు విలువైన 7 వెంటిలేటర్లు కేటాయించారు. వీటి అమరికకు గదులు, పడకలు సిద్ధం చేశారు. అయితే చిన్నపాటి సాంకేతిక ఇబ్బందులున్న సాకుతో వాటిని పక్కన పెట్టేశారు. భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రుల్లో వీటిని ఉపయోగించాలంటే సాంకేతికంగా శిక్షణ పొందిన నిపుణులు ఉండాలి. జనరల్ మెడిసిన్, ఇతరత్రా వ్యాధులకు చికిత్సలు అందించే వైద్యులు, శిక్షణ పొందిన సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది.
కొవిడ్ రెండో దశ ఉద్ధృతి సమయంలో పాలకొల్లుకు చెందిన ఓ వ్యక్తికి వెంటిలేటర్ వైద్యం అవసరమైంది. భీమవరం లేకపోవడంతో ఏలూరు తీసుకెళ్లారు. అక్కడా పడల్లేకపోవడంతో.. అక్కణ్నుంచి గుంటూరుకు తరలించేలోపు మృతి చెందారు. భీమవరానికి చెందిన ఓ మహిళకు ఇటీవల అత్యవసరంగా వెంటిలేటర్ అవసరమైంది. భీమవరం ప్రాంతీయాసుపత్రికి తరలిస్తే.. ఏలూరు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అత్యవసర వాహనంలో తరలిస్తుండగా.. మార్గం మధ్యలో ఆమె ప్రాణాలు విడిచారు.
వినియోగంలోకి తీసుకొస్తాం ప్రభుత్వ, ప్రాంతీయ ఆసుపత్రుల్లో అనుభవజ్ఞులైన సిబ్బంది, మత్తు వైద్యులు లేకపోవడంతో వెంటిలేటర్లు వాడలేకపోతున్నాం. పని చేయని వెంటిలేటర్ల విషయాన్ని ఏజెన్సీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా వెంటిలేటర్లను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. పి.సూర్యనారాయణ, ప్రాంతీయాసుపత్రుల పర్యవేక్షణాధికారి, భీమవరం

# ఆనవాళ్లు లేని మార్కెట్టు యార్డులు



పెనుగొండ : అన్నదాతకు ఎంతో దగ్గరైన వ్యవసాయ మార్కెట్ యార్డులను అయిదేళ్ల వైకాపా పాలనలో దూరం చేసింది. పుంత రోడ్ల అభివృద్ధి, రైతుబంధు పథకాలు, ఉచిత పశువైద్య శిబిరాలు, ధరలు లేనప్పుడు ధాన్యం నిల్వ పెట్టుకునే సదుపాయాలు గతంలో తెదేపా ప్రభుత్వం కల్పించింది. కానీ గత అయిదేళ్లు ఆదాయం ఉన్నా అభివృద్ధి సున్నా అన్నట్టుగా వీటి పరిస్థితి ఉంది.
రైతులకు నిరాశ.. మార్కెట్ శాఖ నిధులతో గతంలో ప్రతి నియోజకవర్గంలో పుంత రోడ్లు నిర్మించారు. ఆచంటతో పాటు అన్ని నియోజకవర్గాల్లో 30 నుంచి 50 పుంత రోడ్లు అభివృద్ధి చేశారు. వైకాపా అయిదేళ్ల పాలనలో ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన పంటను ఒడ్డుకు చేర్చుకోవడానికి సరైన దారులు లేక ఇబ్బందులు పడుతున్నారు.
ఖాళీగా గోదాములు జిల్లాలో 60 వేలకు పైగా సామర్థ్యం ఉన్న 64 గోదాములు అందుబాటులో ఉన్నా.. అవి రైతులకు ఉపయోగపడకుండా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆచంట వంటి పలు చోట్ల కొన్ని గోదాముల పైకప్పులు దెబ్బతిన్నాయి. గోడలు బీటలు తీశాయి. పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.39 కోట్లకు పైగా ఏఎంసీలు ఆదాయం పొందాయి. అయినా వాటి అభివృద్ధికి పైసా కూడా ఖర్చు చేయలేదని రైతులు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏఎంసీలకు పూర్వవైభవం తీసుకుని రావాలని కోరుతున్నారు.
పైసా ఖర్చు చేయక.. వైకాపా ప్రభుత్వంలో ఏఎంసీల ద్వారా రైతుల ప్రయోజనాలకు పైసా ఖర్చు చేయకపోవడంతో పాలకవర్గాలకు ప్రాధాన్యత లేకుండా పోయింది. అన్ని యార్డుల్లో సిబ్బంది కొరత ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. తెదేపా అధికారంలో ఉండగా భీమవరం రూ.1.50 లక్షలు, ఆచంట వంటి చోట్ల రూ.55 లక్షలు, ఏఎంసీ నిధులతో పాటు నియోజకవర్గానికి రూ.20 నుంచి రూ.50 లక్షలు ఉపాధి నిధులు కేటాయించింది. వైకాపా పాలక వర్గాలు వచ్చిన తరువాత పనులు నిలిచిపోయాయి. ఏఎంసీలపై పర్యవేక్షణ లేకుండా పోయింది.

## కార్మిక బీమా.. కొండంత ధీమా..!

శ్రీకాకుళం : కార్మిక రాజ్య బీమా.. వ్యవస్థీకృత రంగంలో పని చేసేవారికి అండగా నిలిచే పథకం ఇది. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రయోజనాలు అందిస్తున్నాయి. అవగాహన లేక చాలా మంది వాటిని పొందలేకపోతున్నారు. రేపు కార్మిక రాజ్య బీమా సంస్థ(ఈఎస్ఐసీ) దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పరిస్థితిపై ప్రత్యేక కథనం..
రణస్థలం మండలంలోని పైడి భీమవరంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ, శ్రీకాకుళం నగరంలో శాఖా కార్యాలయం ఉన్నాయి. జిల్లాలో సుమారు 30 వేల మంది కార్మికులు ఉండగా.. పైడిభీమవరం డిస్పెన్సరీ పరిధిలో 23 వేల మంది వరకు నమోదయ్యారు. ఇక్కడ పూర్తిస్థాయి భవనం సమకూరినప్పటికీ డిస్పెన్సరీలో రెగ్యులరు వైద్యుడు లేరు. పది పడకలతో కూడిన డయాగ్నోస్టిక్ సెంటరు, ఐదుగురు వైద్యులను నియమిస్తామని ఆసుపత్రి ఏర్పాటు సమయంలో జీవోలో పేర్కొన్నా జరగలేదు. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న విజయనగరం జిల్లా గరివిడి డిస్పెన్సరీ వైద్యుడు రెండు రోజులకోసారి ఇక్కడికి వస్తున్నారు. ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నప్పటికీ రోగ నిర్ధారణ పరీక్షలు చేసే పరికరాల్లేవు. జిల్లాలో లోకల్ ఆఫీసు సౌకర్యం లేకపోవడంతో సెలవు పెట్టిన రోజులకు వేతనం పొందాలంటే విజయనగరం వెళ్లాల్సి వస్తోంది. కార్మికులు అస్వస్థతకు గురైనప్పుడు, కార్మికురాలు ప్రసవించినప్పుడు, ఉద్యోగ నిర్వహణలో ప్రమాదాలకు గురైనప్పుడు, ఇతర పరిస్థితుల్లో వైద్య సౌకర్యం కల్పిస్తారు.
ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకూ వైద్య సేవలు, రోగనిర్ధారణ పరీక్షలు ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా అందిస్తారు.
పని చేయలేని పరిస్థితుల్లోనూ వైద్యుని ధ్రువీకరణపై ఆర్థిక సాయం పొందొచ్చు. కార్మికుడు విధి నిర్వహణలో ఉన్నప్పుడు, ఉద్యోగానికి వెళ్తున్నప్పుడు ప్రమాదం జరిగి మృతి చెందితే వారిపై ఆధారపడిన వారికి నెలవారీ పింఛను రూపంలో ఇస్తారు.



స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన బీమాదారులు వారి జీవిత భాగస్వామికి ఏడాదికి రూ.120 ముందుగా చెల్లిస్తే ఆయన మరణించినా ఆమె వైద్య సేవలు పొందే వీలుంటుంది.ః ప్రసవం, కొన్ని శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి నిర్దేశిత రోజులకు వేతనం చెల్లిస్తారు. ఏదైనా సంస్థ, పరిశ్రమలో కనీసం పది మంది కార్మికులు ఉండి.. వారిలో రూ.21 వేలు కంటే తక్కువ జీతం ఉన్నవారంతా ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు. వారి పేరున ఆయా సంస్థలు ఇచ్చే వేతనంపై యజమాని వాటాగా 3.25 శాతం, కార్మికుడి వాటాగా 0.75 శాతం ఈఎస్ఐకి జమ చేయాలి. దీని ద్వారా కార్మికులు అనారోగ్యం పాలైనా, ఇతర ఏ సమస్య వచ్చినా ఈఎస్ఐసీ ద్వారా లబ్ధి పొందవచ్చు.

**ఆయా సంస్థలపై చర్యలు తప్పవు..**
అర్హులైన కార్మికులను ఆయా సంస్థలు ఈఎస్ఐ పరిధిలోకి చేర్చాలి. లేకుంటే చర్యలు తప్పవు. అర్హులందరి వివరాలు శ్రమ సువిధ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అవగాహన లేనివారు శ్రీకాకుళం నగరంలో బలగలోని ఈఎస్ఐ శాఖ కార్యాలయాన్ని సంప్రదించొచ్చు. - ప్రజ్ఞ, ఈఎస్ఐ కార్యాలయం బ్రాంచి మేనేజరు,

## అడుగంటిన గొట్టా..!

శ్రీకాకుళం : వంశధార ఆయకట్టు పరిధిలో రబీ సాగు చేస్తున్న రైతన్నలకు నీటికష్టాలు తప్పలేదు. క్యాచ్‌మెంట్ ఏరియా ఒడిశాలో గతేడాది అక్టోబరు నుంచి వర్షపాతం నమోదు కాకపోవడం తో గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఫలితంగా కుడి, ఎడమప్రధాన కాలువలకు సాగు నీరు అందించలేని పరిస్థితి నెలకొంది.

**ఎడమ కాలువకు అరకొర..**
బ్యారేజీ వద్ద కనీస నీటిమట్టం 36 మీటర్లుంటేనే కుడి ప్రధాన కాలువకు విడిచిపెట్టే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బెడ్ లెవెల్ 35 మీటర్ల నీటి మట్టం మాత్రమే నీరుంది. ఈ నిల్వతో ఎడమ ప్రధాన కాలువకు కేవలం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగలుగుతున్నారు. నీటి ప్రవాహం జలుమూరు మండలం వరకు మాత్రమే చేరుతోంది.

**డెడ్ స్టోరేజీ..**
వంశధార జలాశయంలో డెడ్ స్టోరేజీ (2 టిఎంసీలు) నిల్వ ఉంది. కుడి ప్రధాన కాలువకు విడిచిపెట్టేందుకు అవసరమైనంత నీరు లేకపోయినప్పటికి ఇటీవల ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు రవీంద్ర, రైతుల వినతి మేరకు జలాశయ గర్భంలో పొక్లెయినర్‌తో కాలువ తవ్వి లింకు కాలువ ద్వారా కుడి కాలువలకు నీరు విడిచిపెట్టారు. నీటి మట్టం తగ్గడంతో ఈ సరఫరా నిలిచిపోయింది.

**వర్షాభావంతో ఇక్కట్లు**
సాధారణంగా 300 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంటేనే కాలువలకు నీరు విడిచిపెట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం గొట్టాబ్యారేజీ వద్ద 130



క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లోను సరైన వర్షాలు లేకపోవడంతో వరద కాలువ ద్వారా జలాశయంలోకి నీటిని నింపలేకపోయారు. దీంతో ఇప్పుడు సమస్య నెలకొంది.

**జలాశయపనులు పూర్తయితేనే పరిష్కారం**
జిల్లాలో సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం వంశధార జలాశయంతోనే సాధ్యం. 17 ఏళ్ల వ్యవధిలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన బిల్లులు మంజూరైతే గుత్తేదారు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే వచ్చే ఖరీఫ్ నాటికి జలాశయంలో 19 టీఎంసీల నీటి నిల్వ చేసుకునేందుకు వీలు కలుగుతుంది. తద్వారా జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. ఇన్‌ఫ్లో తగ్గడంతో సమస్య.. నది క్యాచ్‌మెంట్ ప్రాంతం ఒడిశాలో వర్షాల్లేకనే సమస్య నెలకొంది. రబీలో అనధికారికంగా నీరు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ సరిపడేంత లేకనే ఈ పరిస్థితి. ఉన్న నీటిని రైతులు పొదుపుగా ఉపయోగించు కోవాలి. ఎత్తిపోతల పథక పనులు 36 శాతం జరిగాయి. వీటితో జలాశయం పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు నీరందిస్తాం.- తిరుపతిరావు, వంశధార ఎస్ఈ, శ్రీకాకుళం

చురకలు



# దస్త్రం తొక్కిపెట్టి.. టీడీఆర్‌లు కట్టబెట్టి

విశాఖపట్నం: ఓ కీలక దస్త్రాన్ని అధికారుల కమిటీ తొక్కిపెట్టింది. గత ప్రభుత్వంలో వైకాపా నేతల ఒత్తిళ్లతో నివేదికల్లో ఎక్కడా ఆ దస్త్రం గురించి ప్రస్తావించలేదు. సుమారు రూ.200 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు అనుకున్నవారికి కట్టబెట్టేశారు. స్థల యజమానికి ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వడం, మళ్లీ అదే స్థలంలో ఆక్రమణదారులకు నాలుగు రెట్లు టీడీఆర్‌లు ఇవ్వడం ప్రస్తుతం కలకలం రేపుతోంది.గోశాల నుంచి అడవివరం వరకు సింహాచలం బీఆర్టీఎస్ రహదారి విస్తరణ గతంలో చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా సింహాచలం దేవస్థానం భూములు కొంత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ 2012లో దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా సర్వే నెంబరు 26లో 7 ఎకరాల భూమిని ముడసర్లోవలో కేటాయించింది. దాని విలువ ఇప్పుడు రూ.500కోట్ల వరకు ఉంటుంది. స్థలానికి స్థలం ప్రత్యామ్నాయంగా ఇచ్చినా మళ్లీ అక్కడున్న ఆక్రమణదారులకు కొన్ని నెలల క్రితం టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. 2.72 ఎకరాల భూమికి సంబంధించి 210పైగా బాండ్లు మంజూరు చేశారు. వాటి విలువ సుమారు రూ.200కోట్లు పైమాటే. గజం రూ.35వేల చొప్పున దానికి



నాలుగు రెట్లుగా గజానికి రూ.1.40లక్షల బాండ్లు ఇచ్చారు. టీడీఆర్‌లు అందుకున్న వారిలో కొందరు వైకాపా నాయకులున్నారు.

**అనుకూలంగా రాసిచ్చేశారు..**

టీడీఆర్‌ల మంజూరుపై తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్, జీవీఎంసీ రెవెన్యూ అడిషనల్ కమిషనర్, సీసీపీ అధికారులతో పరిశీలన కమిటీ వేశారు. గతంలో దేవస్థానానికి జీవీఎంసీ స్థలం ఇచ్చిందని ఎక్కడా పొందుపర్చకుండా, పరిశీలన కమిటీ టీడీఆర్‌లు మంజూరు చేయడానికి అనుకూలంగా నివేదిక ఇచ్చిందనే విమర్శలున్నాయి. వాస్తవానికి దేవస్థానానికి భూమి ప్రత్యామ్నాయంగా ఇస్తూ, ఆక్రమణదారులకు కూడా టీడీఆర్‌లు ఇస్తున్నామని నివేదికలో రాయాలి. అలా రాయకపోగా, రిజిస్టర్ గిఫ్ట్‌డీడ్ ద్వారా టీడీఆర్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, నోటరైజ్డ్ అఫిడవిట్ మీద టీడీఆర్‌లు ఇచ్చేయొచ్చని ఉచిత సలహా ఇచ్చారు.

**తాజా నివేదికల్లోనూ ఆ దస్త్రం లేదు..**

బీఆర్టీఎస్ విస్తరణలో ఇప్పటికే 210 టీడీఆర్ పత్రాలు ఇచ్చారు. అయితే పలు ఆరోపణల నేపథ్యంలో వాటిని వినియోగించకుండా హోల్డ్‌లో పెట్టారు. ప్రస్తుతం ఆ టీడీఆర్‌ల వినియోగానికి అవకాశం కల్పించాలంటూ కొందరు పావులు కదిపారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం దీనిపై తాజాగా నివేదిక కోరగా, జీవీఎంసీ అధికారులు ఆగమేఘాలపై జిల్లా కలెక్టర్‌కు దస్త్రం పంపారు. అందులోనూ దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూమికి సంబంధించి దస్త్రం చూపకపోవడం గమనార్హం. పాత టీడీఆర్‌లు విడుదల చేయడంతోపాటు... కొత్తగా మరో 186 టీడీఆర్‌లు ఇవ్వాలంటూ కొందరు నాయకులు అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.

# తాగినా.. తాకినా రోగాలే

నంద్యాల : ఉమ్మడి జిల్లా ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తున్న తుంగభద్ర, హంద్రీ, కృష్ణా, కుందూనదులు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. నీటిలో కోలిఫాం బ్యాక్టీరియా అసలు ఉండకూడదు. కర్నూలు మండలం పంచలింగాల, తాండ్రపా డు, మామిదాలపాడు, జొహరాపురం తదితర ప్రాంతాల్లో తుంగభద్ర నీటిలో ఈ బ్యాక్టీరియా ఉన్నట్లు తేలింది. కోలిఫా 50 సీఎఫ్‌యూ దాటితో కచ్చితంగా ఆ నీటిని శుద్ధిచేసి తాగాలి. డయేరియా తదితర వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. ఈ నీళ్లతో నేరుగా స్నానం చేసినా చర్మవ్యాధుల బారినపడాల్సి ఉంటుంది.

**జలచరాల ఉక్కిరిబిక్కిరి**

జలచరాలు మనుగడ సాగించాలంటే నీటిలో కరిగిన ఆక్సిజన్ (డీవో) తగు మోతాదులో ఉండాలి. లీటరు నీటిలో కనీసం 4 మిల్లీగ్రాములు.. అంతకన్నా ఎక్కువ ఉండాలి. అంతకంటే తక్కువుంటే జలచరాల ప్రాణాలకు ముప్పు కలుగుతుంది. కుందూనది పొడవునా డీవో తక్కువగా ఉంది. నంద్యాల పట్టణ శివార్లలోని ఉడుమాల్పురం నుంచి పాణ్యం మండలం తొగర్చేడు, మద్దూరు, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, గోస్పాడు తదితర మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లో నీటిలో ఆక్సిజన్



3.5 మిల్లీగ్రాముల వరకే ఉంటోందని పరీక్షల్లో వెల్లడైంది.

**నదుల్లోకి నేరుగా మురుగు**

తుంగభద్ర నదిపై 11 సీపీడబ్ల్యూ పథకాలు నడుస్తున్నాయి. 133 గ్రామాల పరిధిలోని సుమారు 3 లక్షల మందికి ఈ నీళ్లే ఆధారం. కర్నూలు నగరం నుంచి రోజూ విడుదలవుతున్న 60 ఎంఎల్‌డీ మురుగునీరు నేరుగా నదిలో కలుస్తోంది. సాధారణంగా మురుగునీటిలో కోలిఫాం 100 మి.లీకు సగటున 600 సీఎఫ్‌యూ ఉండాలి. తుంగలో ఇది 1100- 1200 సీఎఫ్‌యూ దాటుతున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి చెబుతోంది.

నంద్యాల పురపాలక సంఘంలో రోజూ 30 ఎంఎల్‌డీ మురుగునీరు నేరుగా కుందూనదిలోకే వదలుతున్నారు. ఈ మురుగులో కోలిఫాం 1000 సీఎఫ్‌యూ వరకు ఉంది.

ఉమ్మడి జిల్లాలో 306 కి.మీలు ప్రవహించే కేసీ కాల్వ మురుగు కూపంగా మారింది. పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు వదులుతున్నారు. నంద్యాల పట్టణ శివార్లలోని విత్తన శుద్ధి కేంద్రాల వారు వ్యర్థ జలాలను కేసీలోకి కలుపుతున్నారు.

**టర్బిడిటీతో సమస్యలు** నీటిలో 1- 4 పాయింట్ల వరకు టర్బిడిటీ ఉండాలి. పరిమితి దాటితే మట్టితో సహ ఇతర కణాలు దెబ్బతింటాయి. పశ్చిమ ప్రాంతంలోని గోనెగండ్ల, మంత్రాలయం, కౌతాళం ప్రాంతాలతో పాటు తూర్పు ప్రాంతలోని ఆత్మకూరు, కొలిమిగుండ్ల మండలాల్లో అర్బిడిటీ అధికంగా ఉంది. ఈ నీటిని పంటలకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాంతాల్లో మొక్కలకు సరిగ్గా ఆక్సిజన్ అందడం లేదని గతంలోనే వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

# కుట్టు శిక్షణకు పూర్వ వైభవం వచ్చేనా?



రాయదుర్గం : రాయదుర్గం ప్రాంతంలో గార్మెంట్ పరిశ్రమను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2017లో తెదేపా ప్రభుత్వ హయాంలో కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) ఏర్పాటు చేశారు. ఏడాదికే రూ.కోటి వ్యయంతో అధునాతన యంత్రాలు ఏర్పాటు చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ గ్రామీణ ప్రాంతాల మహిళలకు శిక్షణ ఇచ్చేవారు. వారికి భోజన వసతితోపాటు ఆటో ఛార్జీలు చెల్లించడంతో అప్పట్లో ఎక్కువ మంది గార్మెంట్ పని నేర్చుకున్నారు. శిక్షణ పొందిన మహిళలు ప్రస్తుతం పలు గార్మెంట్ దుకాణాల్లో పనులు చేస్తున్నారు. 2019లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్రం మూతపడింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ఐదేళ్లలో కేవలం 30 మందికి మాత్రమే శిక్షణ ఇచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

**యంత్రాలకు తుప్పు** ఐదేళ్లపాటు ఈ కేంద్రాన్ని తెరవకపోవడంతో కుట్టు యంత్రాలు తుప్పు పట్టాయి. దుమ్ము ధూళితో ఇతర పరికరాలన్నీ పనికి రాకుండా పోయాయి. గత ఎన్నికలకు ముందు నెల రోజులు కేంద్రాన్ని తెరిచినప్పటికీ సత్ఫలితాలు ఇవ్వలేదు. ఒక బ్యాచ్‌కు చెందిన 30 మంది మహిళలు శిక్షణ పొందారు. వారికి కూడా పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వకపోవడంతో చాలా మంది మహిళలు నిరాశతో వెనుదిరిగారు. కేంద్రం మూత పడటంతో మున్సిపాలిటీలో పోగుపడిన చెత్తను ఇక్కడి ఆవరణలో పడేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని తెరిపించి, శిక్షణ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

సీఎఫ్‌సీ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేందుకు ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల రాయదుర్గంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించాం. అనుమతులు రాగానే కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి స్థానిక మహిళలకు శిక్షణ ఇస్తాం. గోవిందప్ప, ఇన్‌ఛార్జి ఏసీ

# గడువు నిబంధన లేక.. వసూళ్లు ఆగక!




రాయదుర్గం : ఇంటి స్థలం, వ్యవసాయ భూమి, ఇల్లు, అపార్ట్‌మెంటు ఇలా ఏ స్థిరాస్తినైనా కొనుగోలు చేయాలంటే తొలుత ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), నకలు దస్తావేజులు అవసరం. వీటిని అంతర్జాలం ద్వారా కొంతరుసుం చెల్లిస్తే పొందవచ్చు. అధికారుల డిజిటల్ సంతకంతో కూడిన ఈసీలు, నకలు దస్తావేజులు పొందాలంటే కొంత ఎక్కువగా చెల్లించాలి. ప్రభుత్వ రుసుం చెల్లించినా కొన్ని కార్యాలయాల్లో అమ్యామ్యాలు సమర్పించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒక ఆస్తిపై ఎపుడెపుడు లావాదేవీలు జరిగాయో తెలుసుకోవడానికి ఈసీలు ఉపయోగపడుతాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రుసుం చెల్లించినా ఇంకా జారీ కాని ఈసీల సంఖ్య 600లకు పైగా ఉంటుందని అధికారుల అంచనా. ఒక ఈసీకి (13 ఏళ్ల కాలానికి) రూ. 300, 13 ఏళ్లపైన రూ.600 (యూజర్ ఛార్జీలతో కలిపి) చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న తర్వాత నిర్దిష్ట గడువులోగా జారీ చేయాలన్న నిబంధన ఏదీ లేదు. ఈసీ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లితే ఎంతో కొంత ముట్టజెప్పనిదే జారీ చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలోని అధికశాతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే తంతు కొనసాగుతోంది. నకలు దస్తావేజులు అంతర్జాలం ద్వారా పొందితే రూ.450, అదే సబ్ రిజిస్ట్రార్ డిజిటల్ సంతకంతో కూడినవి కావాలంటే రూ.650 ప్రభుత్వ రుసుం చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న తర్వాత వెంటనే కావాలంటే ఆలస్యం చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో అదనంగా రూ.100 నుంచి 500 వరకు ఇస్తేనే నకలు దస్తావేజులు జారీ చేస్తున్నారు. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రోజుకు 30 నుంచి 60 వరకు ఈసీలు, నకలు దస్తావేజులు జారీ అవుతుంటాయి.

**రూ.1,200 చెల్లించా..** అనంతపురం గ్రామీణంలోని ఒక స్థలానికి మాన్యువల్ ఈసీ కోరా. నిబంధనల ప్రకారం రూ.600 తీసుకోవాలి. సిబ్బంది రూ.1200 తీసుకున్నారు. సగానికి పైగా డబ్బు తీసుకున్నా మాన్యువల్ ఈసీ ఇవ్వడానికి రెండు నెలల సమయం పట్టింది. ఈసీ ఇవ్వడానికి గడువు నిర్దేశించాలి. నారాయణపురం వాసి వసూళ్లు రుజువైతే కఠిన చర్యలు - విజయలక్ష్మి, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ ఈసీలు, నకలు దస్తావేజులకు సంబంధించి అధికంగా వసూలు చేసినట్లు ఫిర్యాదు చేస్తే తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలి.

# ఆమె ఆరోగ్యానికి భరోసా

ఉరవకొండ : గర్భిణుల్లో ప్రధానంగా కనిపించేది పౌష్టికాహార లోపం, రక్తహీనత. వాటి కారణంగా మాతాశిశు మరణాలు సంభవిస్తున్నాయి. ఇలాంటి మరణాలను పూర్తిగా నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏఐ సాంకేతికతతో జననిమిత్ర యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా గర్భిణులు తాము భుజించే ఆహారంలో పౌష్టికత, రక్తం(హిమోగ్లోబిన్) ఎంత ఉందన్న వివరాలను వారే సులభంగా తెలుసుకోవచ్చు. అనంతపురం జిల్లా కూడేరు మండలంలో ప్రయోగాత్మకంగా యాప్‌ను అమలు చేస్తున్నారు. దీని వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రయోగాత్మకంగా కూడేరు మండలంలో అమలు**

జనని మిత్ర యాప్‌ను కూడేరు పీహెచ్‌సీ పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇక్కడ 280 మంది వరకు గర్భిణులు ఉన్నారు. వారిలో 20 మంది వరకు తీవ్ర, మరో 10 మంది వరకు మధ్యరకం రక్తహీనత కలిగి ఉన్నట్లు అంచనా. కూడేరుతోపాటు పామిడి పీహెచ్‌సీల పరిధిలో రక్తహీనత కలిగిన గర్భిణులు అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ముందుగా స్వస్తి సంస్థతో కలిపి కూడేరులో అమలు చేస్తున్నారు. క్రమంగా పామిడిలో అమలు చేసేలా జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని అధికారులు చర్యలు చేపట్టారు.

**వినియోగం ఇలా..**

సెల్‌ఫోన్‌లో గర్భిణీ ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబరు ద్వారా గూగుల్‌లో జననిమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

గర్భిణీకి కేటాయించిన ఆర్‌సీహెచ్ ఐడీ ఆధారంగా ఆమె వ్యక్తిగత వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. ఆ తరువాత నాలుగు అంశాలు ఓపెన్ అవుతాయి.

1. మై హెల్త్ వస్తుంది. అందులో గర్భిణీకి రక్తపోటు, మధుమేహం, ఇతర జబ్బులు ఉన్నాయా? అనే వివరాలు నమోదు చేయాలి. ఆతర్వాత రక్తహీనతను గుర్తించడానికి కింద కనురెప్ప, నాలుక, చేతి గోళ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. వెంటనే రక్తం(హిమోగ్లోబిన్) శాతం వివరాలు తెలుస్తాయి. అది సాధారణంగా ఉందా? మధ్యరకమా? రక్తహీనత తీవ్రంగా ఉందా? అనే వివరాలు వస్తాయి.
2. ఎలాంటి ఆహారం తీసుకోవాలనే వివరాలు చూసుకోవచ్చు.
3. ఆశ కార్యకర్త గర్భిణి ఇంటి సందర్శన వివరాలు నమోదు చేయాలి.
4. గర్భిణి తినే ఆహారం ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దాని ఆధారంగా ఆమె తినే భోజనంలో పౌష్టికత(క్యాలరీస్ రూపంలో) ఎంత ఉందో యాప్ తెలియజేస్తూ అది సరిపోతుందా? మరింత తీసుకోవాలా? అనేది సూచిస్తుంది.

ఆ తరువాత గర్భిణీకి ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే ఎస్‌వోఎస్‌ను టచ్ చేస్తే ఆశ, ఏఎన్ఎం, సంబంధిత పీహెచ్‌సీ డాక్టర్‌కు సమాచారం వెళ్తుంది. వారు గర్భిణీ వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారు.

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం

జనని మిత్ర యాప్‌పై స్వస్తి సంస్థ ప్రతినిధులతో కలిసి గర్భిణులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. యాప్‌ను వినియోగించుకునేలా చూస్తున్నాం. దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నాం. యాప్‌లో కొన్ని సాంకేతిక అంశాలను అధికారులు మెరుగు పరుస్తున్నారు.

# భక్తజన పరవశం.. శ్రీగిరి మార్గం

ఆత్మకూరు : ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలకు నల్లమల చిరునామాగా నిలిచింది. శ్రీగిరికోన శివనామస్మరణతో మార్మోగుతోంది. శివరాత్రికి మల్లికార్జున, అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులు నల్లమలలోని పలు ఆలయాలను సందర్శిస్తున్నారు. ఇక్కడి విశేషాలను తెలుసుకొని ఆనందానుభూతిని పొందుతున్నారు. అరణ్యమార్గంలో 40 కి.మీ: శ్రీశైలానికి కాలిబాటన దర్శించుకోవాలనుకునే వారు తొలుత ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామం నుంచి అరణ్యమార్గంలో 40 కి.మీ.లు ప్రయాణించాలి. వెంకటాపురం నుంచి 6 కి.మీ.లు వెళ్తే గోసాయికట్ట ఆంజనేయస్వామి గుడి వస్తుంది. అక్కడ నుంచి నాగలూటి క్షేత్రానికి 9, దామర్లకుంటకు 8, పెచ్చెర్వుకు 2, మఠంబావికి 6, భీమునికొలనుకు 3, కైలాసద్వారానికి 2, అక్కడ నుంచి 4 కి.మీ.లు నడిస్తే శ్రీశైల మల్లికార్జునస్వామి, అమ్మవార్లను దర్శించుకోవచ్చు. ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి నడకబాటను ప్రారంభించాలి.బ్రిటిష్ కాలం నాటి గ్రామం పెచ్చెర్వు: దామర్లకుంట తర్వాత పెచ్చెర్వు గూడేన్ని సందర్శించొచ్చు. అప్పటి బ్రిటిష్ దొరలు సరకుల రవాణా కోసం ఈ గ్రామాన్ని అభివృద్ధి చేశారు. ఆసుపత్రి శిలాఫలకం, బ్రిటిష్ దొరల కార్యాలయాలు, శిథిల భవనాలు,



పురాతన బావిని చూడొచ్చు.

వీరభద్రుని తాపలు: పెచ్చెర్వు నుంచి కొంత దూరం వెళ్లగానే వీరభద్రుని తాపలు వస్తాయి. ఇక్కడ కొలువైన వీర భద్రుడిని పూజించి మెట్ల మార్గంలో నడిచి వెళ్తారు.

కోర్కెల కొండ: పెచ్చెర్వు నుంచి భీముని కొలనుకు వెళ్లే మార్గంలో మెట్లమార్గంలో కోర్కెల కొండ ఉంటుంది. సంతానం, సొంత ఇళ్లు కావాలనుకునేవారు ముడుపులు కడతారు.

మఠం బావి: బిటిష్‌ల కాలంలో బావిని కట్టించారు. ఈ దారిన వెళ్లే వారు ఈ బావి నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటారు.

గోసాయికట్ట ఆంజనేయ స్వామిగుడి: వెంకటాపురం తర్వాత గోసాయి కట్ట ఆంజనేయస్వామి గుడి వస్తుంది. శాలిబాయి అనే మహిళ ఆవులను ఇక్కడ మేపుతుండటం, అందరూ ఆమెను గోసాయమ్మగా పిలవడంతో ఈ ప్రాంతానికి గోసాయికట్టగా పేరొచ్చింది. అప్పట్లో రాజులు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, భక్తులు గుడిని కట్టించడంతో అందరూ ఇక్కడ పూజలు చేస్తున్నారు.

నాగలూటి వీరభద్రాలయం: గోసాయి కట్ట తర్వాత నల్లమలలో శ్రీశైల ముఖద్వారంగా పేరుగాంచిన నాగలూటి వీరభద్రాలయాన్ని భక్తులు సందర్శిస్తారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేమంగా వెళ్లేలా చూడాలని ఇక్కడి వీరభద్రుడిని మొక్కుతారు. 15వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించారని కొందరు చెబుతుంటే...తాబేలు, పాము, బల్లి వంటి చిత్రాలను బట్టి చాళుక్య రాజులు ఆలయాన్ని నిర్మించారని ఇంకొందరు చెబుతున్నారు.

దామర్ల కుంట: వీరభద్రస్వామిని దర్శించుకున్నాక తర్వాత దామర్లకుంట వస్తుంది. అడవి జంతువులు సంచరించే ప్రాంతమిది. ఇక్కడ నీటి కుంట వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తుంది. సహజసిద్ధమైన ఉప్పు నీటి వనరులు ఇక్కడ ఉన్నాయి. జంతువుల ప్రశాంతతకు భంగం కలగకుండా పాదయాత్ర చేయాలి.

భీముని కొలను: పెచ్చెర్వు నుంచి పాదచారులు భీముని కొలను మీదుగా ప్రయాణించాలి. సముద్రమట్టానికి ఈ ప్రాంతం 585 మీటర్ల ఎత్తున ఉంటుంది. భీమునికొలను నుంచి 60 మెట్లు పైకెక్కితే కైలాసద్వారానికి చేరుకోవచ్చు.

కైలాస ద్వారం: కైలాస ద్వారంలో భక్తులు కైలాసవాసుడ్ని స్మరించుకుంటూ ముందుకు సాగి శ్రీశైల మల్లికార్జున, అమ్మవార్లను దర్శించుకుంటారు.

శిఖర దర్శనం: శిఖర క్షేత్రంలోని నందీశ్వరుని కొమ్ముల మధ్య నుంచి శ్రీశైలక్షేత్రం ప్రధాన గర్భాలయంలోని మల్లికార్జునుడ్ని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల నమ్మకం.

# పేదోళ్లు ఎందరున్నారు

కర్నూలు : విద్యుత్తు సౌకర్యం లేని కుటుంబాలెన్ని ? కట్టెల పొయ్యిపైనే ఎంత మంది వంట చేసుకొంటున్నారు ? పక్కా గృహం లేనివారెందరు ? బ్యాంకు సేవలకు ఎంత మంది దూరంగా ఉన్నారు.. తదితర వివరాలు సచివాలయ సిబ్బంది సేకరించి యాప్‌లో పొందుపరుస్తున్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా కూటమి ప్రభుత్వం పీ4 సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే ఈ ప్రక్రియనే పీ4. పూర్తిగా పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు ఆర్థిక స్థితిమంతులు, ఎన్ఆర్ఐలు సాయం చేస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2 వరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి క్లస్టర్‌లో సర్వే నిర్వహిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13,31,113 కుటుంబాలు



న్నాయి. 12,14,379 కుటుంబాలు రేషన్‌కార్డులు కలిగి ఉన్నాయి. అందులో దారిద్ర్యరేఖకు దిగువనున్న 80 శాతానికి పైగా కుటుంబాల (9,97,724) ఆర్థిక పరిస్థితిపై ఆరా తీస్తున్నారు.

కర్నూలు జిల్లాలో 672 సచివాలయాల పరిధిలో 10,442 క్లస్టర్లు ఉండగా.. ఒక్కో క్లస్టర్‌కు 20 నుంచి 40 కుటుంబాలకు పైగా సర్వే పరిధిలోకి వస్తున్నాయి.

నంద్యాలలో 516 సచివాలయాల్లో 9,249 క్లస్టర్లుండగా.. ఒక్కో క్లస్టర్‌కు సుమారు 20-35 కుటుంబాల వరకు సర్వే పరిధిలోకి వస్తున్నాయి. ఒక్కో సచివాలయ ఉద్యోగి రెండు నుంచి మూడు క్లస్టర్ల పరిధిలోని కుటుంబాలను సర్వే చేస్తున్నారు.

చురకలు



## నాలుగు పదుల వయసులో ఈ అందమేంటి శ్రియా

తెలుగు, తమిళ, హిందీ చిత్ర పరిశ్రమల్లో ఎనలేని అందంతో, నటనతో తనదైన ముద్ర వేసుకున్న శ్రియా సరన్ పేరు చెబితేనే ఓ గ్లామర్ గుర్తొస్తుంది. దాదాపు రెండు తరాల హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకొని ప్రేక్షకులను మెప్పించింది. ఇక ఈ బ్యూటీ, చాలా కాలంగా తన స్టన్నింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాలోను షేక్ చేస్తోంది. అమ్మడు తన కెరీర్ లో గ్లామర్ పాత్రలకు ఎప్పుడూ వెనుకాడలేదు. ఇప్పుడు మళ్లీ ఓ బోల్డ్ అండ్ క్లాసీ లుక్‌తో సోషల్ మీడియా హీట్ పెంచింది. ఈసారి శ్రియా ధరించిన డ్రెస్సు డిజైనర్ మనీష్ మల్హోత్రా స్పెషల్ కలెక్షన్ లోనిది. బ్లాక్ కలర్ డీప్-వీ బ్లౌజ్‌కు మ్యాచ్‌గా మెరిసే సీక్విన్ సారీ, రిచ్ టోన్ లో ఉండటంతో స్టైలిష్ లుక్ అందించడమే కాదు, ఆమె అందాన్ని మరింతగా హైలైట్ చేసింది. బ్యాక్ క్రాస్ బ్లౌజ్ డిజైన్ ఆమె స్టైల్ కి ఇంకొన్ని మార్కులు వేసింది. క్లాసీ హెయిర్ కర్ల్స్, మినిమల్ మేకప్, చిన్న బిందీతో ట్రెడిషనల్ టచ్ ఉండేలా ఆమె స్టైలింగ్ ప్లాన్ చేశారు. ఈ ఫోటోషూట్ లో శ్రియా వేసిన ప్రతి పోజ్ ఫుల్ కాన్ఫిడెన్స్ తో కనిపించింది. ఆమె మైనపు



విగ్రహంలా కనిపించే లుక్స్, ఎక్స్‌ప్రెషన్స్ చూసిన నెటిజన్లు తెగ ఫిదా అవుతున్నారు. "ఏజ్ జస్ట్ నంబర్", "ఫైరింగ్ లుక్", "గ్లామర్‌కు నిర్వచనం శ్రియానే" అనే కామెంట్లతో అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. నాలుగు పదుల వయసులో ఆ అందమేంటి శ్రియా అంటూ మరికొందరు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ఇక ఆమె ఫిట్‌నెస్ చూసి ఆమె వయస్సు ఊహించలేం అనే స్థాయిలో నెటిజన్లు స్పందిస్తున్నారు. ఇన్ స్టాగ్రామ్‌లో ఈ ఫోటోలతో పాటు ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్ అక్షయ్ తీసిన క్లిక్‌లు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఆమె లుక్ కి మేకప్, జ్యువెల్రీ, హెయిర్ స్టైల్ అన్నీ కాంప్లిమెంట్ గా పనిచేశాయి. నెక్స్ట్ ఆమె పలు బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో ఇలాంటి స్టైలిష్ లుక్స్ షేర్ చేస్తూ ఫ్యాషన్ ఐకాన్‌గా నిలుస్తోంది. శ్రియా సరన్ సారీ లుక్ లో ఇచ్చిన ఈ స్టన్నింగ్ ఫోటోషూట్ మరోసారి రుజువు చేసింది.. ఆమె వయసు పెరుగుతున్నా, ఆమె గ్లామర్ మాత్రం రోజురోజుకీ రెట్టింపు అవుతోందని.

## బాలీవుడ్‌లోని ఈ వింత అగ్రిమెంట్ గురించి తెలుసా?

'ఇస్మార్ట్ శంకర్'తో సక్సెస్‌ను దక్కించుకున్న నిధి అగర్వాల్ ఇండస్ట్రీలో ఆశించిన స్థాయిలో స్టార్‌డం దక్కించుకోలేక పోయింది. ఆ సినిమా తర్వాత ఆమె ఎంపిక చేసుకున్న ప్రాజెక్ట్‌లు తీవ్రంగా నిరాశ పరిచాయి. కానీ ప్రస్తుతం చేస్తున్న రెండు సినిమాలు ఆమె స్టార్‌డంను ఎక్కడికో తీసుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్‌తో కలిసి హరి హర వీరమల్లు సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న నిధి అగర్వాల్ మరో వైపు ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమాలోనూ నటిస్తుంది. రాజాసాబ్ సినిమాలో ముగ్గురు హీరోయిన్స్‌లో ఒక హీరోయిన్‌గా నిధి అగర్వాల్ నటిస్తున్న విషయం తెల్సిందే. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను అందుకోబోతున్నట్లు నిధి అగర్వాల్ చాలా ఆశగా ఎదురు



చూస్తుంది. ఆ సినిమాల ఫలితాలపై ఒక క్లారిటీ వచ్చే వరకు నిధి అగర్వాల్ కొత్త ప్రాజెక్ట్‌లను కమిట్ అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఆ రెండు సినిమాలు ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాకున్నా.. నిధి అగర్వాల్ రెగ్యులర్‌గా తన అందమైన ఫోటో షూట్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయడం ద్వారా లేదంటే ఇంటర్వ్యూల కారణంగా వార్తల్లో నిలుస్తోంది. తాజాగా మరో ఇంటర్వ్యూతో నిధి అగర్వాల్ వార్తల్లో నిలిచింది. ఈసారి బాలీవుడ్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం ద్వారా అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. నిధి అగర్వాల్ మొదటి సినిమా హిందీలోనే నటించిన విషయం తెల్సిందే. ఆ హిందీ సినిమాలో నటించేందుకు చేసుకున్న అగ్రిమెంట్ గురించి నిధి అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. టైగర్ ష్రాఫ్ హీరోగా నటించిన 'మున్నా మైకేల్' సినిమాలో నిధి అగర్వాల్ నటించింది. అంతకు ముందు మోడలింగ్ చేసిన నిధి అగర్వాల్ బాలీవుడ్‌లో అవకాశం రావడంతో అగ్రిమెంట్ కనీసం చదవకుండానే సైన్ పెట్టిందట. ఆ అగ్రిమెంట్‌లో హీరోతో డేటింగ్ చేయకూడదని కండీషన్ ఉందట. సినిమా షూటింగ్ పూర్తి అయ్యేంత వరకు హీరోతో రిలేషన్‌షిప్ పెట్టుకున్నట్లు తెలిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ఆ అగ్రిమెంట్‌లో ఉందట. ఆ విషయం తెలిసి నిధి అగర్వాల్ షాక్ అయిందట. ఇలాంటివి కూడా అగ్రిమెంట్‌లో పెడతారా అని ఆ సమయంలో ఆశ్చర్యపోయాను అంటూ నిధి అగర్వాల్ తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.




## డార్లింగ్ ఇంట టేస్ట్ గురించి నిధి అగర్వాల్ కి ఛాన్స్ ఇవ్వడా?



డార్లింగ్ ప్రభాస్ ని ఇష్ట పడనిది..అభిమానించనది ఎవరు? ఒక్కసారి అతడితో కలిసి పనిచేస్తే అతడేంటో తెలుస్తుంది. అందరికీ నచ్చేస్తాడు. కూల్ అండ్ కామ్ గోయింగ్ పర్సన్.

డార్లింగ్ సింప్లిసిటీ చూసి పెద్ద పెద్ద స్టార్లే ఇలా ఉండటం ఎలా? సాధ్యమంటూ ఎన్నోసార్లు చెప్పారు. ఇక హీరోయిన్ల గురించైతే చెప్పాల్సిన పనిలేదు. డార్లింగ్ తో పని చేసిన హీరోయిన్లు అయితే ఆకాశమే హద్దుగా పొగిడేస్తుంటారు. తనతో పని చేసిన నటీనటులకు ఫుడ్ తో ప్రేమను పంచడం డార్లింగ్ కి అలవాటు. అలా వాళ్ల మనసుల్లో గొప్ప స్థానం సంపాదించాడు ప్రభాస్. ఇటీవలే మాళవిక మోహనన్ కూడా డార్లింగ్ గురించి ఓ రేంజ్ లో ఎత్తేసింది. సెట్స్ లో ప్రభాస్ ఉండే విధానం..నడచుకునే తీరు..కురిపించే ప్రేమ గురించి పేజీలు పేజీలు మాట్లాడింది. అయినా ఇంకా చెప్పాలి? అనే కోరిక ఇంకా అలాగే ఉంది. ప్రభాస్ తో కలిసి నటించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపింది. తన జీవితంలో ప్రభాస్ తో పని చేయడం అన్నది గొప్ప మైలు రాయిగా పోల్చింది. అంతకు ముందు ప్రభాస్ తినిపించిన వంటకాల గురించి చెప్పింది. తాజాగా అతడితో ఆన్ సెట్స్ ఎక్స్ పీరియన్స్ ను పంచుకోవడం విశేషం. ప్రస్తుతం ఇద్దరు జంటగా మారుతి దర్శకత్వం వహిస్తోన్న రాజా సాబ్ లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. చిత్రీకరణ క్లైమాక్స్ కు చేరుకుంది.

అన్ని పనులు పూర్తి చేసి సమ్మర్ తర్వాత రిలీజ్ అవుతుందని సమాచారం. ఇదే సినిమాలో నిధి అగర్వాల్ కూడా ఓ హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే రిధి కుమార్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఇంకా చెప్పాలంటే మెయిన్ లీడ్ పోషించేది నిధి అగర్వాల్. కానీ ఈ బ్యూటీ ఇంకా ప్రభాస్ వంటకాల గురించి...ఆయన చూపించే అభిమానం గురించి ఎక్కడా ఓపెన్ అవ్వలేదు. ఆ ఛాన్స్ మాళవిక నిధికి ఇచ్చేలా కనిపించలేదు.

## 'దేవర' జపాన్ ప్రచారం.. భార్యతో కలిసి తారక్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ జపాన్ ఎప్పుడొస్తారా? అని అక్కడి అభిమానులు ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. 'దేవర' మొదటి భాగం మార్చి 28న జపాన్ లో రిలీజ్ అవుతున్న నేపథ్యంలో ప్రచారంలో భాగంగా జపాన్ వెళ్తున్నట్లు విషయం బయటకు వచ్చిన నాటి నుంచి జపాన్ అభిమానుల్లో ఆసక్తి పెరిగిపోతుంది.

ఆయన రాక కోసం కొన్ని రోజులుగా కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు అభిమానులు. ఎన్టీఆర్ వచ్చిన తర్వాత ఆయనతో మాట్లాడాలని..ఫోటోలు దిగాలని...సెల్ఫీలు దిగాలని ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.

ఈ నేపథ్యంలో నేడు ఎన్టీఆర్ సతీసమేతంగా జపాన్ బయల్దేరారు. ఉదయమే బెంగుళూరు విమానాశ్రయం నుంచి జపాన్ ఫ్లైట్ ఎక్కారు. సతీమణితో తారక్ జపాన్ వెళ్లడం ఇది రెండవ సారి. తొలిసారి 'ఆర్ ఆర్ ఆర్' ప్రచారంలో భాగంగా అప్పుడు కూడా ప్రణతీతో కలిసి వెళ్లారు. రామ్ చరణ్- ఉపాసన, రాజమౌళి-రమా ఇలా జోడీలన్ని కలిసి వెళ్లి జపాన్ విను వీధుల్లో ఆర్ ఆర్ ఆర్ ని ప్రచారం చేసారు. ఆ తర్వాత మళ్లీ తారక్ మళ్లీ జపాన్ వెళ్లలేదు. షూటింగ్ కోసం....కొన్ని వేడుకల కోసం ఇతర దేశాలకు వెళ్లినప్పుడు అక్కడ జపాన్ అభిమానులు మళ్లీ తమ దేశం ఎప్పుడు వస్తున్నారని అడిగారు. త్వరగా రావాలని ఆతిద్యం కూడా ఏర్పాటు చేస్తామని పిలుపు చేసారు. 'దేవర' రూపంలో మళ్లీ జపాన్ వెళ్లే అవకాశం దక్కింది కాబట్టి అక్కడ అభిమానులందర్నీ తారక్ పలక రిస్తాడు. వాళ్లతో మాట మంతి చేసి సోదర భావాన్ని పంచుతాడు.

అభిమానులంటే తారక్ ప్రాణం పెడతాడని చెప్పాల్సిన పనిలేదు. తన సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్లకు అభిమానులు వచ్చిన సమయంలో ఎంతో జాగ్రత్తగా తిరిగి ఇంటికి చేరుకోవాలని ప్రతీ వేదికపైనా చెబుతుంటారు.

## రెబా పాప మ్యాడ్ లుక్.. లెగ్స్ అందాలతో స్టన్నింగ్!

2016లో మలయాళ సినిమా 'జాకోబింటే స్వర్గరాజ్యం'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన రెబా మోనికా జాన్%ౌ% తన నటన, గ్లామర్‌తో చక్కటి గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం 'జరుగండి' వంటి తమిళ చిత్రాల్లో నటించి కోలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అటు 'బిగిల్' సినిమాలో కూడా కీలక పాత్ర పోషించి మెప్పించింది. తెలుగు ప్రేక్షకులకైతే 'సామజవరగమన' మూవీ ద్వారా పరిచయం కాగా, అక్కడ తన సహజమైన నటనతో ప్రశంసలు అందుకుంది. మూడు భాషల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటూ మల్టీ ఇండస్ట్రీ యాక్ట్రెస్‌గా నిలిచిపోయింది. ఇక త్వరలో రాబోయే మ్యాడ్ స్క్వేర్ లో కూడా అమ్మడు స్పెషల్ పాత్రలో ఆకట్టుకోనుంది. అయితే తన కెరీర్‌ను సినిమాలతో మాత్రమే కాకుండా, సోషల్ మీడియా వేదికగా కూడా



రెబా నిరంతరం కాప్చర్ చేస్తోంది. ప్రయాణాలు, ఫోటోషూట్స్, ఫీల్ గుడ్ మూమెంట్స్ అన్నీ కూడా తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్యాన్స్‌తో పంచుకుంటోంది. ట్రిప్‌లో ఉన్నా, షూటింగ్‌లో ఉన్నా ఓ నవ్వు, ఓ స్టైల్ మోడ్‌లో రెబా కనిపించటం కామన్‌గా మారిపోయింది. అదే విధంగా ఈసారి కూడా తన గత రాత్రి అనుభూతులను ఓ క్యూట్ క్యాప్షన్‌తో షేర్ చేసింది "గత రాత్రి గురించి" అంటూ హార్ట్ ఐకాన్, ఈవిల్ ఐ ఎమోజీ జత చేస్తూ ఓ స్టన్నింగ్ నైట్ లుక్ ఫోటో సిరీస్‌ను పోస్ట్ చేసింది. ఈ పిక్స్‌లో రెబా మోనికా ఓ బ్రౌన్ లేస్ ఫుల్ హ్యాండ్ డ్రెస్‌లో అదరగొట్టింది. క్యూట్ హీల్ సాండల్స్‌తో వాలుగా చూసేలా ఇచ్చిన స్టైల్ పోజులు అందరినీ మంత్రముగ్ధుల్ని చేశాయి. ప్రత్యేకంగా ఓ ఫోటోలో బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నిలబడి ఇచ్చిన పోజ్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. రెస్టారెంట్ లైట్‌లో పడిన లైటింగ్, రెబా లుక్, ఆమె ఎక్స్‌ప్రెషన్ ఇవన్నీ కలసి ఈ ఫోటోలను ఇంకొక లెవెల్‌కు తీసుకెళ్లాయి. కామెంట్స్‌లో నెటిజన్లు 'ఫైర్', 'గార్జియస్', 'ఫెషన్ ఐకాన్' అంటూ ప్రశంసలతో ఓ రేంజ్‌లో రెస్పాండ్ అవుతున్నారు.

## దేవియాని.. మినీ స్కర్ట్ లో కిర్రాక్ స్టైల్

టాలెంటెడ్ యాక్ట్రెస్ దేవియాని శర్మ తన నటనతో పాటు ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తో కూడా మంచి గుర్తింపు సంపాదించుకుంటోంది. మోడలింగ్‌లో కెరీర్‌ను మొదలుపెట్టిన ఈ ముంబై బ్యూటీ, 'అనగనగా', 'సైతాన్', 'సేవ్ ద టైగర్స్' వంటి వెబ్‌సిరీస్‌ల ద్వారా ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. నటనతో పాటు సోషల్ మీడియాలోనూ విపరీతంగా యాక్టివ్‌గా ఉండే ఈ అమ్మడు.. గ్లామర్ ఫోటోషూట్లతో ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తుంటుంది. ఇక లేటెస్ట్ గా దేవియాని షేర్ చేసిన ఫోటోస్ మరోసారి నెటిజన్లను షాక్‌కు గురి చేశాయి. పింక్ బౌ డిజైన్ ఉన్న ట్రెండీ టాప్, రెడ్ మినీ స్కర్ట్ కాంబినేషన్‌లో స్టైలిష్‌గా కనిపించిన దేవియాని.. డేర్ లుక్‌తో అటెన్షన్ దక్కించుకుంది.



సింపుల్ మేకప్, సాఫ్ట్ కర్ల్ హెయిర్ స్టైల్‌తో ఆమె మోడరన్ ఎలిగెన్స్‌ను ప్రెజెంట్ చేసింది. చేతిపై ఉన్న టాటూ, కిల్ ద లుక్ అనే విధంగా ఇచ్చిన క్యాప్షన్‌తో ఫోటోకు మరింత హైపు వచ్చింది. ఈ లుక్‌లో దేవియాని కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె ఫోటోలో ఉన్న పొజ్, నయన సౌందర్యం చూసిన నెటిజన్లు 'ఫైర్', 'బోల్డ్ అండ్ బ్యూటిఫుల్', 'ఫ్యాషన్ ఐకాన్' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె షేర్ చేసిన ఈ ఫోటోకు "జస్ట్ కిల్ ఇట్" అనే క్యాప్షన్ ఉంది. ఇది ఈ లుక్‌కు ఎంత కాన్ఫిడెంట్‌గా పోజ్ ఇచ్చిందో తెలిపేలా ఉంది. అందం, అభినయం, స్టైల్.. ఈ మూడింటినీ మిక్స్ చేసిన ఈ ముద్దుగుమ్మ.. వెబ్ సిరీస్‌లతో పాటు త్వరలోనే ఫీచర్ ఫిల్మ్‌లకు కూడా ఎంట్రీ ఇవ్వబోతుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఈ మధ్యకాలంలో ఫోటోషూట్స్‌కు ఇచ్చే ప్రాధాన్యత, క్యాప్షన్స్‌కు లోపల ఉన్న భావోద్వేగం చూస్తే.. దేవియాని కెరీర్ మరింత డైనమిక్‌గా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ గ్లామరస్ లుక్‌తో సోషల్ మీడియాలో దుమ్మురేపుతున్న దేవియాని.. తన ఫ్యాషన్ గేమ్‌ను మళ్లీ ఒక లెవెల్‌కు తీసుకెళ్లిందనే చెప్పాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536